PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

# ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 246 | విజయవాడ, ఆదివారం 9 ఏప్రిల్ 2023 | 6 + 8 పేజీలు + స్నేహ వెల : 7. 00

Vol No | Vijayawada, Sunday 9 April 2023 | Rs

ప్రజా ఉద్యమం..
న్యాయపోరాటం

- వాకపల్లి - పూర్వాపరాలు

3

లోపలి పేజీలో..

## ఫైనల్‌కు ప్రియాంశు

- సెమీస్‌లో నుయెన్‌పై వరుస సెట్లలో గెలుపు
- టైటిల్‌కై జొన్నెస్సెన్‌తో ఢీ

## వందేభారత్ రైలు ప్రారంభించిన ప్రధాని

- పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- పరేడ్ గ్రౌండ్ సభలో బిఆర్‌ఎస్‌పై విమర్శలు

లోపలి పేజీలో..

## సుఖోయ్‌లో సుప్రీం కమాండర్ ..

- యుద్ధ విమానమెక్కిన రాష్ట్రపతి ముర్ము

వాయుసేన పైలట్ దుస్తుల్లో సుఖోయ్ 30 ఎంకెఐ యుద్ధ విమానంలో విహరించేందుకు సిద్ధమైన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము. సుఖోయ్‌లో ప్రయాణించిన భారత రెండో మహిళా రాష్ట్రపతిగా ముర్ము రికార్డులకెక్కారు.

(-వార్త లోపలి పేజీల్లో )

### అందరికీ ఆరోగ్యం

## అందనంత దూరంలో...!

- డబ్ల్యుహెచ్‌ఓకు 75 ఏళ్లు

**జెనీవా:** ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఓ) డెబ్బయి అయిదో వార్షికోత్సవ వేళ అందరికీ ఆరోగ్యం ఎండమావిగానే మిగిలిపోయింది. విపరీతంగా పెరిగిపోతున్న ఆర్థిక అసమానతలతో బాటు ఆరోగ్య సంరక్షణ ఒక వ్యాపార సరుకుగా ఎలా మారిపోయిందీ చూస్తున్నాం. కోవిడ్ మహమ్మారి నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య అసమానతలు, దేశాల మధ్య అసమానతలు తీవ్రమయ్యాయి. మహమ్మారి నుండి నేర్చుకోవడంలో వైఫల్యం, వాతావరణ సంక్షోభంపై ధనిక దేశాలు స్పందిస్తున్న తీరు ఆందోళన కలిగిస్తున్నాయి. ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు వంటి ప్రపంచ ద్రవ్య సంస్థలు విధించే షరతులు ప్రజారోగ్య వ్యవస్థను సంకట స్థితిలోకి నెడుతున్నాయి. లాటిన్ అమెరికాలో ప్రగతిశీల, వామపక్ష ప్రభుత్వాలు అధికారంలో ఉన్న చోట ముఖ్యంగా వెనిజులా, బ్రెజిల్, చిలీ, హొండూరస్ వంటి దేశాలు అందరికీ ఆరోగ్యం లక్ష్యం వైపు అడుగులు వేస్తున్నాయి. ప్రజారోగ్య వ్యవస్థను పటిష్టంగా నిర్వహించడంలో సోషలిస్టు క్యూబా ప్రపంచానికే ఆదర్శంగా నిలిచింది. ప్రజారోగ్యాన్ని ప్రైవేటుపరం చేసే నయా ఉదారవాద విధానాలు అమల్లోకి వచ్చాక ఆరోగ్యం అత్యంత ఖరీదయిన సరుకుగా మారిపోయింది. దీనికి వ్యతిరేకంగా యూరప్, ఆసియా, ఆఫ్రికా దేశాల్లో వామపక్షాలు, ప్రజలు, ప్రజా సంఘాలు ఉద్యమిస్తూనే ఉన్నాయి. డబ్ల్యుహెచ్‌ఓ 75వ వార్షికోత్సవం రోజున ఈ ప్రపంచ ఆరోగ్య సంస్థ స్వతంత్ర ప్రతిపత్తిని దెబ్బతీసేందుకు అమెరికా, బ్రిటన్ తదితర దేశాలు ఎలా ప్రయత్నిస్తున్నదీ చూస్తున్నాము. కోవిడ్-19 మహమ్మారి సమయంలో మోడీ ప్రభుత్వం టీకాలను ఉచితంగా ప్రజలకు అందజేయడానికి ఎంతగా మొరాయించినదీ చూశాము. చివరికి సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని సార్వత్రిక వ్యాక్సినేషన్ ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశాక ఉచిత పంపిణీకి అంగీకరించింది. మరో వైపు కార్పొరేట్ ఆసుపత్రుల్లో టీకాలు అమ్ముకునేందుకు అనుమతించింది. ఈ పరిస్థితుల్లో ప్రజలందరికీ ఆరోగ్యం లక్ష్యసాధనకు 'పీపుల్స్ హెల్త్ డిస్పాచ్' కొన్ని సూచనలు చేసింది. పిహెచ్‌సి వ్యవస్థను బలపరచాలని, అందులో పని చేసే యువ కార్యకర్తల సామర్థ్యాన్ని పెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలని, ప్రజారోగ్య రంగానికి జిడిపిలో వాటా గణనీయంగా పెంచాలని కోరింది.

# ఈసారైనా సజావుగా సాగేనా?

**• రబీ ధాన్యం కొనుగోళ్లపై రైతుల ఆందోళన • అంతకంతకూ తగ్గుతోన్న సేకరణ**

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

రబీ ధాన్యం కొనుగోళ్లపై రైతులను అనుమానాలు ముసురుకున్నాయి. ఖరీఫ్‌లో రైతులకు ఎదురైన ఇబ్బందుల దృష్ట్యా రబీలోనైనా సజావుగా ప్రభుత్వం రైతుల నుంచి వరి ధాన్యం కొనుగోలు చేస్తుందా అనే సందేహాలు అన్నదాతల్లో బయలుదేరాయి. నిరుడు రబీ ధాన్యం సేకరణ బాగా తగ్గింది. మొన్న ఖరీఫ్‌లోనూ మునుపటి కంటే సేకరణ లక్ష్యాలను సర్కారు తగ్గించింది. నిర్ణయించిన టార్గెట్‌లో సైతం లక్షన్నర టన్నులు సేకరించలేదు. ప్రభుత్వ వ్యవహారం ఈ విధంగా ఉండటంతో రబీ కొనుగోళ్లపై సందేహాలు కలుగుతున్నాయి.

కాగా వారం రోజుల్లో రబీ ధాన్యం కొనుగోళ్లు ప్రారంభిస్తామని ప్రభుత్వం వెల్లడించింది. ఆర్‌బికెలు, ఇ-క్రాప్, ముందస్తు రిజిస్ట్రేషన్ల పాటే పాడింది. ఎంత పరిమాణంలో రబీ ధాన్యం సేకరిస్తారో స్పష్టంగా టార్గెట్ పేర్కొనలేదు. దాంతో రబీ కొనుగోళ్లపై రైతులు ఆందోళనగా ఉన్నారు.

### సాగు తక్కువే

రబీలో వరి సాధారణ సాగు 19.72 లక్షల ఎకరాలుకాగా ఈ మారు 16.4 లక్షల ఎకరాల్లోనే సాగు నమోదైంది. సర్కారు మాత్రం మూడవ ముందస్తు అంచనాల్లో 19.52 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుందని ఆశించింది. 54.23 లక్షల టన్నుల దిగుబడొస్తుందని పేర్కొంది. ఉత్పాదకత ఎకరాకు సగటున 37 బస్తాల (75 కిలోల బస్తా) వడ్లు లభిస్తాయంది. మరోవైపు వ్యవసాయశాఖ గణాంకాల్లో సాగు 16.4 లక్షల ఎకరాలే. మూడు లక్షల ఎకరాల్లో సాగు తగ్గినందున, ఆ మేరకు 8 లక్షల టన్నుల దగుబడి తగ్గుతుంది. అకాల వర్షాల నష్టాలు ఉండనే ఉన్నాయి. ఏతావాతా 46 లక్షల టన్నుల ఉత్పత్తి లభించే అవకాశం ఉంది. గతేడాది తుది అంచనాల్లో 51.57 లక్షల టన్నుల ఉత్పత్తి వచ్చింది. కాగా ఈసారి నెల్లూరు జిల్లాలో అత్యధికంగా 3 లక్షల ఎకరాల్లో వరి పంట వేశారు. లక్ష ఎకరాలకంటే ఎక్కువ పశ్చిమగోదావరి జిల్లాలో 2.15 లక్షల ఎకరాలు, తిరుపతి 1.88 లక్షల ఎకరాలు, కోనసీమ 1.73 లక్షల ఎకరాలు, కాకినాడ 1.63 లక్షల ఎకరాలు, తూర్పుగోదావరి 1.37 లక్షల ఎకరాల్లో వరి సాగైంది.

**రబీ ధాన్యం సేకరణ (లక్షల టన్నులు)**

| సంవత్సరం | ఉత్పత్తి | సేకరణ |
|---|---|---|
| 2019-20 | 56.97 | 34.73 |
| 2020-21 | 63.29 | 37.24 |
| 2021-22 | 51.57 | 26.65 |

### తగ్గుతోన్న సేకరణ

రబీ ధాన్యం సేకరణ అంతకంతకూ తగ్గుతోంది. కరోనా సంవత్సరాలైన 2019-20లో 34.73 లక్షల టన్నులు, 2020-21లో 37.24 లక్షల టన్నులు సేకరించారు. నిరుడు 2021-22లో 26.25 లక్షల టన్నులే సేకరించారు. ఆ సంవత్సరం జరిగిన ఉత్పత్తిలో 51 శాతం సేకరించారు. 25 లక్షల టన్నుల ధాన్యాన్ని రైతులకే వదిలిపెట్టారు. ఈ తడవ ఏ మేరకు సేకరిస్తారోనన్న ప్రశ్నలొస్తున్నాయి. ధాన్యం ఇచ్చిన రైతులకు సకాలంలో సొమ్ము చెల్లించే విషయంలో ప్రభుత్వం తాత్సారం చేస్తోంది. తేమశాతం, ఇ-క్రాప్, ముందస్తు రిజిస్ట్రేషన్లు, మిల్లర్ల కొర్రీలు, గోనెసంచుల కొరత, రవాణా, హమాలీ ఛార్జీల వంటి సమస్యలతో రైతులు నానా ఇబ్బందులూ ఎదుర్కొన్నారు. కౌలు రైతులకు ప్రభుత్వ కేంద్రాల్లోకి ప్రవేశం లేదు. ఇటువంటి బాధలు పడలేక వచ్చినకాడికి రైతులు తెగనమ్ముకున్నారు. ఈసారైనా ఆ సమస్యలు లేకుండా చూడాలని కోరుతున్నారు.

# రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం

- ప్రజాస్వామ్య విలువలను ధ్వంసం చేస్తోన్న పాలకులు
- రాజ్యాంగ రక్షణ రణభేరి మహాసభలో విసికె జాతీయ అధ్యక్షులు తిరుమావళవన్

అభివాదం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

నేడు మన దేశంలో ప్రజాస్వామ్య విలువలు ధ్వంసమవుతున్నాయని, రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన అత్యవసర పరిస్థితి ఏర్పడిందని విసికె పార్టీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ తిరుమావళవన్ అన్నారు. విడుదలై చిరుతైగల్ కట్చి (విసికె) పార్టీ ప్రథమ రాష్ట్ర మహాసభను పురస్కరించుకొని మదనపల్లె పట్టణంలోని బిటి కళాశాల గ్రౌండ్‌లో ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్ అధ్యక్షతన రాజ్యాంగ రక్షణ రణభేరి మహాసభ శనివారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్ట తిరుమావళవన్ మాట్లాడుతూ పోరాటాల ద్వారా దళితులు, గిరిజనులు, మహిళలు, కార్మికులు, రైతులు ఎన్నో హక్కులు సాధించుకున్నారని గుర్తు చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ డైరెక్షన్లో నడుస్తోన్న కేంద్రంలోని బిజెపి పాలనలో రాజ్యాంగ హక్కులు క్రూరంగా హరించబడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారాన్ని పదిల పర్చుకోవడానికి కుల, మత హింసను ప్రేరేపించి మతాన్ని, దేశాన్ని రాజకీయ లబ్ధి కోసం బిజెపి వాడుకుంటోందని దుయ్యబట్టారు. దేశాన్ని పాలిస్తున్న వాళ్లు ఎంతో ప్రమాదకరమైన వ్యక్తులు కావడం వల్లే రాజ్యాంగాన్ని రక్షించుకుందాం అనే నినాదాన్ని ఇవ్వాల్సి వచ్చిందన్నారు. విభజన హామీలను గాలికొదిలేసి, నిధుల కేటాయింపులో మొండిచేయి చూపి రాష్ట్ర ప్రజల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిన బిజెపిని 2024 ఎన్నికల్లో పాతాళానికి తొక్కేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఆ వైపుగా ప్రజలను చైతన్యవంతం చేసేందుకే రాజ్యాంగ రక్షణ రణభేరి మహాసభను నిర్వహిస్తున్నామని తెలిపారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ మూడు వేల సంవత్సరాలు వెనక్కి దేశాన్ని తీసుకెళ్లి మనువాద పరిపాలన మనపై రుద్దడానికి మోడీ ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. ఈ సమాజంలో బ్రాహ్మణ ఆధిపత్యాన్ని, అగ్రకుల ఆధిపత్యాన్ని తెచ్చి అణగారిన కులాలను, శ్రామికులను, కార్మికులను అణగదొక్కాలని చూస్తున్నారని విమర్శించారు. అంబానీ, అదానీ ప్రయోజనాల కోసం కార్పొరేట్-మతతత్వ పాలన సాగిస్తున్నారన్నారు. అలాంటి వ్యక్తికి ఈ దేశాన్ని పరిపాలించే అర్హత లేదని తెలిపారు. ప్రజలందరికీ సమాన అవకాశాలు, సమాన గౌరవం, మానవ హక్కులను ప్రసాదించిన భారత రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను మిగతా 7లో

## పంజాబ్‌లో పని వేళల మార్పు

- ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 2 వరకు విధులు

**అమృత్‌సర్ :** వేసవి భగభగల నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాల పనివేళలను మార్పు చేస్తున్నట్లు పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ సింగ్ మాన్ శనివారం నాడు ప్రకటించారు. ఈ ఏడాది మే 2 నుంచి జులై 15 వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఉదయం 7.30 గంటలకే తెరుచుకొని మధ్యాహ్నం 2 గంటల వరకూ పనిచేస్తాయని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు త్వరగా తెరిచి వేసవి ఉష్ణోగ్రత పెరగడానికి ముందే మూసివేసినట్లయితే రాష్ట్రంలో విద్యుత్ ఆదా చేయడానికి ఉపయుక్తంగా ఉంటుందని మాన్ తెలిపారు. పవర్ గ్రిడ్‌లపై ఒత్తడి తగ్గి, విద్యుత్ ఆదా జరుగుతుందని చెప్పారు. గత ఏడాది పంజాబ్, ఢిల్లీ, హర్యానాలో బొగ్గు నిల్వల కొరత కారణంగా తీవ్రమైన విద్యుత్ కొరత తలెత్తిన సంగతి విదితమే.

## నేడు, రేపు వేడి గాలులు

లోపలి పేజీలో..

### డిఎస్‌సి-1998 అభ్యర్థులకు

# మినిమం టైం స్కేల్

**• 12, 13 తేదీల్లో కౌన్సెలింగ్ • పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు**

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

డిఎస్‌సి-1998లో అర్హత సాధించిన 4,072 మందిని కాంట్రాక్టు విధానంలో రాష్ట్రప్రభుత్వం ఉపాధ్యాయులుగా నియమించనుంది. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులకు పాఠశాల విద్యాశాఖ కమిషనరు ఎస్ సురేష్ కుమార్ ఆదేశాలతోపాటు కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేశారు. మినిమం టైమ్‌స్కేల్ (ఎంటిఎస్) విధానంలో వీరికి వేతనాలివ్వాలని పాఠశాల విద్యాశాఖ పేర్కొంది. వయసు 60 ఏళ్లలోపు ఉన్నవారిని మాత్రమే తీసుకోవాలని ఆదేశించింది. ఒప్పంద నిబంధనల ప్రకారం సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జిటి)గా నియమించాలని పేర్కొంది. బిఇడి అర్హతతో నియామకాలు పొందిన అభ్యర్థులు ఆరు నెలల ప్రాథమిక విద్య బ్రిడ్జి కోర్సును ఏడాదిలోపు పూర్తిచేయాలని వెల్లడించింది. కొన్ని జిల్లాల్లోని అదనపు పోస్టులను ఇతర జిల్లాల్లో సర్దుబాటు చేశారు. విద్యార్థుల సంఖ్య 20 నుంచి 30లోపు ఉన్న ఏకోపాధ్యాయ పాఠశాలల్లో మాత్రమే అభ్యర్థులను నియమించాలి. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా, ఉపాధ్యాయుల సంఖ్య తక్కువగా ఉన్నచోటకు వీరిని పంపాలి. ఈ నెల 10వ తేదీన జిల్లాల వారీ డిఎస్‌సి-1998 అభ్యర్థుల వివరాలను అధికారులు నిర్ధారించుకుని, 11వ తేదీన వారికి సమాచారం అందించాలి. 12, 13 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహించి, అభ్యర్థులకు పోస్టింగు ఉత్తర్వులు ఇవ్వాలి. ఫిర్యాదులుంటే ఈ నెల 14వ తేదీలోపు పాఠశాల విద్యాశాఖ కమిషనరుకు పంపించాలి.

### కఠిన నిబంధనలతో

## పట్టణ ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్లు భారం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పట్టణ ప్రాంతాల్లో ఆస్తుల రిజిస్ట్రేషన్ కష్టతరం కానుంది. ఆయా ప్రాంతాల్లో డాక్యుమెంట్లన్నీ తనిఖీ చేసుకుని రిజిస్ట్రేషన్ చేయాల్సిన బాధ్యత సబ్ రిజిస్ట్రార్లదేనని సిసిఎల్‌ఎ జారీచేసిన ఆదేశాలపై వారు ఆందోళన చెందుతున్నారు. నిబంధనలు మార్చాలని ఇటీవల రిజిస్ట్రేషన్ల శాఖ ఐజిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇంటి ప్లానుతోపాటు దాని లింకు డాక్యుమెంట్లు, ఆస్తిపన్నును జత చేయాలని, పూర్వీకుల నుంచి సంక్రమిస్తే దానికి సంబంధించిన డాక్యుమెంట్లన్నిటినీ పూర్తిగా తనిఖీ చేయాల్సిన బాధ్యత సబ్ రిజిస్ట్రార్లదేనని సిసిఎల్‌ఎ తాజాగా ఆదేశాలు జారీచేసింది. పట్టణప్రాంత రిజిస్ట్రేషన్లలో అవినీతి, అక్రమాలూ జరుగుతుండటం వల్లే నిబంధనలు కఠినతరం చేశామని రిజిస్ట్రేషన్ల శాఖ చెబుతోంది. రాష్ట్రాలు రుణాలు, ఇతరత్రా నిధులు ఇచ్చేందుకు కేంద్రం అనేక ఆంక్షలు పెడుతోంది. వాటిలో పట్టణ ప్రాంతాల విస్తరణ కీలకంగా ఉంది. కేంద్రం ఆదేశాల మేరకు నగర పంచాయతీలు, కొత్తకార్పొరేషన్ల పరిధి, పట్టణాభివృద్ధి శాఖల పరిధి పెరిగింది. వీటిల్లో గ్రామీణ ప్రాంతాలకు చెందిన, లేఅవుట్ లేని, గతంలోనే పంచాయతీ అనుమతులతో నిర్మించుకున్న ఇళ్లు ఎక్కువ సంఖ్యలో ఉన్నాయి. అప్పటి వరకూ పంటపొలాలు, ఖాళీ స్థలాలుగా ఉన్న భూములు విలీనం కావడంతో పట్టణ ప్రాంతాల్లో ఖాళీ భూముల విస్తీర్ణం పెరుగుతోంది. అటువంటి భూములను గతంలో ఉన్న భూమిస్థితి ఆధారంగా రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. దీంతో రిజిస్ట్రేషన్ల పరంగా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయమూ తగ్గుతోంది. భవిష్యత్‌లో ఈ తరహా లావాదేవీల సంఖ్య పెరుగుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. వాటి నుంచి ఆదాయం రాబట్టుకోవడం కోసం రిజిస్ట్రేషన్లలో రకరకాల ఆంక్షలు పెడుతోంది. కొత్తగా నగర పంచాయతీలుగా మారిన వాటిల్లో చాలా ఇళ్లకు ప్లాన్లు లేవు. అటువంటి వారందరూ ఇప్పుడు మున్సిపాలిటీ నుండో కార్పొరేషన్ నుండో ప్లాను తీసుకోవాల్సి ఉంటుంది. విఎల్‌టి కట్టాలంటే ఏదో ఒకరూపమైన పట్టణ ప్రాంత డాక్యుమెంటు ఉండాలనే నిబంధన ఉంది. దీంతోపాటు మ్యుటేషన్ కూడా పెడుతున్నారు. దీని ప్రకారం పట్టణ ప్రాంతాల పరిధిలోకి వచ్చిన పొలాలను కొనుగోలు చేసిన తరువాత వాటి స్థల స్వభావ మార్పు దానంతట అదే 15 రోజుల్లో మారేలా నిబంధన తీసుకొచ్చారు. దీనికోసం కొంత ట్యాక్స్ రెవెన్యూశాఖకు చెల్లించాల్సి ఉంటుంది. అలా చెల్లించి పట్టణ ప్రాంత పరిధిలోకి వచ్చిన తరువాత ఆ భూమిలో నిర్మాణాలు చేపట్టాలంటే దానికి పట్టణాభివృద్ధిశాఖ ప్లాను తప్పనిసరి చేశారు.

## ఐసిఐసిఐ బ్యాంక్ స్కామ్‌లో సిబిఐ ఛార్జిషీట్

**ముంబయి :** ఐసిఐసిఐ బ్యాంక్ - వీడియోకాన్ క్విడ్ ప్రోకో కుంభకోణంలో సిబిఐ శనివారం ఛార్జిషీట్ దాఖలు చేసింది. ఐసిఐసిఐ మాజీ మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ చందాకొచ్చర్, ఆమె భర్త దీపక్ కొచ్చర్, వీడియోకాన్ వ్యవస్థాపకుడు వేణుగోపాల్ దూత్‌లపై ముంబయి సివిల్ సెషన్స్ కోర్టులో సిబిఐ ఛార్జిషీట్ దాఖలు చేసింది. ఐపిసి సెక్షన్ 120-బి, 409, అవినీతి కేసులను నమోదు చేసింది. నిబంధనలకు విరుద్ధంగా వీడియోకాన్‌కు రూ.3,250 కోట్ల అప్పులిచ్చి.. తన భర్త కంపెనీకి మేలు జరిగేలా చందా కొచ్చర్ వ్యవహరించారని సిబిఐ పేర్కొంది. ఇందులో ధూత్ ప్రధాన లబ్ధిదారుడిగా ఉన్నారు. 2022 డిసెంబర్‌లో కొచ్చర్ దంపతులను, వేణుగోపాల్ ధూత్‌ను సిబిఐ అరెస్టు చేసింది. జనవరి రెండో వారంలో ఆ ముగ్గురికి బెయిల్ లభించింది.

# 'అనంత' ఉద్దానం

- ములకెలపెంటను కబళిస్తోన్న కిడ్నీ మహమ్మారి
- ఇద్దరు మృత్యువాత

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి, గుంతకల్లు రూరల్

అనంతపురం జిల్లా గంతకల్లు మండలం ములకెలపెంట గ్రామాన్ని కిడ్నీ మహమ్మారి కబళిస్తోంది. ఈ గ్రామంలో ఇప్పటికే మూత్రపిండాల వ్యాధితో ఇద్దరు మృతి చెందారు. మరో ఐదుగురు డయాలసిస్‌తో మంచానపడ్డారు. గ్రామంలో మరికొందరు కూడా కిడ్నీ వ్యాధి లక్షణాలతో బాధపడుతున్నారు. ఇంకెంతమందిలో ఈ జబ్బు దాగుందోనన్న భయం గ్రామస్థుల్లో కనిపిస్తోంది. రెక్కాడితేగానీ డొక్కాడని పరిస్థితుల్లో వారు ఉన్నారు. కిడ్నీ వ్యాధి అని నిర్ధారణ అయితే వైద్య ఖర్చు భరించలేమనే భయంతో వైద్య పరీక్షలు చేయించుకోవడానికి గ్రామస్తులు ఇష్టపడడం లేదు. ఈ వ్యాధి వ్యాప్తికి కారణాలేమిటో తెలియక ఆందోళనతో ఉన్నారు. అనంతపురం-కర్నూలు జిల్లా సరిహద్దుల్లో గుంతకల్లు మండలంలో ములకెలపెంట గ్రామం ఉంది. సుమారు రెండు వేలు జనాభా నివసిస్తోంది. ప్రభుత్వం ద్వారా ఆరోగ్య శ్రీ కింద వైద్యం అందుతున్నప్పటికీ మందులు, ఇతర ఖర్చులతోపాటు, డయాలసిస్‌కు అనంతపురం నగరానికి వచ్చి వెళ్లే ఖర్చు కలిపి తడిసి మోపెడవుతోంది. కూలికెళ్తేగానీ పూటగడవని కుటుంబాలు ఈ వైద్య ఖర్చులను భరించలేక తీవ్ర అర్థిక ఇబ్బందులో కూరుకుపోతున్నాయి. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే మరో ఉద్దానంలా తమ గ్రామం మారనుందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కిడ్నీ సమస్యలతో మంచం పట్టిన ములకెలపెంట యువకుడు

### ఒకే ఇంట్లో ఇద్దరు

ములకెలపెంటలో 37 సంవత్సరాల వయసున్న మల్లప్పగారి ప్రకాశ్ ఉన్నఫలంగా బలహీనపడి అనారోగ్యానికి గురయ్యారు. గుంతకల్లులోని ఒక ప్రయివేటు ఆస్పత్రిలో నిర్వహించిన వైద్య పరీక్షల్లో మూత్రపిండాల వ్యాధి అని తేలింది. పూర్తి స్థాయి పరీక్షల కోసం బళ్లారిలోని ఆస్పత్రికి వెళ్లారు. మూత్రపిండాలు బాగా దెబ్బతిన్నాయని, డయాలసిస్ అవసరమని వైద్యులు తేల్చారు. దీంతో, ఖర్చు భరించలేక అనంతపురానికి తిరిగొచ్చారు. అక్కడి నుంచి ఆరోగ్యశ్రీ కింద చికిత్స చేస్తారంటే అనంతపురంలోని కిమ్స్ సవేరా ఆస్పత్రికి వెళ్లారు. ప్రస్తుతం ఈ ఆస్పత్రిలో ఆయన ప్రతి మూడు రోజులకొకసారి డయాలసిస్ చేయించుకుంటున్నారు. డయాలసిస్ ఉచితమే అయినా సూదులు, మందులు, ప్రయాణ ఖర్చులు కలిపి మూడు నాలుగు వేల వరకు ఖర్చు అవుతోంది. ఈ రకంగా నెలలో కనీసం పదిసార్లు వెళ్లి వచ్చేందుకు మొత్తం రూ.30 వేలకుపైగా ఖర్చవుతోందని ప్రకాశ్ తెలిపారు. కూలికిపోతేగానీ పూట గడవని ఈ కుటుంబం ఈ ఖర్చులను భరించలేకుండా ఉంది. ఆస్పత్రికి తీసుకెళ్లడానికి ఆయన వెంట ఆమె భార్య కూడా వెళ్తున్నారు. దీంతో, ఆ రోజుల్లో ఆమె కూడా కూలికి వెళ్లలేకపోతోంది. ప్రకాశ్ సోదరుడు నాగార్జున, గ్రామానికి చెందిన పరశురామ్ కిడ్నీ వ్యాధితో మృతి చెందారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వారిలో ప్రకాశ్, మిగతా 2లో

## కాంట్రాక్టు లెక్చరర్లకు ఉద్యోగ విరమణ వయసు పెంచాలి

- పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లోని కాంట్రాక్టు లెక్చరర్ల ఉద్యోగ విరమణ వయసు పెంచాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు కోరారు. ఈ మేరకు ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె శ్యామలరావుకు వినతిపత్రం అందించినట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్టు లెక్చరర్ల ఉద్యోగ విరమణ వయసు ప్రస్తుతం 58 ఏళ్లే ఉందని, దీనిని 60 ఏళ్లకు పెంచాలని కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని అధ్యాపకులకు ఇప్పటికే జిఓ 221 ద్వారా 60 ఏళ్లకు పెంచారని పేర్కొన్నారు.

## నేడు, రేపు వేడి గాలులు

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

రాష్ట్ర వ్యాప్తంగా పలు మండలాల్లో ఆదివారం వేడిగాలులు వీచే అవకాశముంది. ఆదివారం 12 మండలాల్లో, సోమవారం మరో 3 మండలాల్లో ఉధృతంగా వేడిగాలులు వీచే అవకాశమున్నట్లు రాష్ట్ర ప్రకృతి విపత్తుల నిర్వహణశాఖ పేర్కొంది. ఉష్ణోగ్రతలు సాధారణం 40 డిగ్రీల సెల్సియస్ కంటే అధికంగా వేడి గాలులు వీచే అవకాశమున్నట్లు తెలిపింది. వేడి గాలులు తీవ్రత నుంచి ప్రజలు తమను రక్షించుకునేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆ శాఖ సూచిస్తోంది.

**ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006**

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..

**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
**editorprajasakthi@gmail.com**కు
పంపవచ్చు.

## చంద్రబాబువి పిల్ల చేష్టలు

- మంత్రి జోగి రమేష్

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

టిడిపి అధినేత చంద్రబాబు నెల్లూరులో టిడ్కో ఇళ్ల దగ్గర సెల్ఫీ ఫొటో ట్వీట్ చూస్తే పిల్ల చేష్టలా ఉందని గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 74 ఏళ్ల వయసు, 44 ఏళ్ల రాజకీయ అనుభవం అని చెప్పుకునే చంద్రబాబు, చేయని పనిని, చేసినట్లుగా చెప్పుకుంటూ సెల్ఫీలు దిగడం, దాన్ని మీడియా, సోషల్ మీడియాలో ప్రచారం చేసుకోవడం విచిత్రంగానూ, విడ్డూరంగానూ ఉందన్నారు. టిడిపి హయాంలో పునాది దశకే పరిమితమైన టిడ్కో ఇళ్లను వైసిపి ప్రభుత్వం ఏర్పడ్డాక పూర్తి చేసి మౌలిక సదుపాయాలు కల్పిస్తే.. దానిని కూడా తానే ఉద్ధరించినట్లుగా చంద్రబాబు ప్రచారం చేసుకోవడం సిగ్గు చేటని అన్నారు.

## బిజెపి నేతగా సమావేశానికి వచ్చారా?

- సిపిఐ నారాయణ

**ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో**

ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల కోసం సమావేశాన్ని ఏర్పాటు చేసి, బిజెపి సమావేశంగా మోడీ మార్చడం సిగ్గుచేటని సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. తిరుపతి సిపిఐ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బిజెపి నేతగా సమావేశానికి వచ్చారా? లేక ప్రధానిగా వచ్చారా? అని మోడీని ప్రశ్నించారు. మోడీ ప్రసంగం మొత్తం తెలంగాణ ప్రభుత్వంపై దాడిచేసేలా సాగిందన్నారు. బిజెపికి అనుకూలంగా ఉన్న రోజుల్లో కెసిఆర్ అవినీతి ఎందుకు కనబడలేదని ప్రశ్నించారు. తనకు జైకొట్టిన వారిని ఇళ్లకు పంపుతారని, జై కొట్టని వారిని జైలుకు పంపుతారని విమర్శించారు. టిఆర్ఎస్ పార్టీపై ఆరోపణలు రాజ్యాంగ లౌకిక వ్యవస్థకు వ్యతిరేకమని, తక్షణం నరేంద్ర మోడీ జాతికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వందే భారత్ రైళ్ల ఛార్జీలు విమాన ఛార్జీలను తలపిస్తున్నాయని, త్వరలోనే వీటిని ప్రైవేట్ వ్యక్తులకు మోడీ అప్పగిస్తారని విమర్శించారు. నరేంద్ర మోడీ తీరును ఎండగట్టేందుకు 19 రాజకీయ పార్టీలు ఏకతాటిపైకి వచ్చాయని, ప్రజాక్షేత్రంలో మోడీని ముద్దాయిగా నిలబెడతామని చెప్పారు. ఈ సమావేశంలో సిపిఐ తిరుపతి జిల్లా కార్యదర్శి మురళి, నగర కార్యదర్శి విశ్వనాథ్, ఎఐఎస్ఎఫ్ అధ్యక్షులు ఉదయ్ పాల్గొన్నారు.

## 1100 కిలోల గంజాయి పట్టివేత

**ప్రజాశక్తి - యలమంచిలి రూరల్ (అనకాపల్లి)**

అనకాపల్లి జిల్లా యలమంచిలి మండలం రేగుపాలెం మార్కెట్ కమిటీ చెక్‌పోస్ట్ వద్ద నార్కోటిక్ సెంట్రల్ బ్యూరో (హైదరాబాద్) బృందం శనివారం తెల్లవారుజామున భారీగా గంజాయిని స్వాధీనం చేసుకుంది. దాని విలువ రూ.30 లక్షలకుపైగా ఉంటుందని అధికారుల అంచనా. యలమంచిలి మండలంలోని రేగుపాలెం జాతీయ రహదారిపై అనకాపల్లి నుంచి తుని వైపుగా వెళ్తున్న లారీని వెనుక నుంచి ఓ ప్రయివేటు ట్రావెల్ బస్సు ఢీకొట్టింది. అప్పటికే లారీని వెంబడిస్తున్న నార్కోటిక్ బృందం సభ్యులు లారీని తనిఖీ చేయగా 1100 కిలోల గంజాయి పట్టుబడింది.

# నిర్వాసితుల పట్ల ప్రభుత్వ దుర్నీతి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు
- ముదివేడు రిజర్వాయర్ ప్రాంతం సందర్శన

రిజర్వాయర్ నిర్వాసితులతో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

**ప్రజాశక్తి- కురబలకోట (వైఎస్ఆర్ జిల్లా)**

అన్నమయ్య జిల్లా కురబలకోట మండలంలోని ముదివేడు రిజర్వాయర్ నిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వకుండా కాలయాపన చేయడమే కాకుండా కాంట్రాక్టర్లకు వంతపాడడం రాష్ట్ర ప్రభుత్వ దుర్నీతికి నిదర్శనమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. ఈ రిజర్వాయర్‌ను శనివారం ఆయన సందర్శించి ముంపు గ్రామాలైన శీతివారిపల్లి, కొత్తపల్లి, చౌటకుంటపల్లి ప్రజలను పరామర్శించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ అవసరాలకు భూములను తీసుకున్నప్పుడు 2013 భూసేకరణ చట్టం ప్రకారం గ్రామసభలు జరిపి, నోటీసులు ఇచ్చి, అందరూ ఆమోదించిన అనంతరం అవార్డు ప్రకటించి నష్టపరిహారం చెల్లించాలన్నారు. తర్వాత నిర్మాణ పనులను ప్రారంభించాల్సి ఉంటుంది తెలిపారు.

ఈ నిబంధనలను ప్రభుత్వం తుంగలో తొక్కిందని, ఎకరాకు రూ.12 లక్షలు ఇస్తామని నోటిమాట ద్వారా చెప్పడం దుర్మార్గమని అన్నారు. నిర్వాసితులకు ఎకరాకు రూ.40 లక్షల పరిహారం ఇవ్వాలని, భూమికి ప్రత్యామ్నాయ భూమి చూపించాలని, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలు చేయాలని, ఇంటికొక ఉద్యోగం ఇవ్వాలని, భూమిలేని కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూఢి ప్రకటన లేకుండానే కాంట్రాక్టర్ నిర్మాణ పనులు చేపట్టినా, రెండు గ్రామాలు పూర్తిగా మునిగిపోయి కనుమరుగవుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు చోద్యం చూస్తుండడం శోచనీయమన్నారు. స్థానిక ఎంపి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి దీనిపై ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులతో చర్చించి సమస్యలు పరిష్కారం చేసేంత వరకూ నిర్వాసితులతో కలసి పోరాడుతామన్నారు. అధికారులు పక్షపాత ధోరణి వీడి నిర్వాసితులందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రైతులు, వ్యవసాయ కార్మికులు ఐక్యంగా పోరాడితే ప్రభుత్వం దిగివస్తుందన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు, నాయకులు అబ్బవరం రామాంజులు, ప్రభాకర్‌రెడ్డి, సిహెచ్.చంద్రశేఖర్, రవికుమార్, నిర్వాసిత గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## వ్యవసాయం తగ్గితే వృద్ధి ఎలా పెరిగింది?

- యనమల రామకృష్ణుడు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

రాష్ట్రంలో సాగు తగ్గితే వ్యవసాయంలో వృద్ధి ఎలా పెరుగుతుందో సిఎం జగన్ సమాధానం చెప్పాలని శాసనమండలి ప్రతిపక్షనేత యనమల రామకృష్ణుడు ప్రశ్నించారు. ఏటా 12 లక్షల టన్నుల మేర ఆహార ధాన్యాల దిగుబడులు పెరిగాయని మాట్లాడటం ప్రజల్ని మోసం చేయడమేనని శనివారం మీడియాకు విడుదల చేసిన వీడియోలో విమర్శించారు. అగ్రికల్చర్ సెక్టార్ నాలుగేళ్లలో కష్టాలు, నష్టాల్లో నడుస్తోందని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర లేకుండా పోయిందన్నారు. ఖరీఫ్, రబీ క్రాప్ హాలిడేస్ కూడా ఇచ్చారన్నారు. అగ్రికల్చర్ గ్రోత్ రేటు 2022-23లో 4.54కు పడిపోయిందని తెలిపారు. పంట నష్టపోతే ఇన్‌పుట్ సబ్సిడీ సరిగ్గా ఇవ్వడం లేదని, వర్షాలు బాగా పడినా ఉత్పత్తి దెబ్బతిందని వివరించారు. మిల్లర్లు, అధికారులు రైతులతో ఇష్టమొచ్చినట్లు ఆడుకుంటున్నారని తెలిపారు.

**విద్యుత్‌శాఖలో రూ.14 వేల కోట్ల కుంభకోణం : పట్టాభి**

విద్యుత్ శాఖలో ఆర్‌డిఎస్ఎస్ పథకం కింద రూ.14 వేల కోట్ల దోపిడీకి సిఎం జగన్ తెరలేపారని టిడిపి అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ విమర్శించారు. ఆ శాఖలో జగన్ దోచుకో, పంచుకో, తినుకో (డిపిటి) పథకాన్ని ప్రారంభించారని ఆరోపించారు. స్మార్ట్ మీటర్ల బిగింపు వెనుక ఈ కుంభకోణం దాగి ఉందన్నారు.

## అచ్చెన్న హత్యపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి

- అఖిలపక్ష నాయకుల ర్యాలీ, అరెస్టులు

పోలీస్‌స్టేషన్‌లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, నాయకులు

**ప్రజాశక్తి -కడప అర్బన్**

కడప జిల్లా పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ అచ్చెన్న హత్యపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని కోరుతూ చేపట్టిన శాంతియుత నిరసన ర్యాలీపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. వామపక్షాలు, అఖిలపక్షం, దళిత సంఘాలు శనివారం కడప పట్టణం ఎర్రముక్కపల్లె నుంచి కోటిరెడ్డి సర్కిల్ మీదుగా చేపట్టిన శాంతియుత ర్యాలీని నిర్బంధాలు, అరెస్టులతో అడ్డుకుంది. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణను లాడ్జి దగ్గర పలువురు వామపక్ష, అఖిలపక్ష, దళిత సంఘాల నాయకులను ఎక్కడికక్కడే పోలీసులు అరెస్టులు చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ, అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ... డాక్టర్ అచ్చెన్న నిజాయితీ గల అధికారని, ఆయన విధుల్లో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. తనకు అదే డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న శ్రీధర్‌లింగారెడ్డి, సురేంద్రనాథ్ బెనర్జీ, సుభాష్ చంద్రబోస్, శారదల వల్ల ప్రాణహాని ఉందని పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని విమర్శించారు. పశుసంవర్ధక శాఖ రాష్ట్ర డైరెక్టర్ అమరేంద్రకుమార్‌కు ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోగా తనపై వ్యతిరేకమైన చర్యలకు పాల్పడ్డాడని, కలెక్టర్ కూడా తనను ఇబ్బంది పెడుతున్నారని కోర్టును అచ్చెన్న ఆశ్రయించారన్నారు. ఉన్నతాధికారుల ప్రోద్బలం, పోలీసుల నిర్లక్ష్యం వల్ల అచ్చెన్న కిడ్నాప్, హత్యకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో దళితులపైన జరుగుతున్న దాడులను అరికట్టాలని, అచ్చెన్న హత్య కేసును సిట్టింగ్ జడ్జితో జరిపించాలని కోరుతూ ఏప్రిల్ 11న చలో ముఖ్యమంత్రి కార్యాలయం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్‌పిఐ రాష్ట్ర అధ్యక్షులు అంజయ్య, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు సురేష, ఎంఎస్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు విశ్వనాథ్, కాంగ్రెసు నాయకులు తిరుమలేష్, ఆప్ నాయకులు శ్రీనివాసులు, లోక్‌సత్తా నాయకులు కృష్ణ, మహాజన పార్టీ నాయకులు మనోహర్, రమణ పాల్గొన్నారు.

## అమరావతిలో 144 సెక్షన్

- ఇసుక అక్రమ తవ్వకాలపై మాజీ, సిట్టింగ్ ఎమ్మెల్యేల సవాళ్లు

**ప్రజాశక్తి - అమరావతి (పల్నాడు జిల్లా)**

పల్నాడు జిల్లా అమరావతిలో 144 సెక్షన్ అమల్లో ఉందని డిఎస్‌పి ఆదినారాయణ శనివారం తెలిపారు. ఇసుక అక్రమ తవ్వకాలపై చర్చకు సిద్ధమా అంటూ మాజీ ఎమ్మెల్యే కొమ్మలపాటి శ్రీధర్, సిట్టింగ్ ఎమ్మెల్యే నంబూరు శంకరావు ఒకరినొకరు సవాళ్లు విసురుకున్నారు. అమరావతిలోని అమరలింగేశ్వర స్వామి ఆలయం వద్దకు ఆదివారం రావాలని ఇద్దరూ నేతలు సవాళ్లు విసురుకున్నారు. ఈ నేపథ్యంలో అమరావతిలో 144 సెక్షన్ విధించారు. చర్చకు నేను సిద్ధం అంటే... నేను సిద్ధం అంటూ ఇరువురు తలపడే అవకాశం ఉన్నందున ముందస్తుగా పోలీసు బలగాలను రప్పించారు. ఎవరు రెచ్చగొట్టే విధంగా వీధుల్లో సంచరించరాదని, పెదకూరపాడు నియోజకవర్గానికి చెందిన వైసిపి, టిడిపి నాయకులు ఎవరూ అమరావతి రావద్దని ముందస్తు నోటీసులు జారీ చేశారు. అమరావతిలో ఇరు పార్టీల నాయకులెవ్వరూ బయటకు రావద్దని పోలీసులు హెచ్చరించారు.

## రైతులను ఆదుకుంటాం

- యువగళం పాదయాత్రలో నారా లోకేష్ హామీ

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**



టిడిపి అధికారంలోకి రాగానే రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ హామీనిచ్చారు. యువగళం పాదయాత్ర 64వ రోజు శనివారం అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గం గార్లదిన్నె మండలం జంబులదిన్నె వద్ద 'రైతన్నతో లోకేశ్' పేరుతో రైతులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్‌కెయు ప్రొఫెసర్ రాంప్రసాద్ హోస్టుగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో రైతులు అడిగిన పలు ప్రశ్నలకు లోకేష్ సమాధానమిచ్చారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీలను పెంచి పెట్టుబడి ఖర్చులు తగ్గిస్తామని, మార్కెటింగ్‌ను అనుసంధానం చేసి గిట్టుబాటు ధర లభించే విధంగా చర్యలు చేపడతామన్నారు. ఉద్యానపంటలు అధికంగా ఉన్న చోట ప్రాసెసింగ్ పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. వైసిపి అధికారంలోకి రాక ముందు తలసరి రైతు రుణం రూ.70 వేలు ఉంటే ప్రస్తుతం రూ.2.50 లక్షలకు చేరిందన్నారు. అనంతపురం జిల్లాలో ఇటీవల తుపానుతో ఉద్యాన రైతులు తీవ్రంగా నష్టపోయారని గుర్తు చేశారు. వారిని ఆదుకునేందుకు ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్దిష్టమైన ప్రకటన చేయలేదని విమర్శించారు. పంట నష్ట పరిహారం చెల్లించే విషయంలోనూ ఈ ప్రభుత్వం రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. వైసిపికి అనుకూలంగా ఉన్న కొద్ది మందికి పరిహారం ఇచ్చిన తక్కిన వారికివ్వడం లేదని విమర్శించారు. దేశంలో రైతు ఆత్మహత్యల్లో ఆంధ్రప్రదేశ్ మూడవ స్థానం, కౌలు రైతు ఆత్మహత్యల్లో రెండవ స్థానంలో ఉందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే సాధారణ రైతులతో సమానంగా కౌలు రైతులను ఆదుకుంటుందని భరోసానిచ్చారు. తాను పాదయాత్ర చేసిన ఇన్ని రోజుల్లో ఎక్కడా రైతు భరోసా కేంద్రం తెరచి ఉన్న దాఖలాల్లేవని, మద్యం దుకాణాలు మాత్రం ఎప్పుడూ తెరచే ఉంటున్నాయని ఎద్దేవా చేశారు. వైసిపి అధికారంలోకి వచ్చాక సాగునీటి రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. తాము అధికారంలో ఉండగా రూ.11 వేల కోట్లతో సాగునీటి ప్రాజెక్టులు చేపట్టామని వివరించారు. టిడిపి హయాంలో పెద్దఎత్తున బిందు, తుంపెర సేద్య పరికరాలను సబ్సిడీ ధరకు అందించామని, రాబోయే రోజుల్లోనూ ఇది కొనసాగుతుందన్నారు. పాడి పరిశ్రమ అభివృద్ధికి తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రుల కాలవ శ్రీనివాసులు, పరిటాల సునీత, రైతులు పాల్గొన్నారు.

# 39 మంది ఐపిఎస్‌ల బదిలీ

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

రెండు రోజుల క్రితం భారీగా ఐఎఎస్ అధికారులను బదిలీ చేసిన ప్రభుత్వం.. తాజాగా 39 మంది ఐపిఎస్‌లను బదిలీ చేసింది. ఈ మేరకు శుక్రవారం అర్ధరాత్రి ప్రభుత్వం జిఓ ఆర్‌టి నెంబరు 639ని విడుదల చేసింది. భారీగా ఐఎఎస్, ఐపిఎస్‌లను ప్రభుత్వం బదిలీ చేపట్టడం వెనుక రానున్న ఎన్నికల కోసం టీమ్‌ను సిద్ధం చేసుకోవడమేననే అభిప్రాయాన్ని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. మార్చి నెలలోనే భారీగా బదిలీలు చేపట్టాల్సి ఉన్నప్పటికీ, ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఆలస్యమయ్యాయనే చర్చ నడుస్తోంది.

| అధికారిపేరు | ప్రస్తుత స్థానం | బదిలీ స్థానం |
|---|---|---|
| జివిజి అశోక్‌కుమార్ | అదనపు డైరెక్టర్, ఎసిబిడి | ఐజి ఏలూరు |
| జి.పాలరాజు | డిఐజి ఏలూరు | ఐజి గుంటూరు, ఐజి దిశ |
| ఆర్ఎన్ అమ్మిరెడ్డి | ఎఐజి, శాంతి భద్రతలు | డిఐజి, అనంతపురం |
| ఎం.రవిప్రకాష్‌డిఐజి, | డిఐజి, అనంతపురం | డిఐజి, సెబ్ |
| బి.రాజకుమారి | డిఐజి, దిశ | డిఐజి, ఎపిఎస్‌పి బెటాలియన్స్ |
| సర్వశ్రేష్ట తిపాఠి | వెయిటింగ్ | లా అండ్ ఆర్డర్ డిఐజి, హెడ్‌క్వార్టర్స్ |
| కోయ ప్రవీణ్ | విశాఖ ఎపిఎస్‌పి బెటాలియన్ కమాండెంట్ | డిఐజి, గ్రేహౌండ్స్ |
| శంఖబ్రతబాగ్చీ | డిజి, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ | అడిషనల్ డిజిపి, లా అండ్ ఆర్డర్, అదనపు డిజిపి పర్సనల్ అండ్ అడ్మిన్ |
| రవిశంకర్ అయ్యన్నార్ | అదనపు డిజిపి, లా అండ్ ఆర్డర్ | డిజి, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ |
| అతుల్‌సింగ్ | అదనపు డిజిపి, ప్రొవిజన్స్ అండ్ లాజిస్టిక్స్ | అదనపు డిజిపి, ఎపిఎస్‌పి బెటాలియన్ అదనపు బాధ్యతలు |
| మనీష్‌కుమార్ సిన్హా | పోలీస్ నియామక మండలి ఛైర్మన్ | లీవ్‌లో వెళ్లారు |
| సిహెచ్ శ్రీకాంత్ | విశాఖ పోలీస్ కమిషనరు | ఐజి, సిఐడి |
| పి.వెంకటరామిరెడ్డి | ఐజి, శిక్షణ | ఎండి, పోలీసు గృహ నిర్మాణ సంస్థ అదనపు కమిషనరు, విశాఖ |
| విక్రాంత్ పాటిల్ | కమాండెంట్, విజయనగరం ఎపిఎస్‌పి బెటాలియన్ | ఎస్‌పి, పార్వతీపురం మన్యం |
| వాసన్ విద్యాసాగర్ నాయుడు | ఎస్‌పి, పార్వతీపురం మన్యం | డిసిపి, శాంతి భద్రతలు, విశాఖ |
| గరుడ్ సుమిత్ సునీల్ | డిసిపి, లా అండ్ ఆర్డర్, విశాఖ | ఎస్‌పి, ఎస్ఐబి |
| తుహిన్‌సిన్హా | అదనపు ఎస్‌పి, పాడేరు | ఎస్‌పి అల్లూరి సీతారామరాజు జిల్లా |
| ఎస్.సతీష్‌కుమార్ | ఎస్‌పి అల్లూరి సీతారామరాజు జిల్లా | ఎస్‌పి, కాకినాడ |
| ఎం.రవీంద్రనాథ్‌భాబు | ఎస్‌పి, కాకినాడ | హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్టు చేసుకోవాలి |
| కెవి మురళీకృష్ణ | వెయిటింగ్ | ఎస్‌పి, అనకాపల్లి |
| గౌతమిశాలి | ఎస్‌పి, అనకాపల్లి | కమాండెంట్, ఎపిఎస్‌పి బెటాలియన్, విశాఖ |
| సిహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి | ఎస్‌పి, అంబేద్కర్ కోనసీమ | ఎస్‌పి తూర్పుగోదావరి |
| పి.శ్రీధర్ | వెయిటింగ్ | ఎస్‌పి, అంబేద్కర్ కోనసీమ |
| డి.మేరీప్రశాంతి | డిసిపి, లా అండ్ ఆర్డర్, విజయవాడ | ఎస్‌పి ఏలూరు |
| రాహుల్‌దేవ్‌శర్మ | ఎస్‌పి, ఏలూరు | కమాండెంట్, విజయనగరం బెటాలియన్ |
| తిరుమలేశ్వరరెడ్డి | వెయిటింగ్ | ఎస్‌పి, నెల్లూరు |
| సిహెచ్ విజయరావు | ఎస్‌పి, నెల్లూరు | కమాండెంట్, కాకినాడ, ఎపిఎస్‌పి బెటాలియన్ |
| ఆర్, గంగాధర్‌రావు | ఎస్‌పి, ఎసిబి | ఎస్‌పి అన్నమయ్యజిల్లా |
| వి.హర్షవర్ధన్‌రాజు | ఎస్‌పి, అన్నమయ్య జిల్లా | ఎస్‌పి, సిఐడి |
| కె.శ్రీనివాసరావు | వెయిటింగ్ | ఎస్‌పి, అనంతపురం |
| కె.ఫకీరప్ప | ఎస్‌పి, అనంతపురం | ఎస్‌పి, సిఐడి |
| ఎస్‌పి మాధవరెడ్డి | వెయిటింగ్ | ఎస్‌పి, శ్రీసత్యసాయి జిల్లా |
| రాహుల్‌దేవ్‌సింగ్ | ఎస్‌పి, శ్రీసత్యసాయి జిల్లా | ఎస్‌పి, రైల్వే, విజయవాడ |
| జి.కృష్ణకాంత్ | అదనపు ఎస్‌పి, ఆపరేషన్స్, రంపచోడవరం | ఎస్‌పి, కర్నూలు |
| పి, సిద్ధార్థ కౌశల్ | ఎస్‌పి, కర్నూలు | ఎస్‌పి ఆక్టోపస్ |
| అజితా వేజెండ్ల | కమాండెంట్, అనంతపురం బెటాలియన్ | డిసిపి, విజయవాడ |
| పి. జగదీష్ | ఎస్‌పి, పరిపాలన, చిత్తూరు | కమాండెంట్, అనంతపురం బెటాలియన్ |
| బిందుమాధవ్ గరికపాటి | అదనపు ఎస్‌పి (పరిపాలన), పల్నాడు | ఎస్‌పి, గ్రేహౌండ్స్ |

దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న ఎన్.రామారావు

## ప్రభుత్వ రంగం నిర్వీర్యానికి మోడీ కుట్ర : సిఐటియు

**ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)**

ప్రభుత్వ రంగ పరిశ్రమలను నిర్వీర్యం చేసి, కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని సిఐటియు సీనియర్ నాయకులు ఎన్.రామారావు, డిసిహెచ్.వెంకటేశ్వరరావు విమర్శించారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే దీక్షలు శనివారానికి 786వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ ఆర్ఎంహెచ్‌పి, ఎసిఎస్, హెచ్ఆర్ విభాగాలకు చెందిన కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న పద్ధతులను వివరించారు. పోరాటాన్ని మరింత ఉధృతం చేసి స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. కర్మాగారాన్ని రక్షించుకోడానికి రాజకీయ పార్టీలన్నీ ఒకే తాటిపైకి రావాలన్నారు. ఉక్కు కార్మికులు పోరాటాన్ని ఉధృతం చేయనున్నారని, ఇప్పటికే ఉద్యమ ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారని తెలిపారు. దీక్షల్లో పోరాట కమిటీ నాయకులు జె.రామకృష్ణ, వై.మస్తానప్ప, యు.రామస్వామి పాల్గొన్నారు.

## వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడతాం

- మోడీని ఎదిరించే ధైర్యం ఎపిలోని ప్రధాన పార్టీలకు లేదు
- బిఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు తోట చంద్రశేఖర్

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)**

దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడి తీరుతామని భారత రాష్ట్రీయ సమితి (బిఆర్ఎస్) ఎపి అధ్యక్షులు తోట చంద్రశేఖర్ అన్నారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా విశాఖకు వచ్చిన ఆయన శనివారం సాయంత్రం పార్టీ కార్యకర్తలతో నగరంలోని విఎంఆర్‌డిఎ చిల్డ్రన్స్ థియేటర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని తిప్పికొడతామన్నారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు చేస్తున్న దీక్షకు మద్దతు తెలియజేస్తున్నామని, త్వరలో వారిని కలిసి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఎపిలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు బిజెపికి వంతపాడుతున్నాయని విమర్శించారు. నరేంద్ర మోడీని ప్రశ్నించేంత ధైర్యం ఎపిలోని ప్రధాన పార్టీలకు లేదన్నారు. బిజెపిని ఎదిరించి పోరాడే శక్తి తమకు ఉందని, ఇప్పటికే సింగరేణి విషయంలో రుజువు అయ్యిందని తెలిపారు. సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు గాదె బాలాజీ, సురేష్,కార్యకర్తలు పాల్గొన్నారు. తొలుత విశాఖ ఎయిర్ పోర్టు నుంచి నగరంలోని విఎంఆర్‌డిఎ చిల్డ్రన్స్ థియేటర్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు.

## లోటు రూ.1.34 లక్షల కోట్లు

- సొంత ఆదాయంపై అధికారుల లెక్కలు
- 2023-24 మరింత భారం

**ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి**

ముగిసిన ఆర్థిక సంవత్సరంలో భారీ లోటు నమోదైంది. సొంత ఆదాయంతో పోల్చితే ఏకంగా రూ.1.34 లక్షల కోట్లు లోటుగా రికార్డయింది. ఇది మొత్తం వ్యయంలో సగానికన్నా తక్కువగా ఉండడం గమనార్హం. కేంద్రం నుంచి వచ్చిన ఆదాయం, వివిధ రంగాల ద్వారా సేకరించిన రుణాలతోనే మిగిలిన వ్యయాన్ని భర్తీ చేసినట్లు కనిపిస్తోంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో మొత్తం సొంత ఆదాయం రూ.90,579 కోట్లుగా నమోదు కాగా, వ్యయం రూ.2,24,396 కోట్లుగా నమోదైంది. లోటు రూ.1,33,817 కోట్లుగా గుర్తించారు. ఆర్థికశాఖ మాత్రం మొత్తం అన్ని రకాల ఆదాయాన్నీ గణించి, లోటు తక్కువగా ఉన్నట్లు తేల్చడం విశేషం. మొత్తం ఆర్థిక సంవత్సరంలో ప్రతినెలా సొంత ఆదాయం కన్నా మొత్తం వ్యయం ఎక్కువగానే కనిపించగా, గత మార్చి నెలలో ఏకంగా రూ.16,445 కోట్లు లోటు కనిపించింది. జూన్‌లో రూ.16,807 కోట్లు, ఏప్రిల్‌లో రూ.13,430 కోట్లు లోటు నెలకొనడం గమనార్హం. అతి తక్కువగా ఈ ఏడాది జనవరిలో కేవలం రూ.5,967 కోట్లు లోటుగా తేలింది. దీని ప్రభావం కొత్త ఆర్థిక సంవత్సరంపై మరింతగా పడుతుందని ఆర్థికశాఖ ఆందోళన వ్యక్తం చేస్తోంది. సొంత ఆదాయాన్ని పెంచుకోకపోతే మరోసారి లోటు భారీగా నెలకొనే పరిస్థితి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

## తండ్రి మరణాన్ని దిగమింగి పరీక్ష

**ప్రజాశక్తి - వల్లూరు (కడప)**

కన్నతండ్రి మరణం దిగమింగుకొని ఓ విద్యార్థి పదో తరగతి పరీక్ష రాశాడు. కడప జిల్లా వల్లూరు మండలంలోని ఆదర్శ పాఠశాలలో పుష్పతేజ పదో తరగతి చదువుతున్నాడు. ప్రస్తుతం పబ్లిక్ పరీక్షలు రాస్తున్నాడు. అనారోగ్యంతో చికిత్స పొందుతూ రిమ్స్ ఆస్పత్రిలో పుష్పతేజ తండ్రి శనివారం మరణించాడు. విద్యార్థికి ఎంఇఒ ధైర్యం చెప్పి పరీక్ష కేంద్రానికి తీసుకొచ్చారు. తండ్రిని కోల్పోయిన దుఃఖంతోనే ఆంగ్ల పరీక్షను రాశాడు.

## 'మా నమ్మకం పవన్' స్టిక్కర్లతో జనసేన నిరసన

**ప్రజాశక్తి - తిరుపతి అర్బన్**

స్టిక్కర్లు అతికించి నిరసన తెలుపుతున్న జనసేన నేతలు

తిరుపతిలో 'మా నమ్మకం జగన్' పేరుతో వైసిపి నాయకులు అంటిస్తున్న స్టిక్కర్ల కార్యక్రమాన్ని జనసేన నేతలు అడ్డుకున్నారు. వైసిపి స్టిక్కర్ పక్కనే 'మాకు నమ్మకం లేదు జగన్.. మా నమ్మకం పవన్' అంటూ జనసేన స్టిక్కర్లు అంటిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జనసేన తిరుపతి ఇన్‌ఛార్జి కిరణ్‌రాయల్, పట్టణాధ్యక్షులు రాజారెడ్డి మాట్లాడుతూ.. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగేళ్ల పాలనలో ఈ రాష్ట్రానికి రాజధాని లేక, యువతకు ఉద్యోగాల్లేక, ఉద్యోగులకు జీతాలు అందక, నిత్యావసర ధరల పెరుగుదలతో ప్రజలను అష్టకష్టాలకు గురిచేసి దివాలా తీసే పరిస్థితిలో రాష్ట్రం ఉందని విమర్శించారు. ఏ ముఖం పెట్టుకుని వలంటీర్ల ద్వారా 'మా నమ్మకం జగన్' అని స్టిక్కర్లను అతికిస్తారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చివరకు స్టిక్కర్లను అతికించుకునే పరిస్థితికి దిగజారిపోయారని విమర్శించారు. ఈ కార్యక్రమాన్ని అడ్డుకుంటున్నందుకు జనసేన నాయకులపై కేసులు బనాయించేందుకు అధికారపార్టీ సమాయత్తం అవుతోంది.

## 'అనంత' ఉద్దానం

మొదటిపేజి తరువాయి

నాగార్జున, బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

**పూర్తి స్థాయిలో పరీక్షిస్తేనే మూలమేమిటో తెలుస్తాయి**

ప్రాథమిక దశలోనే గుర్తించి బైయాప్సీ చేస్తే కిడ్నీ వ్యాధికి మూలకారణం గుర్తించగలం. తీవ్రమైన అనారోగ్యానికి గురైన తరువాత వస్తే సమస్యకు కారణం గుర్తించడం కష్టం. వ్యాధికి చికిత్స మాత్రమే అందించగలుగుతాం. ప్రాథమిక దశలో ఉన్న వారిని గుర్తించి పూర్తి స్థాయిలో స్క్రీనింగ్ చేయగలిగితే ఈ గ్రామంలో అధికంగా కిడ్నీ వ్యాధులకు కారణాన్ని గుర్తించవచ్చు. తద్వారా తగిన జాగ్రత్తలు తీసుకునేందుకు వీలుంటుంది.

-డాక్టర్ శ్రీనివాసరెడ్డి, నెఫ్రాలజిస్టు

# ప్రజా ఉద్యమం.. న్యాయపోరాటం

**విశాఖ ఏజెన్సీలోని వాకపల్లి అత్యాచార ఘటన దేశంలోనే ఒక సంచలనం. అమాయకపు ఆదివాసీ (కోందు) మహిళలను ఏమి చేసినా ప్రశ్నించరనే అహంకారంతో ఉన్న పోలీసులను బోనెక్కించిన ఘటన. ఏమీ జరగలేదని, ప్రభుత్వం, పోలీసు బాస్, దర్యాప్తు అధికారులందరూ కలిసి బుకాయింపులకు దిగినా, రికార్డులను ధ్వంసం చేసినా ప్రజా ఉద్యమం. న్యాయ పోరాటాల ముందు అవేమీ నిలబడలేకపోయాయి. తమకు అన్యాయం జరిగిందని కోర్టుకెక్కిన అమాయక మహిళలకు సరైన న్యాయం చేయలేకపోయినా వారికి అన్యాయం జరిగిందని మాత్రం న్యాయస్థానం సహా ప్రపంచం గుర్తించింది. అధికారం ఉంటే ఏదైనా చేయొచ్చని, ఏం చేసినా చెల్లుబాటు అవుతుందని విర్రవీగే వారి అహంకారాన్ని ప్రజా సంఘాలు, మావన హక్కుల సంఘాలు చేసిన పోరాటాలకు న్యాయ పోరాటమూ కలిసి అథఃపాతాళానికి తొక్కాయి. న్యాయం ఆలస్యం కావటం న్యాయాన్ని నిరాకరించినట్లేనన్న నానుడి ఈ కేసు 16 ఏళ్ళు పట్టిన విషయాన్ని గుర్తుచేస్తుంది. నేరం చేసిన వారికి ఏ రూపంలో అయినా సహకరించేవారు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందనేందుకు వాకపల్లి కేసు తీర్పు ప్రత్యక్ష సాక్ష్యం.**

## వాకపల్లి - పూర్వాపరాలు

2007 ఆగస్టు 8న పూర్వ విశాఖ జిల్లా జి.మాడుగుల మండలం నుర్మతి పంచాయతీ పరిధిలోని వాకపల్లి అటవీ ప్రాంతానికి చెందిన 11 మంది మహిళలు తమపై గ్రేహౌండ్స్ పోలీసులు అత్యాచారం చేశారని పోలీసు స్టేషన్లో ఫిర్యాదు ఇచ్చారు. ఇది జరిగిన 12 రోజులకు అంటే.ప్రజాసంఘాలు, మానవ హక్కుల సంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు ఆందోళనతో 20 ఆగస్టు 2007న క్రైం నెంబరు 86/2007గా ..సెక్షన్ 376 (గ్యాంగ్‌రేప్) ఎస్‌సి, ఎస్‌టి ఎట్రాసిటీ చట్టం కింద పాడేరు పోలీసుస్టేషన్లో కేసులు నమోదయ్యాయి.

దోషుల్ని శిక్షించాలని, బాధిత మహిళలను ఆదుకోవాలనీ వామపక్షాలు, వివిధ ప్రజాసంఘాలు ఉద్యమించాయి. వారిపైనా పోలీసులు నిర్బంధాన్ని ప్రయోగించారు. ఉత్తరాంధ్ర జిల్లాల ఎమ్మెల్సీగా ఎంవిఎస్ శర్మ శాసనమండలిలో చర్చ లేవనెత్తి, వాకపల్లి విషయంలో ప్రభుత్వాన్ని బోనులో నిలబెట్టడంలో కృతకృత్యులయ్యారు.

ఈ కేసులో బాధితులకు అన్యాయం జరిగిందని న్యాయస్థానం భావించిందంటే...దానికి ప్రజా సంఘాలు, మహిళా, మానవహక్కుల సంఘాల పోరాటాలే కారణం. అవి లేకపోతే అసలు కేసు విచారణ దశకే వచ్చేది కాదని బలంగా చెప్పవచ్చు. వారే బాధితులను హైదరాబాద్‌కు, హైకోర్టుకు, మానవ హక్కుల కమిషన్ వద్దకు, ఎట్టకేలకు సుప్రీం కోర్టుకు తీసుకెళ్లారు. చివరకు కోర్టులు జోక్యం చేసుకోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఆనందరావు అనే అధికారిని విచారణ కోసం నియమించారు. అయినా ఎటువంటి ప్రయోజనమూ లేకపోగా బాధితులు హైకోర్టుకు, మానవ హక్కుల సంఘాలకు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ అధికారిని మార్చి సిబిసిఐడికి బాధ్యతలు అప్పగించింది. శివానందరెడ్డి అనే అధికారిని విచారణకు నియమించారు. ప్రాథమిక రిపోర్టులో 23 మంది పోలీసు సిబ్బందిని చేరిస్తే విచారణ అనంతరం 13 మంది నిందితులుగా కోర్టు గుర్తించింది. దీనిపై వారు కోర్టును ఆశ్రయించారు. చివరకు సుప్రీం కోర్టు సైతం విచారణ సాగించాల్సిందేనని ఆదేశించింది. విచారణ జరుగుతున్న సమయంలోనే కేసు విచారిస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో హైకోర్టు స్పందించి క్రిమినల్ కేసులు విచారించే అనుభవం ఉన్న ఏడుగురు న్యాయవాదుల లిస్టును సూచించాలని రిజిస్ట్రార్‌ను ఆదేశించింది. ఏడుగురు లిస్టు పంపిన తరువాత వారిలో ముగ్గురిని షార్ట్‌లిస్టు చేసి అనంతరం రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు సుంకర రాజేంద్రప్రసాద్‌ను ఖరారు చేసింది.

బాధిత గిరిజన మహిళలకు తెలుగు రాదు. వారి భాష మనకు అర్థం కాదు. అయినా రూపాయి సంపాదన లేని పరిస్థితుల్లో న్యాయస్థానాలను నమ్మి నిలబడ్డారు. అక్కడకు వచ్చి సాక్ష్యం చెప్పారు. అంతకు ముందే వారు సాక్ష్యం చెప్పకుండా ఉండేందుకు పోలీసులు ప్రలోభపెట్టారు. భయపెట్టారు. అయినా లొంగలేదు. ఈ కేసులో వసుధ నాగరాజు అనే హైకోర్టు న్యాయవాది బాధితుల తరుపున గట్టిగా నిలబడ్డారు. పూర్తిగా సహకరించారు.

విచారణ అధికారులు సరిగా విచారణ చేయలేదని, వారిపై చర్యలు తీసుకోవాలని స్పష్టమైన నిర్ణయాన్ని కోర్టు తీసుకుంది. విచారణలో తొలి అధికారి ఆనందరావు మరణించారు. రెండో అధికారి శివానందరెడ్డిపై విచారణ జరపాలని న్యాయస్థానం ఆదేశించింది. మహిళలకు నష్టరిహారం ఇవ్వాలనీ, ఎంతివ్వాలనే విషయాన్ని నిర్ధారించాలని విశాఖపట్నం లీగల్ సర్వీస్ అథారిటీకి సూచించింది. నేరస్తులకు శిక్ష పడలేదనే బాధ ఉన్నా విచారణ అధికారులపై చర్యలు తీసుకోవడమనేది ఆహ్వానించదగ్గ విషయం. రాజకీయ వ్యవస్థ, పాలనా వ్యవస్థ, మంత్రులు, పోలీసులు వాళ్ల ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే ఏమవుతుందనేది ఈ కేసులో స్పష్టమైంది.

## బాధితులకు పూర్తి స్థాయిలో న్యాయం చేయాలి

**కిల్లో సురేంద్ర, ఎపి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**

**ప్రజాశక్తి - పాడేరు టౌన్**

వాకపల్లి కేసులో కోర్టు వెలువరించిన కీలక తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు. బాధిత మహిళలకు రూ.25 లక్షలు చొప్పున నష్టపరిహారాన్ని తక్షణమే అందించాలి. కుటుంబంలో ఒకరి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలి. వాకపల్లి ఆదివాసీ మహిళలపై అత్యాచారం జరిగిన ఘటన వెలుగు చూసిన నుంచీ గిరిజన సంఘం ఆందోళనలు చేస్తూనే ఉంది. బాధితులకు అండగా నిలుస్తూ వచ్చింది. ఎట్టకేలకు కోర్టు తీర్పు వచ్చినా అసలు నిందితులపై శిక్ష లేకపోవడం విచారకరం. ప్రభుత్వ అసమర్థత, పోలీసులు, దర్యాప్తు అధికారుల తీరుతో ఈ కేసు నీరుగారిపోయింది. సాక్ష్యాలు తారుమారయ్యాయి. ఈ కేసు దర్యాప్తు తీరుపట్ల పలు విమర్శలు వెలువెత్తినప్పటికీ ఆనాటి ప్రభుత్వం స్పందించలేదు. ఇప్పటికైనా కేసు దర్యాప్తు సక్రమంగా చేపట్టని, ఉద్దేశపూర్వకంగా కేసును నీరుగార్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలి. బాధితులకు పూర్తి స్థాయిలో న్యాయం చేయాలి.

## దర్యాప్తు అధికారులను, నిందితులను శిక్షించాలి

- 'వాకపల్లి' బాధిత మహిళలు

**ప్రజాశక్తి - పాడేరు**

'మాపై జరిగిన అత్యాచారం వల్ల చాలా అవమానపడ్డాం. ఎంతో దుఃఖించాం, విశాఖకు వెళ్ళాం.. హైదరాబాదుకు తిరిగాం. ప్రభుత్వం మమ్మల్ని పట్టించుకోలేదు. మేమెంతో చింతపడ్డాం. ఏళ్లు గడుస్తున్నా మాకు న్యాయం జరగలేదని చాలా బాధపడ్డాం. కోర్టును నమ్ముకున్నాం. ఇప్పుడు మాకు కోర్టు వల్లే న్యాయం జరిగింది. దీనికి మేమెంతో సంతోషిస్తున్నాం' అంటూ వాకపల్లి బాధిత మహిళలు తమ మనోగతాన్ని వ్యక్తపరిచారు. ఎన్నో ఏళ్లుగా న్యాయం కోసం తాము ఎదురుచూస్తున్నామని, ఇప్పటికైనా ప్రభుత్వం తమకు పూర్తి స్థాయిలో న్యాయం చేయాలని కోరారు. తమ కేసులో సహకరించని, సరిగా దర్యాప్తు చేయని అధికారులతో పాటు నిందితులనూ శిక్షించాలని విన్నవించారు.

## గిరిజన మహిళల నైతిక విజయం

**లకే రాజారావు, పాడేరు మాజీ ఎమ్మెల్యే**

**ప్రజాశక్తి - పాడేరు టౌన్**

వాకపల్లి కేసులో గిరిజన మహిళలు నైతికంగా విజయం సాధించారు. దర్యాప్తు జరుగుతున్న తీరుపై, అధికారులపై తొలినుంచీ ఫిర్యాదు చేస్తూనే ఉన్నాం. అప్పట్లో ఎమ్మెల్యేగా బాధిత మహిళలకు న్యాయం చేయాలని, దోషులను కఠినంగా శిక్షించాలని పోరాటం చేసాం. సంచలనం సృష్టించిన ఈ కేసులో దర్యాప్తు అధికారులపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేయడంతో బాధిత మహిళలకు ఊరట లభించింది. దర్యాప్తు అధికారులు తీరు సరిగా లేకపోవడం తోనే ఆధారాలు లభించలేదు. ఉద్దేశ పూర్వకంగా కేసును నీరుగార్చిన అధికారులను విచారించి చర్యలు చేపట్టాలి. గిరిజన పిటిజి మహిళలు సుదీర్ఘకాలంగా సాహసం, సహనంతో పోరాటం చేయడం చాలా గొప్ప సంగతి. పదహారేళ్ల పాటు పోరాటం కొనసాగించి విజయం సాధించిన మహిళల గురించి ఎంత చెప్పినా తక్కువే.

# అసలు నిందితులు తప్పించుకున్నారు

- మానవ హక్కుల వేదిక ఎపి, తెలంగాణ రాష్ట్రాల కన్వీనర్ విఎస్.కృష్ణ

**ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)**

ఉమ్మడి విశాఖ జిల్లా జి.మాడుగుల మండలం వాకపల్లి ఆదివాసీ మహిళలపై గ్రే హౌండ్స్ పోలీసుల అత్యాచార కేసులో నిందితులు, దర్యాప్తు అధికారులు పోలీసులే కావడంతో అసలు నిందితులు కోర్టు నుంచి ఎటువంటి శిక్షకూ గురికాకుండా బయటపడ్డారని మానవ హక్కుల వేదిక ఎపి, తెలంగాణ రాష్ట్రాల కన్వీనర్ విఎస్.కృష్ణ తెలిపారు. గురువారం వాకపల్లి కేసు తీర్పు వెలువడిన నేపథ్యంలో శనివారం ఆయన్ని 'ప్రజాశక్తి' కలిసింది. నాటి కేసును ప్రస్తావిస్తూ ఆయన మాట్లాడారు.

**బాధిత మహిళల గోడును పట్టించుకోని ప్రభుత్వం**

వాకపల్లి కేసును స్వతంత్ర నేర పరిశోధన సంస్థతో విచారణ జరిపించి ఉంటే నిందితులైన పోలీసులు కఠిన శిక్షకు గురికావాల్సి ఉండేదన్నారు. కేసులో నిందితులంతా పోలీసులే కావడంతో.. పోలీసులతో దర్యాప్తు జరిపించవద్దని, స్వతంత్ర నేర పరిశోధన సంస్థతో విచారణ జరిపించాలని తమతో పాటు అన్ని ప్రజా, మహిళా సంఘాలు కోరుతూ వచ్చాయని గుర్తు చేశారు. 2007 ఆగస్టు 20న వాకపల్లి గ్రామానికి కూంబింగ్ ఆపరేషన్‌లో భాగంగా వెళ్లిన గ్రే హౌండ్స్ పోలీసులు ఆ గ్రామంలోని పివిటిజి తెగకు చెందిన 11 మంది ఆదివాసీ మహిళలపై అత్యాచారానికి పాల్పడ్డారన్నారు. బాధిత మహిళలు జరిగిన సంఘటనపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదన్నారు. విషయం తెలిసి మానవ హక్కుల సంఘాలు, మహిళా, ప్రజా సంఘాలు, ముఖ్యంగా గిరిజన సంఘాలు వారికి అండగా నిలిచాయన్నారు. దీంతో వారు ధైర్యంగా హైకోర్టు, సుప్రీంకోర్టుల వరకు వెళ్లి న్యాయ పోరాటం చేశారన్నారు. ఆ సుదీర్ఘ ప్రయాణంలో భాగంగా 2018లో విశాఖపట్నంలో మొదలైన విచారణ నాలుగేళ్లపాటు కొనసాగిందని, ఈ నెల 6న 11వ అదనపు సెషన్స్ (ఎస్‌సి, ఎస్‌టి ప్రత్యేక కోర్టు) జడ్జి తీర్పు ఇచ్చారన్నారు. దర్యాప్తు నిష్పక్షపాతంగా జరగకపోవడం వల్ల నిందితులైన పోలీసులపై కేసు కొట్టేస్తున్నట్లు తీర్పు చెప్పారని, దర్యాప్తు చేపట్టిన ఇద్దరు అధికారులు న్యాయ సమ్మతంగా, నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయనందువల్లే ప్రధానంగా ముద్దాయిలపై కేసును కొట్టివేయాల్సి వచ్చిందని కోర్టు ప్రకటించిందన్నారు.

**బాధితుల వాంగ్మూలాలను కోర్టు విశ్వసించింది**

పోలీసులపై కేసు కొట్టేసినప్పటికీ 11 మంది బాధిత మహిళలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా తగిన పరిహారం చెల్లించాలని తీర్పు చెప్పడంతో బాధిత మహిళలు ఇచ్చిన వాంగ్మూలాలను కోర్టు నమ్మిందని స్పష్టమైందన్నారు. ఇది బాధిత మహిళల నైతిక విజయమని తెలిపారు. బాధిత మహిళలను వైద్య పరీక్షల కోసం కెజిహెచ్‌కు తరలించినప్పుడు అక్కడ వైద్యులు సక్రమంగా పరీక్షలు జరపలేదని ఆరోపించారు. నివేదికను తారుమారు చేశారని సందేహం వ్యక్తపరిచారు. కేసు తీర్పులో ఇవి కూడా నిందితులకు సహకరించినట్లుగా భావించవచ్చునన్నారు.

## రూ. 25 లక్షల చొప్పన పరిహారం వెంటనే ఇవ్వాలి

**వివి.జయ, గిరిజన మహిళా సంఘం, అల్లూరి జిల్లా గౌరవాధ్యక్షులు**

వాకపల్లి ఆదివాసీ మహిళలపై గ్రేహౌండ్స్ పోలీసులు అత్యాచారం జరిపిన కేసులో కొంత మంది అధికారులు ఆధారాలు లేకుండా చేశారు. సరిగా విచారణ జరపలేదు. దీంతో నిందితులు శిక్ష నుంచి తప్పించుకున్నారు. తాజాగా వెలువడిన తీర్పుపైనైనా ప్రభుత్వం స్పందించి నిందితులను, విచారణలో సరిగా వ్యవహరించని అధికారులను శిక్షించాలి. బాధిత మహిళలకు రూ.25 లక్షలు చొప్పున పరిహారం అందజేసి ఆదుకోవాలి.

## భూమి చెబితే ఆకాశం నమ్మదా?

**న్యాయవాది వసుధ నాగరాజ్**

**'భూ**మి చెబితే ఆకాశం నమ్మదా?' అని గ్రేహౌండ్స్ పోలీసుల చేతిలో అత్యాచారానికి గురైన వాకపల్లి మహిళల ప్రశ్నకు కోర్టు తాజా తీర్పులో ఎలాంటి సమాధానం వచ్చింది? వారికి న్యాయం జరిగిందా? అనే వివరాలు తెలుసుకుందాం. ఈ కేసులో న్యాయవాది వసుధ నాగరాజ్ ప్రత్యేక ప్రభుత్వ న్యాయవాది సుంకర రాజేంద్రప్రసాద్‌కు సహకరించారు. ఆ నేపథ్యంలో వసుధతో వాయిస్ ఆఫ్‌ది పీపుల్ పద్మ వంగపల్లి చేసిన ఇంటర్వ్యూలో ఏం చెప్పారో ఆమె మాటల్లోనే...

దర్యాప్తు అనేది అసలు జరగలేదు. ఇంత పెద్ద ఘటన జరిగినా పోలీసులు స్పాట్‌కి వెళ్లి ఆ మహిళల స్టేట్‌మెంట్స్ రికార్డు చేసుకోలేదు. వర్షాలు వస్తున్నాయి, మావోయిస్టులతో సమస్య ఉంది కాబట్టి మేము వెళ్లలేదనే సాకులు చెప్పారు.. అత్యాచారం కేసుల్లో బాధితులకు ఎలా అయితే పరీక్షలు చేస్తామో, నిందితులకూ ఆ విధంగానే వైద్య పరీక్షలు చేయాలి. అవీ జరగలేదు. పోలీసులు విధి నిర్వహణకు వచ్చినప్పుడు అన్నీ రికార్డు అవుతాయి. వాటిని విచారణ సమయంలో అడిగితే..... తుపాను వచ్చి పోయాయనీ, చెదలు పట్టి పోయాయనీ చెప్పారు. బాధితుల బట్టల మీద ఎలాంటి లైంగిక దాడి జరిగినట్లు ఆధారాలు లేవని వైద్యులు తప్పుడు నివేదికలిచ్చారు. ముద్దాయిలు నిర్దోషులుగా బయటపడినందుకు బాధ ఉన్నా....తమపై అత్యాచారం జరిగినట్లుగా కోర్టు నమ్మినందుకు ఆదివాసీలు సంతోషించారు.

ఈ కేసు చాలామందికి ప్రత్యేకమైన కేసు. అత్యాచారాల కేసుల్లో ఎన్ని సాక్ష్యాలు సమర్పించినా, అనేకసార్లు కోర్టులకు వెళ్లి చెప్పడం మరోసారి అత్యాచారానికి గురవ్వడమే అనే మహిళా సంఘాల మాట వాస్తవం. దర్యాప్తు సరిగ్గా జరగలేదనేది న్యాయస్థానం భావించడం ముఖ్యమైనది. చాలా కేసుల్లో అత్యాచార బాధితులకు కుటుంబమే సహకరించదు. ఇది చాలా కష్టంతో కూడుకున్నది. ఫిర్యాదు కూడా చేయని పరిస్థితుల్లో చాలా మంది మహిళలుంటారు. విచారణ వరకూ వచ్చినా.. మనం ఉన్న వ్యవస్థలో.. చట్టంలో, కోర్టుల్లో బాధిత మహిళలకు మద్దతు ఉంటుందని నేనైతే చెప్పను. క్రాస్ ఎగ్జామినేషన్‌లో అనవసరమైన, అవమానకరమైన ప్రశ్నలు వేయడం .. లైంగికపరమైన నేరాల్లో జరుగుతోంది. చాలా అత్యాచారం కేసుల్లో దర్యాప్తు అనేది జరగదు. అలాంటి కేసుల్లో భవిష్యత్తులో ఈ కేసు కచ్చితంగా మార్గదర్శకత్వంగానే ఉంటుంది. బాధితులు ఆ రోజు నుంచి ఈ రోజు వరకూ పోరాటం వైపే నిలిచారు. ఒక్కరోజు కూడా జంకలేదు. వాళ్ల ధైర్యం, ఓపిక గురించి మనం చాలా నేర్చుకోవాలి.

# తొలి నుంచీ తప్పుదోవలోనే దర్యాప్తు

- స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుంకర రాజేంద్రప్రసాద్

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

ఈ కేసు దర్యాప్తు తొలినుంచీ నిందితులను రక్షించేవిధంగా, బాధితులను మరింత క్షోభపరిచేవిధంగా సాగిందని కోర్టు ద్వారా నియమితులైన స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుంకర రాజేంద్రప్రసాద్ చెప్పారు. సంఘటన జరిగిన తొలిరోజుల్లోనే అప్పటి హోంశాఖ మంత్రి కుందూరు జానారెడ్డి, పోలీసు బాస్ బాసిత్‌లను మీడియా ప్రతినిధులు వివరణ కోరినప్పుడు అటువంటిదేమీ లేదని, అత్యాచారం జరగలేదని ప్రకటనలిచ్చేవారు. అంటే... నేర విచారణను పూర్తిగా ప్రభావితం చేసేలా వారి వైఖరి ఉందని ఆయన వివరించారు. అప్పటి ఘటన, విచారణ, కోర్టులో జరిగిన ప్రక్రియను ఆయన ప్రజాశక్తికి వివరించారు. ఆయన మాటల్లోనే.

కోర్టు ఉత్తర్వుల మేరకు 2018 మేలో కోర్టుకు తొలిసారి హాజరయ్యాను. అప్పటి నుండి విచారణ ప్రారంభమైంది. తొలుత విచారణ చేసిన పోలీసులు ఫాల్స్ కేసుగా కొట్టి పారేశారు. గ్రేహౌండ్స్ సిబ్బంది జరుపుతున్న కూంబింగ్ ఆపరేషన్‌ను నిలువరించేందుకు మావోయిస్టులు మహిళల ద్వారా కుట్రపన్నారని చెబుతూ కేసును తప్పుదోవ పట్టించే పనిచేశారు. పోలీసుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేందుకు పన్నిన పన్నాగమనే వాదనను ముందుకు తెచ్చారు. పోలీసులు ముద్దాయిలవ్వడం, వారిని రక్షించాలనే విధానపరమైన నిర్ణయం ప్రభుత్వం తీసుకోవడంలో భాగంగానే కేసును నీరుగార్చే ప్రక్రియ సాగిందని స్పష్టంగా అర్థమైంది. ఏదైనా నేరం జరిగితే ముద్దాయి స్థాయి, స్థానం బట్టి కాకుండా ఎలాంటి విచారణ చేయాలి, ఎటువంటి విషయాలు సేకరించాలి, నేర నిర్ధారణ ఎలా చేయాలనే అంశంపై అనేక మార్గదర్శకాలున్నాయి. ఆ కోణంలో విచారణ చేయకుండా తప్పుడు కేసు అని చెప్పే కోణంలోనే విచారణ జరిపారే తప్ప నేరం జరిగిందనే కోణాన్ని పక్కన పడేశారు. ప్రతిదీ అబద్ధపు సమాచారం తప్ప అడిగిన దాన్ని ఇవ్వడానికి ఇష్టపడలేదు. నీతి, నిజాయితీగా విచారణ జరగలేదు. తొలి విచారణ అధికారి ఆనందరావు నుండి శివానందరెడ్డి వరకూ ఇలాగే జరిగింది. ఈ కేసులో ముద్దాయిలు స్టేట్ రిప్రజంటేటివ్స్‌గానూ, ప్రాసిక్యూటర్ వారికి వ్యతిరేకంగానూ విచారణ జరపాల్సి వచ్చింది.

అత్యాచారం జరిగిందని ఫిర్యాదు చేస్తే నేరస్తులకు తొలుత వైద్య పరీక్షలు చేయాలి. కానీ చేయలేదు. దీనిపై నేను హైకోర్టులో పిటిషన్ వేస్తే అప్పుడు నిందితులకు పరీక్షలు జరపాలని, నివేదికను సీల్డ్ కవర్లో కోర్టుకు సమర్పించాలని కోర్టు ఆదేశించింది. కేసు ప్రాపర్టీని హైదరాబాద్‌లోని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. తిరిగి రాలేదు. అది ఏమైందని లేఖ రాస్తే ధ్వంసం చేశామని ఫోరెన్సిక్ ల్యాబ్ నుండి సమాధానం వచ్చింది. దీనిపై మరోసారి కోర్టుకు వెళ్లగా, ఎప్పుడు ధ్వంసం చేశారు. ధ్వంసం చేయాలని ఎవరు ఉత్తర్వులిచ్చారు. ఏయే ప్రాపర్టీని ధ్వంసం చేశారో పూర్తి వివరాలు సమర్పించాలని కోర్టు ఆదేశించిన కొన్నాళ్లకు ....ఫోరెన్సిక్ అధికారులు కేసు ప్రాపర్టీ తీసుకొచ్చారు. వెతికాం, దొరికిందని న్యాయస్థానానికి సమర్పించారు. అంటే ఈ కేసులో వ్యవస్థలన్నీ బాధ్యతారాహిత్యంగా వ్యవహరించాయి. నిందితులను గుర్తించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోపాటు అనేక లోపాలు జరిగినట్లు గుర్తించాం. ప్రతి పోలీసు అధికారీ పరిమితంగా ఆలోచన చేయడం, నిందితులకు అనుకూలంగా విచారణ చేయడం వంటి చర్యలకు దిగారు. దీనిపై ఐపిఎస్ అధికారులు కూడా సాక్ష్యాలు చెప్పలేదు. దీంతో కోర్టు వారిని చేతగానివాళ్లుగా ప్రకటించిన ఘటనలు ఈ కేసులో జరిగాయి. కేసులో సాక్షులను కాపాడుతూ బాధితుల తరుపున నిలబడిన వారిని పోలీసులు బెదిరించారు. సాక్షులకు అన్నం పెట్టారనే ఒకే ఒక కారణంతో మానవ హక్కుల నాయకుడు వాసిరెడ్డి కృష్ణ అనే వ్యక్తిపై పోలీసులు ఎన్ఐఏ సహకారంతో ఉపా చట్టం కింద కేసు పెట్టారు. బాధితుల తరుపున నిలబడిన వారందరిపై మావోయిస్టులకు సహకరిస్తున్నారని, వారు చెప్పినట్లు చేస్తున్నారనే నేరాన్ని మోపి కేసులు బనాయించారు. సాక్షులకు అన్నం పెట్టడం నేరం కాదనే ప్రాథమిక న్యాయసూత్రాన్ని పోలీసులు విస్మరించారు. ఈ కేసు విచారిస్తున్న న్యాయవాది త్రినాథరావుపైనా కేసు నమోదు చేశారు. పోలీసులే ముద్దాయిలైతే విచారణ ఎంత అన్యాయంగా జరుగుతుందో, వారి మానసిక పరిస్థితి ఎంత హీనంగా తయారవుతుందనేందుకు ఈ కేసు ఉదాహరణ అనడంలో ఏ మాత్రమూ సందేహం లేదు.

ఈ కేసులో నిందితులకు కఠినశిక్ష పడకపోవడానికి కారణం ఏమిటంటే ...అత్యాచారం చేసిన పోలీసులను గిరిజన మహిళలు గుర్తించలేకపోయారు. 12 సంవత్సరాల తరువాత ఒక మనిషిని గుర్తించడం, అదీ అదివాసీ మహిళలకు సాధ్యమవుతుందా అంటే ఏ విధంగానూ అసాధ్యమనే తెలపాలి. ఆధారాలు లేకుండా శిక్ష వేయడమూ న్యాయశాస్త్రం ప్రకారం సమ్మతం కాదు. కానీ ప్రభుత్వాలు, పోలీసులు మొత్తం ఏమీ జరగలేదనే తప్పుడు అభియోగాలు మోపినా.... గిరిజన మహిళలు అబద్ధపు కేసు పెట్టారనే విమర్శ చేసినా ...అత్యాచారం జరిగిందని కోర్టు నమ్మింది. ఫిర్యాదు వస్తే దాన్ని కిందిస్థాయి అధికారులు విచారణ జరపకముందే ఏమీ జరగలేదని చెప్పడం విచారణను ప్రభావితం చేయడం, కేసు పీకనొక్కడమే అవుతుంది. పూర్తి విచారణ అనంతరం న్యాయస్థానం కొంతవరకైనా బాధితులకు న్యాయం చేసిందనే చెప్పవచ్చు. మొత్తంగా ఐదేళ్ల విచారణ కాలంలో 70 సార్లు కోర్టుకు హాజరయ్యాను.

భవిష్యత్‌లో పోలీసులైనా, మరేవరైనా సరే... నేరాలకు పాల్పడిన సమయంలో నిష్పక్షపాత విచారణ చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపైన ఉందనేది సుస్పష్టం. గిరిజనులు, దళితులను ఉద్ధరిస్తామనే ప్రకటన చేయడానికే ప్రభుత్వాలు పరిమితం కాకుండా వారికి అన్యాయం చేసిన వారిపై చర్యలు తీసుకోవడానికి సిద్ధపడాలి.అప్పుడే వారికి న్యాయం జరిగినట్లు అవుతుంది.

## మలుపులెన్నెన్నో !

**ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి**

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని జి.మాడుగుల మండలం నుర్మతి పంచాయతీ వాకపల్లి గ్రామానికి చెందిన 11 మంది గిరిజన మహిళలపై గ్రేహౌండ్స్ పోలీసులు అత్యాచారానికి పాల్పడిన సంఘటనపై కేసు నమోదు నుంచి గురువారం స్పెషల్ కోర్టు తీర్పు వరకు ఎన్నో మలుపులు చోటుచేసుకున్నాయి. ఈ కేసుపై ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహించింది. వైద్య పరీక్షలు సకాలంలో నిర్వహించకుండా చూశారు. నిందిత గ్రేహౌండ్స్ బలగాలను రక్షించేందుకు ప్రభుత్వం అప్పట్లో ఉద్దేశపూర్వకంగా చేసిన ప్రయత్న ఫలితమే 13 మంది నిందితులను నిర్దోషులుగా కోర్టు ప్రకటించడానికి దారితీసింది. సాక్ష్యాలు లేకుండా చేయాలని, కేసును బలహీనపర్చాలని చేస్తున్న ప్రయత్నాలపై అప్పట్లో పెద్దఎత్తున ప్రజా సంఘాలు ఆందోళన చేపట్టాయి. ప్రజా సంఘాలు ఏ అనుమానాలైతే లేవనెత్తాయో.. కోర్టు తన తీర్పులో కూడా అదే విషయాల్ని నొక్కిచెప్పింది. సరైన సాక్ష్యాధారాలు లేనందున వారు నిర్దోషులని వ్యాఖ్యానించింది. విచారణాధికారుల వైఫల్యం వల్ల నిందితులను నిర్దోషులుగా ప్రకటించాల్సివస్తుందని చెబుతూ.. సరిగా విచారణ చేపట్టని అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

**నాడు ఏం జరిగింది..**

గ్రేహౌండ్స్‌కు చెందిన 21 మంది పోలీసులు 2007 ఆగస్టు 20 తెల్లవారు జామున వాకపల్లిలో మావోయిస్టులు వున్నారన్న పేరుతో సోదాలకు దిగారు. మగవాళ్లు పొలం పనులకు వెళ్లిపోయారన్న విషయాన్ని గుర్తించి ఆదివాసీల ఇళ్లల్లోకి ప్రవేశించి 11 మంది గిరిజన మహిళలపై అత్యాచారానికి పాల్పడ్డారు. తమను అత్యాచారం చేశారంటూ బాధిత మహిళలు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

# వేర్పాటువాదుల చర్యలను తిప్పికొడతాం !

- సంసిద్ధతను ప్రకటించిన పిఎల్‌ఎ
- తైవాన్ చుట్టూ సైనిక విన్యాసాలు

**బీజింగ్ :** తైవాన్‌కు స్వాతంత్ర్యం కావాలని కోరుతున్న వేర్పాటువాదులు, వారికి మద్దతు ఇస్తున్న అమెరికా ఇతర పశ్చిమదేశాల కుతంత్రాలను తిప్పికొట్టేందుకు చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పిఎల్‌ఎ) సంసిద్ధమైంది. తైవాన్ ద్వీపం చుట్టూ గస్తీని, విన్యాసాలను ముమ్మరం చేయడం ద్వారా అటు తైవాన్‌కు, ఇటు అమెరికాకు గట్టి హెచ్చరికలు పంపింది. తైవాన్ నేత త్సాయి ఇన్ వెన్ పర్యటన ముగిసిన వెంటనే పిఎల్‌ఎ మూడు రోజుల పాటు సైనిక విన్యాసాలు చేపట్టింది. ఈ విన్యాసాలను పిఎల్‌ఎ సమర్థించుకుంది. ఈ ప్రతి చర్యలు తప్పవని పేర్కొంది. తైవాన్ జలసంధిలో అటు నీటిలోనూ, ఇటు నింగిలోనూ పిఎల్‌ఎ చేపట్టే గస్తీ విన్యాసాలు, తూర్పు, ఉత్తరం, దక్షిణం మొత్తంగా దీవిని చుట్టుముట్టగల సత్తా తనకు ఉందని చెప్పకనే చెబుతున్నాయి. అంతేకాదు, చైనా తన సార్వభౌమాధికారాన్ని, ప్రాదేశిక సమగ్రతను పరిరక్షించుకునేందుకు కృత నిశ్చయంతో ఉందనడానికి ఇదొక నిదర్శనం. తైవాన్ అంశం తమ అంతర్గత వ్యవహారమని, జాతీయ పునరేకీకరణ అన్నది కీలక ప్రయోజనాలను నెరవేరుస్తుందని చైనా పదే పదే చెబుతూ వస్తోంది. విదేశీ శక్తులు ఇందులో జోక్యం చేసుకోవడానికి ఎంతమాత్రమూ అనుమతించబోమని స్పష్టం చేసింది. అయితే త్సాయి ఇంగ్ వెన్ అమెరికా హౌస్ స్పీకర్ మెకార్థీతో భేటీ కావడం కవ్వింపు చర్యేనని పేర్కొన్న చైనా , తన ప్రాదేశిక సమగ్రతను కాపాడుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడతామని అమెరికాకు తేల్చి చెప్పింది.

తైవాన్ నాయకురాలు త్సాయి ఇంగ్ వెన్, అమెరికన్ హౌస్ స్పీకర్ కెవిన్ మెకార్థీ భేటీకి వ్యతిరేకంగా కాలిఫోర్నియాలో సిమివ్యాలీలో రోనాల్డ్ రీగన్ ప్రెసిడెన్షియల్ లైబ్రరీ వద్ద చైనీయులు, ఇతర దేశాలకు చెందిన శాంతి కార్యకర్తలు ఇటీవల నిరసన తెలియజేసిన దృశ్యం.

## ఐటి చట్ట సవరణలను తక్షణమే ఉపసంహరించాలి : డియుజె

**న్యూఢిల్లీ :** సామాజిక మాధ్యమాల్లో కేంద్ర ప్రభుత్వ ప్రస్తావనలకు సంబంధించిన పోస్టులను నిజ నిర్ధారణ చేసేందుకు వీలుగా ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పిఐబి)కి విస్తృత అధికారాలు కల్పిస్తూ ఐటి నిబంధనల చట్టం, 2021కి చేసిన సవరణలను ఢిల్లీ జర్నలిస్టుల యూనియన్ (డియుజె) తీవ్రంగా వ్యతిరేకించింది. వాస్తవానికి, ఈ సవరణల వల్ల పిఐబి స్వభావం, పనితీరు మారిందని, పిఐబికి విస్తృత పర్యవేక్షక అధికారాలను ఇచ్చిందని పేర్కొంది. ఈ మేరకు డియుజె అధ్యక్షులు ఎస్‌కె పాండే, ప్రధాన కార్యదర్శి సుజాత మధోక్, కార్యదర్శులు జిగీష్, అరూప్ సేన్‌లు ఒక సంయుక్త ప్రకటన జారీ చేశారు. ప్రభుత్వానికి, మీడియాకు మధ్య మధ్యవర్తిగా వ్యవహరించాలన్నది పిఐటి పనితీరని ఆ ప్రకటన పేర్కొంది. కానీ వాస్తవాల నిర్ధారణ పేరుతో పిఐబికి విస్తృత పర్యవేక్షక అధికారాలను ఇవ్వడం ఎంతమాత్రమూ సరికాదని ఆ ప్రకటన పేర్కొంది. పిబిఐ కొత్త సెన్సార్‌గా పనిచేస్తుందని, ఎమర్జెన్సీ కాలం నాటి ప్రమాదకరమైన అవశేషమే కాదు, అంతకన్నా అధ్వాన్నమైన విషయమని వారు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సవరణలనేవి భావ ప్రకటనా స్వేచ్ఛను అణచివేయడానికి జరిగిన మరో ప్రయత్నమని డియుజె విమర్శించింది.

## వైభవంగా కోదండరాముడి చక్రస్నానం

- ముగిసిన బ్రహ్మోత్సవాలు

**ప్రజాశక్తి - ఒంటిమిట్ట**

కడప జిల్లా ఒంటిమిట్టలోని కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరిరోజైన శనివారం ఆలయ సమీపంలోని పుష్కరిణిలో చక్రస్నానం నిర్వహించారు. అంతకుముందు ఉదయం 9.30 గంటలకు లక్ష్మణ సమేత సీతారాములవారు తిరుచ్చిలో, సుదర్శన చక్రత్తాళ్వార్ పల్లకిలో ఊరేగింపుగా పుష్కరిణి వద్దకు వచ్చారు. ఉదయం 10.30 నుండి 11 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు వేడుకగా స్నపనతిరుమంజనం నిర్వహించారు. అనంతరం చక్రస్నానం నిర్వహించారు. రాత్రి 7 గంటలకు ధ్వజావరోహణంతో కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో డిప్యూటీ ఇఒ నటేష్ బాబు, సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనుంజయ, ఆలయ అర్చకులు పాల్గొన్నారు. శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో 10వ రోజు ఆదివారం సాయంత్రం 6 నుండి రాత్రి 9.00 గంటల వరకు పుష్పయాగం వైభవంగా నిర్వహించనున్నారు.

సంపాదకీయం

# చారిత్రిక సాక్ష్యం... ఆవిష్కరణలు

శబ్దాన్ని కాలంతో మేళవించి, వినసొంపుగా మార్చే విలక్షణ ప్రక్రియ సంగీతం. ఇది విశ్వమంతా వ్యాపించి వుంది. ప్రకృతిలో మిళితమై... జీవన గమనంలో భాగమై-మనిషినీ, మనసును రంజింపచేయగల సుప్రసిద్ధ చతుష్షష్టి కళలలో సంగీతం ఒకటి. ఆదిమ కాలంలో భాష కంటే సంగీతమే ముందు పుట్టి వుంటుంది. మౌఖిక సంకేతాల ద్వారానే ఒకరి నుంచి మరొకరికి చేరి వుంటుంది. ఎలా చేరినా... పసితనం నుంచి ముదిమి వరకూ అందరినీ పరవశులను చేస్తూనే వుంది. 'శిశుర్వేత్తి పశుర్వేత్తి వేత్తి గానరసం ఫణి:' అన్నారు. శిశువులు, పశువులు, పాములు వశులగుదురు గానమునకు వసుధను నిజమే- అని అనేక శాస్త్ర పరిశోధనలు ధ్రువీకరిస్తున్నాయి. సంగీతానికి ప్రాథమిక లక్షణాలు శృతి, రాగం, తాళం, పల్లవి. 'పల్లవించవా నా గొంతులో/ పల్లవి కావా నా పాటలో' అంటాడో సినీ కవి. ఈ సంగీత సాహిత్యాల మేళవింపు ప్రజలను చేరడానికి ఇప్పుడైతే.. ఎన్నో పరికరాలు, వాయిద్యాలు, మాధ్యమాలు, సాంకేతికత అందుబాటులో వున్నాయి. రకరకాల పద్ధతుల్లో సంగీతాన్ని రికార్డు చేయడానికి ఆధునిక పరికరాలతో కూడిన ప్రత్యేకమైన థియేటర్లు ఇప్పుడు అందుబాటులో వున్నాయి. గాత్రాన్ని, సంగీతాన్ని అనుసంధానించడానికీ వెసులుబాటు వుంది. అంతే కాదు... ఎన్నో కేసులలో ఆడియో టేపులు కీలకమైన సాక్ష్యాధారాలుగా నిలిచిన సందర్భాలూ వున్నాయి. వీటన్నింటికీ మూలం శబ్దాన్ని రికార్డు చేసే ప్రక్రియ.

నేడు చాలా సులభంగా మనకు నచ్చిన ధ్వనిని రికార్డు చేయగలుగుతున్నాం. దీనికి అనేక పరికరాలు అందుబాటులో వున్నాయి. గతంలో టేప్‌రికార్డర్, వాయిస్ రికార్డర్లతో మాటలను, పాటలను రికార్డు చేసేవాళ్లం. ఇప్పుడైతే మొబైల్ ఫోన్ అన్ని కొరతలనూ తీర్చేస్తోంది. అయితే, ధ్వనిని మొదట్లో ఎలా రికార్డు చేసేవారో తెలుసుకుంటే ఆశ్చర్యపోక తప్పదు. 163 ఏళ్ల క్రితం-1860 ఏప్రిల్ 9న ధ్వని యంత్రంతో మొట్టమొదటిగా ఫ్రెంచ్ జానపద పాట అయిన 'ఔ క్లెయిర్ డి లా లూన్' నుంచి ఒక స్నిప్పెట్‌ని రికార్డు చేశారు. ఎడ్వర్డ్ లియోన్ స్కాట్ డి మార్టిన్‌విల్లే 'ఫోనాటోగ్రాఫ్' అనే ధ్వనిని రికార్డు చేసే పరికరంతో ఈ ఘనత సాధించాడు. ఇది పొగతో నల్లబడిన కాగితంపై ధ్వని తరంగాలను గుర్తించడం ద్వారా పనిచేసింది. అయితే, ఈ పరికరాన్ని మార్టిన్‌విల్లే 1857లో రూపొందించడంతో పాటు, దీనిపై పేటెంట్ కూడా పొందాడు. ఈయన రికార్డు చేసిన ఫోనాటోగ్రామ్‌లను 20 ఏళ్ల తర్వాత తిరిగి ప్లే చేస్తారని కూడా అప్పుడు ఆయన ఊహించలేదు. ఆ పనిని 1877లో థామస్ ఎడిసన్ ఫోనోగ్రామ్ ద్వారా సాధించాడు. అలా ఎప్పటికప్పుడు సరికొత్త సాంకేతికతను ఆవిష్కరించుకుంటూ నేటి ఆధునికతను అందిపుచ్చుకుంది. రికార్డింగ్ మాధ్యమం నిరంతరం మారుతూ వుండవచ్చు. పాటలు, మాటలను రికార్డు చేయడమే కాకుండా, రహస్యంగా రికార్డు చేయగలుగుతున్న అనేక పరికరాలకు, యాప్‌లకు మాతృక ఫోనాటోగ్రాఫ్ అనే చెప్పాలి.

చరిత్ర గమనాన్ని పరిశీలించినప్పుడు-ఏ విజ్ఞానమైనా చరిత్రకు సాక్ష్యాలుగా నిలుస్తుందని నిరూపితమైంది. అదొక సాంకేతిక పరికరం కావొచ్చు... పుస్తకం కావొచ్చు. లేదా రకరకాల ఆడియో, వీడియో ఫార్మాట్లలో వున్న రికార్డులు కావొచ్చు. ఇవేమీ మార్చేస్తే మారిపోయేవి కావు. రావణుడు పుష్పక విమానంలో తిరిగినట్లు రామాయణంలో వుందని కొందరు చెపుతారు. కానీ, ఈ విమానాన్ని కనిపెట్టింది 1905లో రైట్ బ్రదర్స్ అనే విషయం ప్రపంచ చరిత్ర చెప్పే సాక్ష్యం. చింపేస్తే చిరిగిపోవడానికి అది ఒట్టి కాగితం కాదు. చరిత్రలో నమోదు చేయబడిన చారిత్రక ఆవిష్కరణ అది. నేడు మనం అనుభవిస్తున్న సాంకేతికత అంతా ప్రాథమిక స్థాయి నుంచి ఆవిష్కరించినవే. రేడియో, టీవీ, ఇంటర్నెట్, కంప్యూటర్ నుంచి నేటి ఆర్టిఫిషియల్ ఇంటెలింట్ వరకు అన్నీ మొదట ప్రాథమికంగా రూపొందినవే. ఫోనాటోగ్రాఫ్ కూడా అనేక ప్రయత్నాల తర్వాత ఒక ధ్వనిని రికార్డు చేయగలిగింది. ఇప్పుడు అదే ధ్వనిని ఎన్ని రకాలుగా ఉపయోగిస్తున్నామో, రికార్డు చేస్తున్నామో తెలిసిందే. 'విజేతలు మనకన్నా వేరే విభిన్నమైన పనులు చేయరు. మనం చేసే పనులనే విభిన్నంగా చేస్తారు' అంటారు 'యు కెన్ విన్' గ్రంథ రచయిత శివ్ ఖెరా. చరిత్రలో లిఖించబడిన ఈ ఆవిష్కరణలు యువతకు స్ఫూర్తినిస్తాయి. ఆవిష్కర్తలుగా విజేతలను తయారు చేస్తాయి. చరిత్రను తుడిచేయాలనుకుంటే...అది ఎక్కడోక చోట, ఏదోక రూపంలో మళ్లీ మళ్లీ ఆవిష్కృతం అవుతూనే వుంటుంది.

మహోన్నతుల మాట



**సమాజ పరివర్తనకు, దారిద్ర్య నిర్మూలనకు, ఆకలిని అంతం చేయడానికి ఒక విప్లవాత్మక సాధనం విద్య. మనిషి వ్యక్తిత్వ వికాసం, వ్యక్తి సామర్థ్యాలను పెంచే సాధనం విద్య.**

**- పాలో ఫ్రీరీ,**
**బ్రెజిల్ విద్యావేత్త.**

# బిజెపి కుయుక్తులు, మోడీజీ సూక్తులు!

ప్రస్తుతం



తెలకపల్లి రవి

తెలుగు రాష్ట్రాలలో బిజెపి హడావుడి ప్రధాని మోడీ రాకతో పరాకాష్టకు చేరింది. అక్షరాలా అధికార కార్యక్రమమైనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వంపై రాజకీయ దాడికి దిగిన మోడీ దాదాపు ఎన్నికల ప్రచార సభలా మార్చేశారు. ఒకటికి రెండు ఆడియో విజ్యువల్స్ ప్రదర్శిస్తూ రాష్ట్రాభివృద్ధికి, దేశాభివృద్ధికి గొప్ప కృషి జరుగుతున్నట్టు చిత్రించుకున్నారు. తర్వాత స్వయంగా తన ప్రసంగంలోనూ అదే పాట పాడారు. దేశంలో ప్రాథమిక సదుపాయాల మెరుగుదల కోసం, రవాణా విస్తరణ కోసం కేంద్రం పరితపిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం సహకరించడం లేదని తిట్టిపోశారు. తాను అవినీతిపై పోరాడుతుంటే కుటుంబ పాలన చేసేవారు అడ్డు తగులుతున్నారని ఆరోపణలు గుప్పించారు. మరో విధంగా చెప్పాలంటే పరోక్ష భాషలో బిఆర్ఎస్ ప్రభుత్వంపై, కెసిఆర్ కుటుంబంపై కసితీరా దాడి చేశారన్నమాట. ఇతర పార్టీల ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రంతో కలసిరావడం లేదని అందరిపై అభాండం వేశారు. దానికి ముందు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మోడీ నాయకత్వం వర్ధిల్లాలని పదేపదే నినాదాలు చేయించి తమ ఉద్దేశం బయిటపెట్టుకున్నారు. హైదరాబాద్‌కు చార్మినార్ సంకేతమైతే మోడీ మాత్రం భాగ్యలక్ష్మి ఆలయం చిహ్నామనడంలోనూ, కిషన్ రెడ్డి పదేపదే హిందువులు తిరుపతి దేవుణ్ని చూడాలనుకుంటారని నొక్కి చెప్పడంలోనూ వారి మత రాజకీయం బహిర్గతమైంది. అంతేగాక సంతుష్టీకరణ విధానాల పేరిట మైనార్టీ సంక్షేమంపై ధ్వజమెత్తే బిజెపి నిరంతర పల్లవి కూడా ఆలపించారు.

**ఎ.పి లో మూడు పార్టీల వంత**

నిజానికి దేశంలో వందేభారత్ రైలుకు పదోసారి పచ్చ జెండా ఊపడం మోడీకే చెల్లింది. దశాబ్దాలుగా నడుస్తున్న ఎం.ఎం.టి.ఎస్ పనులకు కూడా మరోసారి శంకుస్థాపన చేశారు. అయితే ఇవేవీ యాదృచ్ఛికమైనవి కానే కాదు. తెలంగాణలో ఒక విధంగా, ఆంధ్రప్రదేశ్‌లో మరో విధంగా రాజకీయ పరిస్థితులు వున్నప్పటికీ బిజెపి మాత్రం ఏకైక లక్ష్యంతో పావులు కదుపుతున్నది. ఇక్కడి ప్రాంతీయ పార్టీల ప్రాభవాన్ని దెబ్బ తీసి తను పాదం మోపడం. బిఆర్ఎస్ అధ్యక్షుడు, తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ బిజెపి మతతత్వ రాజకీయాలు, కేంద్రం నిరంకుశ పోకడలపై తీవ్రంగా పోరాడుతున్నారు. ఈ విషయంలో వామపక్షాలు సహకారం ఇస్తున్నాయి కూడా. తామే అధికారంలోకి వస్తామని చెబుతున్న కాంగ్రెస్ విచిత్రంగా బిఆర్ఎస్, బిజెపి ఒకటేనని ఆరోపిస్తున్నది. మిగిలిన రెండు పార్టీలూ ఇదే విధంగా అవతలివారిపై ఆరోపణలు చేస్తున్నాయి. కొంతమంది కాంగ్రెస్ సీనియర్లు బిజెపిని ప్రధాన ప్రత్యర్థిగా చెబుతూ బిఆర్ఎస్‌తో అవగాహన సాధ్యమేనన్నట్టు మాట్లాడుతుంటారు. జాతీయ స్థాయిలో ఈ మధ్య చాలా సందర్భాలలో ప్రతిపక్ష కార్యాచరణలో ఈ రెండు పార్టీలూ కలసి పనిచేస్తున్నాయి గాని రాష్ట్రంలో ఆ సూచనలు లేవు. అదే ఎ.పి ముఖ్యమంత్రి వైఎస్ఆర్‌సిపి అధ్యక్షుడు జగన్ మోహన్ రెడ్డి మోడీ సర్కారుతో సత్సంబంధాలు నెరుపుతున్నారు. ప్రధాన ప్రతిపక్ష నేత, టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు కూడా బిజెపితో సత్సంబంధాలు వున్నట్టు చూపించుకోవడానికి ప్రాధాన్యతనిస్తున్నారు. ప్రస్తుతం ఆయనతో సన్నిహితంగా మెలుగుతున్న జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ అంతకు ముందు నుంచి బిజెపితో మిత్రుడుగా కొనసాగుతూ వచ్చే ఎన్నికలలో ఓట్ల చీలిక నివారిస్తానంటున్నారు. వైసిపి సర్కారు లాగే టిడిపి, జనసేన కూడా బిజెపి కేంద్రం చుట్టూ ప్రదక్షిణలు చేయడం గాక రాష్ట్ర ప్రయోజనాల కోసం ఉమ్మడి పోరాటం చేయాలని, లౌకిక ప్రజాస్వామ్యం కాపాడుకోవాలని సిపిఎం నొక్కి చెబుతున్నది. ఇటీవలే ముగిసిన సిపిఎం రాష్ట్ర కమిటీ ఇదే విషయం నొక్కి చెప్పడమే గాక కార్యాచరణ కూడా ప్రారంభించింది. తాజాగా పోలవరం నిర్వాసితుల సమస్యలపై నిర్వహించిన అఖిలపక్ష సమావేశం ఇందుకో ఉదాహరణగా చెప్పొచ్చు. ఆ సమావేశంలో టిడిపి మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావుకూ సీనియర్ నాయకులు వడ్డే శోభనాద్రీశ్వరరావుకు మధ్య జరిగిన చర్చ ఇందుకు అద్దం పడుతుంది. పోలవరం విషయంలో కీలకమైన కేంద్రాన్ని పక్కన పెట్టి గత, ప్రస్తుత ప్రభుత్వాల కోణంలోనే విమర్శలు గుప్పిస్తే ఉపయోగం ఏమిటన్నది ఆయన వ్యాఖ్యల సారాంశం. నిజానికిది ఎ.పి రాజకీయాలలోనే సంక్లిష్టమైన అంశం.

**నిజానికి దేశంలో వందేభారత్ రైలుకు పదోసారి పచ్చ జెండా ఊపడం మోడీకే చెల్లింది. దశాబ్దాలుగా నడుస్తున్న ఎంఎంటిఎస్ పనులకు కూడా మరోసారి శంకుస్థాపన చేశారు. అయితే ఇవేవీ యాదృచ్ఛికమైనవి కానే కాదు. తెలంగాణలో ఒక విధంగా, ఆంధ్రప్రదేశ్‌లో మరో విధంగా రాజకీయ పరిస్థితులు వున్నప్పటికీ బిజెపి మాత్రం ఏకైక లక్ష్యంతో పావులు కదుపుతున్నది.**

బిజెపికి వ్యతిరేకంగా ప్రతిపక్షాల ఐక్య అవగాహన, ఉద్యమాలు ఉమ్మడి పోరాటం పెరుగుతున్న కొద్దీ వచ్చే ఎన్నికలలో మరోసారి అధికారాన్ని నిలబెట్టుకోవడం బిజెపికి పెద్ద సవాలుగానే తయారవుతున్నది. నిరంకుశ కార్పొరేట్ మతతత్వం, అదానీ కుంభకోణాలు, రాహుల్ అనర్హత వేటు వంటి వాటిపై అనేక రూపాల్లో వ్యక్తమవుతున్న నిరసనలు ప్రజాగ్రహాలు బిజెపిని భయపెడుతున్నాయి. బలమైన ప్రాంతీయ పార్టీలూ, వామపక్షాలు వున్న చోట గతంలో వలె నల్లేరు మీద బండిలా గెలవలేకపోవచ్చన్న వాస్తవం భయపెడుతున్నది. ఉన్న మిత్ర పక్షాలు కూడా దూరం కాగా కలసివచ్చే వారు కరువవుతున్నారు. అందులోనూ దక్షిణాదిన కాలూనడం బిజెపికి ఎప్పుడూ సవాలుగానే వుంది. కర్ణాటక చేజారవచ్చన్న అంచనాలు అన్ని వైపులా వినిపిస్తున్నప్పుడు కేరళ, తమిళనాడులలో ఠికాణా లేనప్పుడు తెలుగు రాష్ట్రాలపైనే ఆ పార్టీ అధిష్టానం దింపుడు కళ్లం ఆశ పెట్టుకుంది.

**ప్రాంతీయ పార్టీల తీరు**

మొదటగా టిడిపి 41వ వ్యవస్థాపక సభ హైదరాబాదులో జరిగింది. చంద్రబాబు ప్రసంగంలో బిజెపి విధానాలపై ఒక్క విమర్శ కూడా లేకపోగా ఒకటి రెండు సార్లు ప్రధాని మోడీకి కృతజ్ఞతలు చెప్పారు. ఆయనతో కలసి తాను సాధించిన విజయాలు కూడా చెప్పడమే గాక పరోక్షంగా నోట్ల రద్దును సమర్థించారు. పవన్ కళ్యాణ్‌తో చంద్రబాబుకు అవగాహన వుందనీ, జనసేన సీట్ల వరకూ చెప్పి బిజెపి విషయం తనకు వదిలేయమని ఆయనకు చెప్పారని టిడిపి కీలక నాయకులు చెబుతున్నారు. ఈ మధ్య ఒకటి రెండు సందర్భాలను పురస్కరించుకుని బిజెపి అధ్యక్షుడు నడ్డా టిడిపి గురించి సానుకూల సందేశాలిచ్చారు. అయితే వారే తమ వెంటపడుతున్నారని బిజెపి నేతలంటారు. ఈ మధ్యలో ముఖ్యమంత్రి జగన్ ఒకటికి రెండు సార్లు ఢిల్లీ వెళ్లి అమిత్ షా తో సహా కేంద్ర మంత్రులను కలసి వచ్చాక పార్లమెంటులో ఎ.పి ప్రశ్నలకు దాటవేత సమాధానాలు ఇచ్చారు, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపేది లేదనీ చెప్పారు. జగన్ ప్రభుత్వం ఎంత సానుకూలంగా చిత్రించినా పోలవరం సహా ఏ సమస్యపైనా కేంద్రం అవసరమైన చర్యలు చేపట్టింది, నిధులు విడుదల చేసింది లేదు. విచిత్రంగా ఇలాంటి సమయంలోనే పవన్ కళ్యాణ్ హఠాత్తుగా ఢిల్లీ వెళ్లారు. ఆ పార్టీ ఎంత హంగామా చేసినా కంటి తుడుపుగా కొద్దిసేపు నడ్డా కలిశాననిపించారు తప్ప భాగస్వామిగా ఆదరించింది లేదు. ఓట్ల చీలిక నివారించడం అనే పాట తప్ప పవన్ కొత్తగా చెప్పింది లేదు. మోడీ విశాఖ రాకలోనూ ఇలా కొద్దిసేపు భేటీ జరిపి రాష్ట్రానికి మంచిరోజులు వస్తాయి అని ప్రకటించిన పవన్ కళ్యాణ్ ఢిల్లీలోనూ సాధించింది శూన్యమే. ఎ.పి విషయంలో సానుకూల చర్చలు తీసుకునే ఉద్దేశమే బిజెపికి లేదని దీంతో మరోసారి స్పష్టమైంది. అయితే దీని తర్వాత కూడా జనసేన నాయకులు కేంద్రం ఏదో వొరగబెట్టినట్టు రాష్ట్రానిదే తప్పయినట్టు మాట్లాడటం వింతగొల్పుతుంది. రాహుల్ గాంధీ అనర్హత సమస్యపై కలసి రావాలని కె.వి.పి.రామచంద్రరావు ప్రత్యేకంగా అభ్యర్థించినా టిడిపి నుంచి అధికారిక స్పందన లేదు! మేము కష్టాల్లో వున్నప్పుడు మాతో కలసిరాని పార్టీలతో మేమెందుకు కలవాలని టిడిపి నేతలు జవాబిచ్చారు. కనుకనే మూడు ప్రాంతీయ పార్టీలూ ఏదో రూపంలో బిజెపి వ్యూహాలకే ఊతమిస్తున్న తీరును సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఇటీవలి రాష్ట్ర కమిటీ సమావేశానంతరం నిశితంగా విమర్శించారు.

**అక్షరాలా అధికార కార్యక్రమమైనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వంపై రాజకీయ దాడికి దిగిన మోడీ దాదాపు ఎన్నికల ప్రచార సభలా మార్చేశారు. ఒకటికి రెండు ఆడియో విజ్యువల్స్ ప్రదర్శిస్తూ రాష్ట్రాభివృద్ధికి, దేశాభివృద్ధికి గొప్ప కృషి జరుగుతున్నట్టు చిత్రించుకున్నారు. తర్వాత స్వయంగా తన ప్రసంగంలోనూ అదే పాట పాడారు. దేశంలో ప్రాథమిక సదుపాయాల మెరుగుదల కోసం, రవాణా విస్తరణ కోసం కేంద్రం పరితపిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం సహకరించడం లేదని తిట్టిపోశారు. తాను అవినీతిపై పోరాడుతుంటే కుటుంబ పాలన చేసేవారు అడ్డు తగులుతున్నారని ఆరోపణలు గుప్పించారు.**

కొత్త పార్టీగా వచ్చిన వైఎస్ఆర్‌టిపి అధ్యక్షురాలు షర్మిల బిజెపితో కలసి కార్యక్రమాలు ప్రతిపాదించడం, రాష్ట్రపతి పాలన పెట్టాలని కోరడం ఇదే కోవలో వుంది. నిరుద్యోగ సమస్యపై అంతా కలసి పని చేయాలని చెప్పే పేరుతో ఇటీవల ఉభయ కమ్యూనిస్టు పార్టీల కార్యాలయాలను సందర్శించిన షర్మిల ఆ పార్టీలపై అనుచిత ఆరోపణలు చేస్తే తమ్మినేని గట్టిగానే ఖండించారు. బిజెపి హానికర విధానాలకు వ్యతిరేకంగా బిఆర్ఎస్‌కు మునుగోడు ఎన్నికలలో మద్దతివ్వడం సరైందేనని స్పష్టం చేశారు. కమ్యూనిస్టులు బిఆర్ఎస్ బి టీమ్‌గా వున్నారని మీరు మా ఆఫీసుకు వచ్చి నిందలు వేయడం మర్యాద కాదని షర్మిలకు సూటిగానే చెప్పారు. మీడియా లోనూ ఇది ప్రధాన చర్చనీయాంశమైంది.

**నిరసనలే సమాధానం**

తెలంగాణలో తామే అధికారానికి రాబోతున్నామని ఆర్భాటం చేసిన బిజెపి కి క్షేత్రస్థాయిలో పరిస్థితి అనుకూలంగా లేదని తేలిపోయింది. లిక్కర్ కేసు పేరిట బిఆర్ఎస్ ఎంఎల్‌సి కవితను అనేకసార్లు విచారించడమే గాక అరెస్టు అనివార్యం అని హల్‌చల్ చేసినా ఇంతవరకూ అది సాధ్యం కాలేదు. ఇక ముందు ఏమయ్యేది తెలియదు. దేశవ్యాపితంగానే ప్రతిపక్షా లు ఇ.డి, సిబిఐ ల దుర్వినియోగాన్ని రాజకీయంగా న్యాయపరంగా కూడా సవాలు చేయడం వాతావరణం మార్చింది. ఈలోగా ప్రశ్నాపత్రాల వ్యవహారంలో బిజెపి పాత్ర అనుమానాస్పదంగా తేలి సాక్షాత్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అరెస్టయ్యారు. బెయిలు మీద ఆయన వచ్చినా కేసు కొనసాగుతున్నది. బిజెపి ఆశించినట్టు ప్రముఖులెవరూ ఆ పార్టీలో చేరింది లేదు. ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి మాత్రం చేరారు గాని ఆయన వల్ల ఒరిగేది లేదని బిజెపి నేతలే చప్పరిస్తున్నారు. తెలంగాణలో ఆశించింది జరగలేదని అర్థమైన మోడీ, అమిత్ షా లు పదేపదే పిలిచి మాట్లాడటం, పర్యటించడం సర్వసాధారణమైపోయింది. బిఆర్ఎస్ స్థాపన తర్వాత కెటిఆర్ ఎ.పి వ్యవహారాలపైనా దృష్టి పెంచి విశాఖ ఉక్కుపై లేఖ రాయడం చర్చకు కారణమైంది. ఈలోగా సింగరేణిలో అయిదు బావులు వేలం పెట్టడంతో విశాఖ ఉక్కు తంతు పునరావృతమవుతున్నది. మోడీ పర్యటన సమయంలోనే బిఆర్ఎస్ ఉభయ కమ్యూనిస్టు పార్టీలు చేపట్టిన నిరసన ప్రదర్శనలు ఆయనకు నిజమైన సమాధానంగా వున్నాయి. తెలంగాణలో సిపిఎం చైతన్య యాత్రలు పూర్తికాగా సిపిఐ సాగిస్తున్నది. ఎ.పి లోనూ ఉభయ పార్టీలూ 14వ తేదీ నుంచి ప్రజా సమీకరణలకు, ప్రచారోద్యమానికి శ్రీకారం చుడుతున్నాయి.

# బాల్య వివాహాలకు చెక్ పెడదాం

సమస్య

వి. రాంభూపాల్

దక్షిణ భారత దేశంలో అత్యధిక బాల్య వివాహాలు జరుగుతున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. ఇటీవల జాతీయ కుటుంబ ఆరోగ్య శాఖ ఐదవ సర్వే బాల్యవివాహాల తీవ్రతను వెల్లడించింది. ఆ వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాల్య వివాహాలు అత్యంత ముఖ్యమైన సమస్య అని, వీటిని అరికట్టేం దుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటామని శపథాలు చేశాయి. ఇది ఇప్పుడే కాదు. ప్రతి సర్వే సందర్భంగా ఈ విధమైన బీరాలు పోవడం ప్రభుత్వాలకు ఆనవాయితీగా మారింది. కానీ ఆచరణలో బాల్యవివాహాలు మరింతగా పెరిగిపోతున్నాయి.

**ఆందోళన కలిగిస్తున్న గణాంకాలు**

2021లో ప్రపంచంలో 1 కోటి 30 లక్షల మంది పిల్లలు (ప్రపంచంలో వున్న మొత్తం పిల్లల్లో పది శాతం మంది) 20 ఏళ్ల లోపు తల్లులకు జన్మించినట్లు ఐక్యరాజ్యసమితి లోని ఆర్థిక, సామాజిక వ్యవహారాల శాఖ ప్రకటించింది. మన దేశంలో పద్దెనిమిదేళ్ల లోపు బాలికలకు వివాహాలు జరుగుతున్నాయన్న గణాంకాలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. మధ్యప్రదేశ్‌లో 73 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 71 శాతం, రాజస్థాన్‌లో 68 శాతం, బీహార్‌లో 67 శాతం, ఉత్తరప్రదేశ్‌లో 64 శాతం ఈ తరహా పెళ్లిళ్లు జరుగుతున్నాయి. తాజాగా ఐదో జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం మన రాష్ట్రంలో 20-24 సంవత్సరాల మధ్య వయసున్న 29.3 శాతం మంది మహిళలకు 18 సంవత్సరాల లోపే పెళ్లిళ్లు అయ్యాయి. ఇందులో పట్టణాల్లో 21.7 శాతం మంది, గ్రామాల్లో 32.9 శాతం మంది యువతులకు చిన్నతనంలోనే వివాహాలు చేస్తున్నట్లు ఆ నివేదిక తెలిపింది. వీరిలో 12.6 శాతం మంది 15 నుండి 19 సంవత్సరాల లోపే గర్భం దాల్చారు. రాయలసీమ లోని ఎనిమిది జిల్లాలలో గత ఎనిమిది నెలల్లో 1,46,046 మంది గర్భం దాల్చినట్లు నమోదు కాగా అందులో 12 వేల మంది బాలికలు వుండడం ఆందోళనకరం. గుంటూరు జిల్లా (ఉమ్మడి జిల్లా)లో 20.7 శాతం, చిత్తూరు 19.7, ప్రకాశం 16.4, నెల్లూరు 14.9, అనంతపురం 13.6, కర్నూలు జిల్లాలో 12.4 శాతం మంది అమ్మాయిలు చిన్న వయసులోనే గర్భం దాల్చారని ఈ నివేదిక ప్రకటించింది.

**సామాజిక రుగ్మత**

చట్టప్రకారం నిర్ణయించిన వయసు కంటే ముందు జరిగే వివాహాలను బాల్యవివాహాలు అంటాం. అమ్మాయికి 18, అబ్బాయికి 21 సంవత్సరాలు పెళ్లీడు వయసుగా ప్రభుత్వాలు నిర్ణయించాయి. పెళ్లికి అమ్మాయిల కనీస వయసు 18గా ప్రపంచంలో చాలా దేశాలు నిర్ణయించాయి. ఈలోపు వివాహాలు జరపడాన్ని ప్రభుత్వాలు చట్టబద్ధంగా నిషేధించి, శిక్షలు కూడా నిర్ణయించాయి. మన దేశంలో ప్రాచీన కాలం నుండి కొనసాగిన అనేక సామాజిక రుగ్మతల్లో బాల్యవివాహాలు కూడా ముఖ్యమైనవి. అశాస్త్రీయ భావజాలమైన మనుధర్మ ప్రభావం మన కుటుంబ వ్యవస్థ మీద చాలా ఎక్కువగా వుండడం కూడా ఈ స్థితికి కారణం. చదువు కొందరికే పరిమితం కావడం, భూస్వామ్య కుటుంబాల అనుకరణ, కనీస జీవన ప్రమాణాలు తక్కువగా వుండడం...లాంటి అనేక కారణాలు బాల్యవివాహాలు కొనసాగడానికి తోడ్పడ్డాయి. జాతీయోద్యమ వేళ పరాయి పాలనపై పోరాడుతూనే మన సమాజంలోని అనేక రుగ్మతలపై ఉద్యమించాం. అందులో భాగంగానే బాల్యవివాహాల నిషేధం కోసం, వితంతు వివాహాల కోసం పోరాడాం. దీని ఫలితంగా 1872 లోనే బాల్య వివాహాలను రద్దు చేస్తూ అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం చట్టం చేయాల్సి వచ్చింది. కాలానుగుణంగా ఈ చట్టాన్ని మరింత పటిష్టంగా అమలు చేసేందుకు అనేక సవరణలు, చేర్పులు చేశారు. తాజాగా 2007 జనవరి 10న ఆమోదం పొందిన బాల్య వివాహ నిషేధ చట్టం ప్రకారం బాల్య వివాహన్ని ప్రోత్సహించే వారితో పాటు వివాహం జరిపే వారికి రెండేళ్ల జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా లేదా రెండూ విధించవచ్చు. చట్టాలు, శిక్షలు ఇంత ఖచ్చితంగా వున్నా నేటి ఆధునిక కాలంలో కూడా బాల్యవివాహాలు ఎందుకు కొనసాగుతున్నాయి?

**బాల్య వివాహం కేవలం కుటుంబ సమస్య కాదు. చిన్నారుల ఆరోగ్యం, భవిష్యత్తుతో పాటు ఒక జాతి నిర్మాణానికి సంబంధించిన అత్యంత ముఖ్యమైన అంశం. ఈ సమస్య మూలాలు సామాజిక వ్యవస్థలో, ఆర్థిక స్థితిలో, ప్రపంచీకరణ విధానాల్లో, మతతత్వ భావజాలంలో వున్నాయి. వీటిని లోతుగా పరిశీలించి శాస్త్రీయమైన పరిష్కారాలు చేపట్టకపోతే బాల్య వివాహాల ప్రభావం సమాజంపై చాలా తీవ్రంగా వుంటుంది.**

**అక్షరాస్యత**

నిరక్షరాస్యత బాల్యవివాహాలతో ముడిపడి వుంది. చదువు లేకపోవడంతో బాల్య వివాహాల వల్ల వచ్చే ఇబ్బందులను గుర్తించకపోవడం, వాటి గురించి ప్రభుత్వాలు పెద్దగా ప్రచారం చేయకపోవడం, కుటుంబాల ఆర్థిక ఇబ్బందులు, ఆడపిల్లకు ఎంత త్వరగా పెళ్ళి చేస్తే అంత మంచిదనే అపోహ, ఎక్కువ చదివిస్తే మరింత చదువుకున్న వారితో పెళ్లి చేయాల్సి వస్తుందనే భయం వంటి అనేక అంశాలు బాల్యవివాహాలకు కారణాలు. కరోనా మహమ్మారి కూడా బాల్యవివాహాలు పెరగడానికి కారణమైంది. పాఠశాలలు మూతపడడంతో పాటు, లాక్‌డౌన్ నిబంధనల వల్ల పెళ్లిళ్ల ఖర్చు తగ్గడంతో తెలుగు రాష్ట్రాల్లో బాల్యవివాహాలు పెద్ద సంఖ్యలో జరిగినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో నూతన విద్యావిధాన చట్టం అమలుతో అనేక పాఠశాలలు మూతపడుతున్నాయి. విద్యను అభ్యసించాల్సిన అమ్మాయిలు పెళ్లిపీటలు ఎక్కుతున్నారు. ఉన్నత పాఠశాలలు, జూనియర్ కాలేజీలు అందుబాటులో లేకపోవడంతో పక్క ప్రాంతాలకు వెళ్లి చదువుకోవలసి రావడం అమ్మాయిలకు ఒక ప్రధాన సమస్యగా వుంది. అమ్మాయిలకు రక్షణ వుండదని, ప్రేమలో పడతారనే భయంతో బాల్యవివాహాలు జరుగుతున్నాయి.

**లింగ వివక్ష- ఆరోగ్యం**

లింగ అసమానత కూడా బాల్యవివాహాలకు ఒక కారణం. అమ్మాయిల సంఖ్య తక్కువగా వుండడంతో వయసుతో సంబంధం లేకుండా దగ్గరి బంధువుల్తో పెళ్లిళ్లు చేస్తున్నారు. వ్యాపార నాగరికత పెరిగే ఈ సమాజంలో కూడా శాస్త్ర విజ్ఞానం పెరిగేకొద్దీ సామాజిక అసమానతలు రద్దుకావాలి. కాని మన దేశంలో పురాతన భావాలు, ఆధునిక అనుకరణల మిశ్రమం మన సమాజాన్ని వెంటాడుతున్నది. ఇప్పటికీ కుల వివక్ష, లింగ వివక్ష కొనసాగుతూనే వున్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో వెయ్యి మంది బాలురకు 943 మంది అమ్మాయిలు వున్నారు. సమాన లింగనిష్పత్తి సాధించకుండా బాల్యవివాహాలను నిరోధించడం అంత తేలిక కాదు. యుక్తవయసు రాకముందే పెళ్లి చేయడం, గర్భం దాల్చడం వల్ల శిశు మరణాల్లో 15 శాతం పిల్లలు పురిట్లోనే మరణిస్తున్నారు. అమ్మాయిలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యల్లో రక్తహీనత ముఖ్యమైనది.

వాస్తవానికి బాల్య వివాహం కేవలం కుటుంబ సమస్య కాదు. చిన్నారుల ఆరోగ్యం, భవిష్యత్తుతో పాటు ఒక జాతి నిర్మాణానికి సంబంధించిన అత్యంత ముఖ్యమైన అంశం. ఈ సమస్య మూలాలు సామాజిక వ్యవస్థలో, ఆర్థిక స్థితిలో, ప్రపంచీకరణ విధానాల్లో, మతతత్వ భావజాలంలో వున్నాయి. వీటిని లోతుగా పరిశీలించి శాస్త్రీయమైన పరిష్కారాలు చేపట్టకపోతే బాల్య వివాహాల ప్రభావం సమాజంపై చాలా తీవ్రంగా వుంటుంది.

**/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు/**

జనవాక్యం

## బెట్టింగ్ మాయలో యువత

ఐపీఎల్ కొత్త సీజన్ పుణ్యమా అని బెట్టింగ్ దందా పడగ విప్పి బుసలు కొడుతున్నది. ఉజ్వల భవిష్యత్ వున్న యువత ఈ మాయదారి బెట్టింగ్ ఉచ్చులో పీకలదాకా కూరుకుపోయి ఎంతో డబ్బును కోల్పోతున్నారు. దీంతోపాటు, చదువులను అటకెక్కిస్తూ అథోగతి పాలవుతున్నారు. ఈ బెట్టింగ్ జాఢ్యాన్ని, జూదాన్ని అరికట్టడానికి పోలీసు డిపార్ట్‌మెంట్ వారు ఎన్ని కఠిన చర్యలు తీసుకుంటున్నప్పటికి అవేవీ పూర్తిస్థాయిలో సత్ఫలితాలను ఇవ్వడం లేదు. విద్యార్థులు ఈ మాయదారి జూదం లోంచి బయటపడలేక వేలాది, లక్షలాది రూపాయలు పోగొట్టుకొని ఆత్మహత్యలు సైతం చేసుకోవడం న్యూస్ పేపర్లలో, ఛానెళ్లలో చూస్తున్నాం. ఇప్పటికయినా విద్యార్థుల తల్లిదండ్రులు మేల్కొని తమ పిల్లలను ఓ కంట కనిపెడుతూ వారి ఉన్నత, ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాట వేయాలి. పోలీసు డిపార్ట్‌ంట్ వారు సైతం ఈ బెట్టింగ్ అనే ఈ విష మాయాజాలన్ని పెంచి పోషిస్తున్న వారిపై కొరడా ఝుళిపించి, ఈ అనాగరిక క్రీడను కూకటి వేళ్ళతో సహా పెకలించేందుకు నడుం బిగించాలి. సమాజంలోని బాధ్యతగల ప్రతి పౌరుడు వెంటనే మేల్కొని...ఈ బెట్టింగ్ నిర్మూలనకు తన వంతుగా కృషిచేయాలి.

**- బుగ్గన మధుసూదనరెడ్డి,**
**బేతంచెర్ల, నంద్యాల జిల్లా.**

**మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :**
**editpageps@ gmail.com**

## చట్టానికి మానవత్వం అవసరం

- సిజెఐ డివై.చంద్రచూడ్

**గువాహతి :** ప్రజా ప్రయోజనాలను కాపాడేందుకు చట్టం మానవత్వంతో వ్యవహరించాలని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై.చంద్రచూడ్ అభిప్రాయపడ్డారు. సమస్య మూలాన్ని తెలుసుకోవాలనీ, దానిని పరిష్కరించేందుకు చట్టం ఎల్లప్పుడూ కృషి చేయాలని నొక్కి చెప్పారు. గువాహతి హైకోర్ట్ 75వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జస్టిస్ చంద్రచూడ్ ప్రసంగిస్తూ.. చట్టం సమాజంలోని వాస్తవాలను పరిగణనలోకి తీసుకొని వాటిని ఆచరించేందుకు ప్రయత్నించాలని సూచించారు. చట్టాన్ని కూలంకషంగా అర్థం చేసుకుని ఆచరణలో పెడితే సమాజ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం ఏర్పడుతుందనీ, న్యాయం లభించే దిశగా అది ఒక ముందడుగు అవుతుందని తెలిపారు. 'స్వతంత్ర న్యాయవ్యవస్థపై ప్రజలు ఆధారపడతారు. వారి నమ్మకం, విశ్వాసంపైనే న్యాయవ్యవస్థ చట్టబద్ధత ఆధారపడి ఉంటుంది. ఆపన్నులైన ప్రజలకు న్యాయస్థానం మొట్టమొదటి, చిట్టచివరి ఆశాకిరణం కావాలి. జాతి నిర్మాణంలో శాసన, న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థలు మూడూ పాలుపంచుకోవాల్సి ఉంది' అని చంద్రచూడ్ ఆకాంక్షించారు.

## మళ్లీ కరోనా విజృంభణ

- 24 గంటల్లో 6,155 కేసులు

**ఢిల్లీ :** దేశంలో మళ్లీ కరోనా విజృంభిస్తోంది. తాజాగా 24 గంటల వ్యవధిలో 6,155 మంది కోవిడ్ వైరస్ బారిన పడగా, పాజిటివిటీ రేటు 5 శాతం దాటింది. దీంతో రాష్ట్రాలను కేంద్ర ప్రభుత్వం అప్రమత్తం చేసింది. వైరస్ వ్యాపిస్తున్న ప్రాంతాలను (ఎమర్జెన్సీ హాట్‌స్పాట్స్) గుర్తించి, దాని కట్టడికి చర్యలు తీసుకోవాలని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించారు. తాజా వ్యాప్తికి ఎక్స్‌బిబి.1.16 లేదా ఆర్క్టురస్‌గా పిలిచే కొత్త వేరియంట్ కారణమని వైద్యరంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటివరకు ఈ వేరియంట్‌కు సంబంధించి 100కు పైనే కేసులు నమోదైనట్లు తెలుస్తోంది.

## లంచంగా విలాసవంతమైన పర్యటనలు

- ఇరకాటంలో అమెరికా సుప్రీం న్యాయమూర్తి

**వాషింగ్టన్ :** రిపబ్లికన్ పార్టీకి చెందిన ఒక రియల్‌ఎస్టేట్ వ్యాపారి ఏర్పాటు చేసిన విలాసవంతమైన రహస్య టూర్లలో పాల్గొన్న అమెరికా సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ క్లారెన్స్ థామస్ నిర్వాకం బయటపడింది. దీంతో ఆయనపై అన్ని వైపుల నుంచి విమర్శల జడివాన కురుస్తోంది. టెక్సాస్‌లోని డల్లాస్ నగర కేంద్రంగా పనిచేసే రియల్ ఎస్టేట్ డెవలపర్ హర్లాన్ క్రో గత రెండు దశాబ్దాలకు పైగా జస్టిస్ థామస్ కోసం పలు విలాసవంతమైన పర్యటనలను ఏర్పాటు చేశారు. ఆ శత కోటీశ్వరుడి ప్రైవేట్ జెట్‌లో, ఓడలో ఈ పర్యటనలు సాగాయి. సన్నిహిత వ్యక్తిగత మిత్రుల నుండి ఈ రకమైన వ్యక్తిగత ఆతిథ్యం పొందడం గురించి ఎవరికీ చెప్పవద్దంటూ తనకు సూచనలు కూడా చేశారని థామస్ శుక్రవారం తెలిపారు.

## పెన్షన్లలో కోతపై పాక్ ఉద్యోగుల ర్యాలీ

**స్వాత్ :** పెన్షన్ సంస్కరణలకు వ్యతిరేకంగా పాకిస్తాన్‌లోని ప్రభుత్వ ఉద్యోగులు ఆందోళనబాట పట్టారు. పాక్ ప్రభుత్వం తీసుకొచ్చిన పెన్షన్ సంస్కరణలకు వ్యతిరేకంగా ప్రభుత్వ ఉద్యోగుల మహాకూటమి పిలుపు మేరకు స్వాత్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. ములాబాబా పాఠశాల నుంచి స్వాత్ ప్రెస్ క్లబ్‌వరకు జరిగిన భారీ ర్యాలీలో నిరసనకారులు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ సంస్కరణల్లో భాగంగా తమ పెన్షన్‌లో 35 శాతం కోత విధించడం అన్యాయమని, తాము అంగీకరించబోమని నిరసనకారులు పేర్కొన్నారు.

# కుటుంబ పాలనతో జాగ్రత్త !

## సికింద్రాబాద్ - తిరుపతి వందేభారత్ రైలు ప్రారంభోత్సవంలో ప్రధాని మోడీ

**ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో**

కుటుంబ పాలన నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి కలిగిస్తామని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. కుటుంబ పాలన వల్లే అవినీతి పెరుగుతోందని ఆయన అన్నారు. ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో శనివారం ఉదయం 11.20 గంటలకు బేగంపేట విమానాశ్రయానికి వచ్చిన ఆయనకు రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, అశ్విని వైష్ణవ్, తెలంగాణ బిజెపి అధ్యక్షుడు బండి సంజయ్, ఎంపి లక్ష్మణ్, రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, సిఎస్ శాంతికుమారి తదితరులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి ప్రత్యేక కాన్వాయ్‌లో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు ప్రధాని చేరుకున్నారు. పదో నెంబర్ ప్లాట్‌ఫాం వద్ద ఏర్పాటు చేసిన వేదికపై నుంచి జెండా ఊపి సికింద్రాబాద్–తిరుపతి వందే భారత్ రైలును ప్రారంభించారు. అనంతరం పరేడ్ మైదానంలో జరిగిన బహిరంగ సభలో మోడీ మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ పేరు ఉచ్చరించకుండానే ఆయనపై తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో కుటుంబపాలన సాగుతోందని, అవినీతి రాజ్యమేలుతోందని విమర్శించారు. తండ్రి, కొడుకు, కుమార్తె అధికారంలో ఉన్నారని, కుటుంబ పాలన కారణంగా అవినీతి పెరుగుతోందని అన్నారు. కరోనా, ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ప్రపంచం తిరోగమనంలోకి వెళితే... మన దేశం మాత్రం ప్రగతి ప్రస్థానాన్ని కొనసాగిస్తోందని అన్నారు. మౌలిక వసతుల కల్పనకు ఈ ఏడాది బడ్జెట్లో రూ.10 లక్షల కోట్లు కేటాయించామని తెలిపారు. ప్రజల సొమ్ము అవినీతిపరులకు చేరకుండా పటిష్టమైన చర్యలు

సికింద్రాబాద్‌లో జరిగిన సభలో ప్రసంగిస్తున్న మోడీ

తీసుకుంటున్నామని, డిజిటల్ విధానంతో దళారీ వ్యవస్థను రూపుమాపామని, ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్ధిదారులకు చేరుతున్నాయని అన్నారు. తెలంగాణలో రూ.35 వేల కోట్లతో జాతీయ రహదారుల నిర్మాణం చేపట్టామని, భారీ టెక్స్‌టైల్ పార్క్ నిర్మించుకున్నామని తెలిపారు. తొమ్మిదేళ్లలో భారత్ రూపురేఖలు సమూలంగా మార్చామని, దేశ అభివృద్ధిలో తెలంగాణ భాగమయ్యేలా చేశామని అన్నారు. కొంతమంది ప్రగతి నిరోధకులుగా మారారని పరోక్షంగా విపక్షాలను విమర్శించారు. తనపై పోరాటానికి ఆ శక్తులన్నీ కలిశాయని, కోర్టులకు కూడా వెళ్లారన్నారు. అవినీతిపరుల విషయంలో చట్టం తనపని తాను చేసుకుపోతుందని పేర్కొన్నారు. సభా వేదికపై నుంచే వర్చువల్ విధానంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ, ఎన్‌హెచ్ 15ఒసి, ఎన్‌హెచ్ 167ఎన్‌కె, ఎన్‌హెచ్ 365 బిజి, ఎన్‌హెచ్ 161బి విస్తరణ పనులకు, బిబి నగర్ ఎయిమ్స్‌లో పలు అభివృద్ధి పనులకు ప్రధాని శంకుస్థాపన చేశారు. మేడ్చల్–ఉందానగర్ మార్గంలో ఎంఎంటిఎస్ రైళ్లను మోడీ ప్రారంభించారు. సికింద్రాబాద్–మహబూబ్‌నగర్ మధ్య విద్యుదీకరణ, డబ్లింగ్ పనులను జాతికి అంకితం చేశారు.

## తెలంగాణకు కేంద్రం ఏం చేసింది?

- ప్రధాని మోడీని ప్రశ్నించిన రాష్ట్ర మంత్రులు

**ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఏం చేసిందో చెప్పాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని రాష్ట్ర మంత్రులు ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వం అభివృద్ధిని అడ్డుకుంటోందని సికింద్రాబాద్ సభలో మోడీ చేసిన వ్యాఖ్యలపై మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, గంగుల కమలాకర్ స్పందించారు. శనివారం వారు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలో కేంద్రం చేపట్టిన ఏ అభివృద్ధి పనులను అడ్డుకున్నామో చెప్పాలని వారు ప్రధాన మంత్రిని డిమాండ్ చేశారు. గతంలో కూడా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇలాగే మాట్లాడారని గుర్తు చేశారు. రాష్ట్రానికి రెండు మెడికల్ కాలేజీలు ఇస్తామని చెప్పినా, మెలిక పెట్టారని, ఊరికే బట్టకాల్చి మీద వేయాలని కేంద్రం చూస్తోందని విమర్శించారు. భారత్ బయోటెక్‌కు ప్రధాని వచ్చినప్పుడు సిఎం కెసిఆర్‌ను ఎందుకు పిలవలేదని ప్రశ్నించారు. తెలంగాణలో అభివృద్ధి జరగకపోతే ఇన్ని అవార్డులు ఎందుకు ఇస్తున్నారని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. తెలంగాణలో 24 గంటలు విద్యుత్తు ఇస్తున్నామని, ఈ అంశంపై బహిరంగ చర్చకు సిద్ధమా? అని మోడీని ప్రశ్నించారు. బిజెపిలో కుటుంబ పాలనపైనా, కర్ణాటకలో అవినీతిపైనా ప్రధాని ఎందుకు మాట్లాడరు? అని నిలదీశారు. బిఆర్ఎస్‌ను బద్నాం చేయాలనే కేంద్రం చూస్తోందని శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. బిజెపి పాలిత రాష్ట్రాలకు అవార్డులు ఎందుకు రావట్లేదని ప్రశ్నించారు. తెలంగాణ నుంచి కూడా రైళ్లు వెళ్లాలి కాబట్టే, వందేభారత్‌ను ఇక్కడి నుంచి ప్రారంభిస్తున్నారన్నారన్నారు. సింగరేణిని ఎవరి కోసం ప్రయివేటీకరణ చేశారో అందరికీ తెలుసని పేర్కొన్నారు. ప్రాజెక్టులకు జాతీయ హోదా లేదని చెబుతూనే, కర్ణాటకలోని అప్పర్‌భద్రకు ఎందుకు ఇచ్చారు? తెలంగాణపై కేంద్రానికి ఎందుకింత కక్ష? అని ప్రశ్నించారు. బిఆర్ఎస్‌పై విమర్శలు చేయడమే లక్ష్యంగా మోడీ కార్యక్రమం జరిగినట్లు అనిపిస్తుంది తప్ప, రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు.

# ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోండి

- పాఠ్యాంశాల తొలగింపుపై చరిత్రకారుల డిమాండ్

**న్యూఢిల్లీ :** 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి 12వ తరగతి పాఠ్యపుస్తకాలలో కొన్ని చాప్టర్లను తొలగిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని పలువురు చరిత్రకారులు ఎన్‌సీఈఆర్టీని డిమాండ్ చేశారు. గతంలో పాఠ్యపుస్తకాల రూపకల్పనలో భాగస్వాములైన నిపుణులను సంప్రదించకుండానే ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నారని నిలదీశారు. రోమిలా థాపర్, జయతీఘోష్ సహా 250 మంది చరిత్రకారులు ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్‌సీఈఆర్టీ చర్యను వారు ముక్తకంఠంతో ఖండిస్తూ ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మార్పులు భారత రాజ్యాంగ నీతికి విరుద్ధమని ఆక్షేపించారు. జాదవ్‌పూర్, జవహర్‌లాల్ నెహ్రూ, ఢిల్లీ, అశోకా యూనివర్సిటీలతో పాటు యూనివర్సిటీ ఆఫ్ అమ్‌స్టర్‌డామ్ సహా పలు విద్యాసంస్థలకు చెందిన విద్యావేత్తలు ఈ ప్రకటనపై సంతకాలు చేశారు.

'చరిత్ర పుస్తకాల నుంచి కొన్ని చాప్టర్లను తొలగించాలన్న ఎన్‌సీఈఆర్టీ నిర్ణయంపై మేము ఆందోళన చెందుతున్నాం. ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. విచ్ఛిన్నకర ఉద్దేశాలతోనే ఎన్‌సీఈఆర్టీ ఈ నిర్ణయం తీసుకుంది. రాజ్యాంగ నీతి, భారత ఉపఖండపు అవిభక్త సంస్కృతికి ఈ నిర్ణయం వ్యతిరేకం. అందువల్ల దీనిని సాధ్యమైనంత త్వరగా రద్దు చేయాలి' అని వారు ఆ ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో ఎన్‌సీఈఆర్టీ పాఠ్యపుస్తకాల రూపకల్పనలో భాగస్వాములైన కమలానెహ్రూ కళాశాలకు చెందిన విక్టోరియా పాషంగ్‌బామ్, జీసస్ అండ్ మేరీ కళాశాలకు చెందిన మాయా జాన్, రమ్‌జాస్ కళాశాలకు చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్ ముకుల్ మంగాలిక్ తదితరులు ఈ ప్రకటనపై సంతకాలు చేశారు. చరిత్రకారులు, అధ్యాపకులు సహా పాఠ్యపుస్తకాల రూపకల్పనలో పాలుపంచుకున్న వారిని సంప్రదించేందుకు ఎలాంటి ప్రయత్నం జరగలేదనీ, ఎన్‌సీఈఆర్టీ సభ్యుల అభిప్రాయాలు కూడా తీసుకోలేదని వారు విమర్శించారు.

'కోవిడ్ మహమ్మారి కారణంగా ఎదురైన ఇబ్బందులను, జాతీయ విద్యావిధానం–2020ని దృష్టిలో పెట్టుకొని విద్యార్థులపై ఒత్తిడి తగ్గించే పేరుతో ఎన్‌సీఈఆర్టీ పాఠ్యపుస్తకాలలో కొన్ని చాప్టర్లను తొలగించింది. ఇందులో భాగంగానే మొఘల్ చరిత్ర, కులం–అసమానతల ప్రస్తావనలు, 2002 గుజరాత్ అల్లర్లు, మహాత్మాగాంధీ జీవితం–హత్య వంటి చాప్టర్లు మాయమయ్యాయి. విద్యార్థులపై భారాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందంటూ అందుకు కోవిడ్, లాక్‌డౌన్‌ను సాకుగా చూపడం వివాదాస్పదమే' అని చరిత్రకారులు అభివర్ణించారు.

'6–12 తరగతులకు చెందిన సామాజిక శాస్త్రం, చరిత్ర, రాజకీయ శాస్త్రం పాఠ్యపుస్తకాల నుంచి మొఘలుల చరిత్ర, 2002 గుజరాత్ మత ఘర్షణలు, అత్యవసర పరిస్థితి, దళిత రచయితల ప్రస్తావన, నక్సలైట్ ఉద్యమం, సమానత్వం కోసం పోరాటం వంటి చాప్టర్లను వారు తొలగించారు. అయితే కోవిడ్ అనంతరం పరిస్థితులు సాధారణ స్థాయికి చేరుతున్న తరుణంలో, ఆన్‌లైన్ పద్ధతి అవసరం లేని ప్రస్తుత సమయంలో సైతం నూతన పాఠ్యపుస్తకాలలో ఈ మార్పులు చోటుచేసుకున్నాయి' అని వారు విమర్శించారు. విలువైన సమాచారాన్ని పొందే అవకాశాన్ని విద్యార్థులకు దూరం చేయడం సమస్యలకు దారి తీస్తుందనీ, ప్రస్తుత, భవిష్యత్ సవాళ్లను అధిగమించేందుకు అవసరమైన విలువలు వారికి అందకుండా పోతాయని ఆందోళన వ్యక్తంచేశారు. చరిత్రకారుల ఏకాభిప్రాయంతోనే మార్పులు, చేర్పులు చేయాలని వారు అభిప్రాయపడ్డారు. అలా కాకుండా కొన్ని చాప్టర్లను తొలగించడం విచ్ఛిన్నకర రాజకీయం అవుతుందని విమర్శించారు. ఈ రాజకీయాల కారణంగానే మొఘలుల చరిత్రను పాఠ్యపుస్తకాల నుంచి కనుమరుగు చేశారనీ, విజయనగర సామ్రాజ్యానికి సంబంధించిన అంశాల జోలికి వెళ్లలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ చరిత్రను సరిగా అవగాహన చేసుకోకుండా పాఠ్యాంశాలను తొలగించడం మతోన్మాదమే అవుతుందన్నారు. ఇది పాలకుల విచ్ఛిన్నకర మత, కుల అజెండాను బహిర్గతం చేస్తోందని చరిత్రకారులు విమర్శించారు.

## రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం

(మొదటిపేజీ తరువాయి)

రద్దు చేసి మనుస్మృతిని భారత రాజ్యాంగంగా తీసుకురావాలని, చాతుర్వర్ణ సిద్ధాంతాన్ని అమలు చేయాలని బిజెపి కుటిల యత్నం చేస్తోందని విమర్శించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ కేంద్రంలోని మోడీ, రాష్ట్రంలోని జగన్ నియంతల్లా వ్యవహరిస్తూ పేదలను, దళితులను, అణగారిన వర్గాలను లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తున్నారని విమర్శించారు. దళితుడైన డాక్టర్ అచ్చన్న ప్రాణానికి ముఖ్యమంత్రి సొంత జిల్లాలోనే రక్షణ లేకుండా పోయిందన్నారు. ప్రజాగాయకులు గద్దర్, కర్ణాటక మాజీ స్పీకర్, శ్రీనివాసపురం ఎమ్మెల్యే రమేష్ కుమార్, వికెసి పార్టీ తెలుగు రాష్ట్రాల ఇన్‌ఛార్జి బాలసింగం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్, వికెసి పార్టీ ఎమ్మెల్యేలు బాలాజీ, మహమ్మద్ షాన్వాజ్, వికెసి పార్టీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ముత్యాల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

**IKF Home Finance**

**ఐకెఎఫ్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్**

ప్లాట్ నం.30/ఎ, సర్వే నం.83/1, మై హోమ్ ట్విట్జ్, 11వ అంతస్తు, డైమండ్ హిల్స్, లుంబిని అవెన్యూ, 400/220/132కెవి జిఐఎస్ సబ్‌స్టేషన్ ప్రక్కన, ఎపిఐఐసి హైదరాబాద్, నాలెడ్జి సిటీ, రాయిదుర్గ్, హైదరాబాద్-081. ఫోన్:040-23412083. www.ikfhomefinance.com

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకపు ప్రకటన
అనుబంధం-4-ఎ (రూల్ 8(6)కు నియమలను చూడండి)

**ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6)కు నియమాలతో చదువబడే ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకపు ప్రకటన.**

ఇందుమూలంగా సర్వజనులకు మరియు ప్రత్యేకించి రుణగ్రహీతలు మరియు హామీదారులకు ప్రకటన ఇవ్వడమేమనగా, దిగువ వివరించిన స్థిరాస్తులు **ది ఐకెఎఫ్ ఫైనాన్స్ లిమిటెడ్**కు తాకట్టుపెట్టబడినవి/ చార్జ్‌చేయబడినవి. వాటిని **ఐకెఎఫ్ ఫైనాన్స్ లిమిటెడ్** యొక్క అధీకృత అధికారిచేత **భౌతిక స్వాధీనం**చేయబడినవి, మరియు పట్టికలో పేర్కొన్నట్లుగా రుణగ్రహీతలు మరియు హామీదారుల నుండి **ది ఐకెఎఫ్ ఫైనాన్స్ లిమిటెడ్**కు బకాయి పడిన మిగతా రుణ మొత్తాలను రికవరీచేయుట కొరకు ఇ-వేలం ప్రాతిపదికన **"ఏది ఎక్కడ ఎలా ఉన్నది అది అక్కడ అలాగే ఉంటుంది"** అనే ప్రాతిపదికన విక్రయించబడుతాయి. రుణగ్రహీతలు మరియు హామీదారుల వివరాలు, బకాయి మొత్తాలు, స్థిరాస్తి సంక్షిప్త వివరణ మరియు దానిపై తెలిసిన రుణ భారాలు, స్వాధీనతా విధానం, రిజర్వు ధర మరియు ధరావత్తు, వేలం తేది& సమయం యొక్క వివరాలు ఇందు దిగువ కూడా ఇవ్వబడినవి:

**(1) రుణగ్రహీతల పేరు: శ్రీ రాజేశ్ గుంటుపల్లి తండ్రి శ్రీ జి. వేంకటేశ్వర్లు, సహ-రుణగ్రహీత: శ్రీమతి నాగ శిరీష గుంటుపల్లి భర్త జి. రాజేశ్, ఇరువురి నివాసం:** డోర్ నం.6-37, బందరుపల్లి, పొన్నెకల్లు, గుంటూరు-522018.
**రుణ ఖాతా నంబర్లు: హోమ్ లోన్- ఎల్ఎన్‌జియుఎన్00618-190000570**
**హోమ్ లోన్-టాప్-అప్-ఎల్ఎన్‌జియుఎన్00718-190000720** **డిమాండ్ నోటీసు: 14.09.2021**
**బకాయి మొత్తాలు: 08.09.2021** నాటికి వడ్డీ+ వ్యయాలు మొ॥వాటితో **రూ.59,71,264/- (రూపాయలు యాభై తొమ్మిది లక్షల డెబ్బై ఒక వేల రెండు వందల అరవై నాలుగు మాత్రమే)**

**ఆస్తి వివరణ**

గుంటూరు జిల్లా, నల్లపాడు ఎస్ఆర్ఓ, తాడికొండ మండలం, బందరుపల్లి గ్రామపంచాయతి ఏరియా, బందరుపల్లి గ్రామం వద్దగల డోర్ నం.453లో 186చ.గ.లు లేదా 155.51చ.మీ.ల విస్తీర్ణంతో జి+2తో ల్యాండ్ మరియు ఆర్‌సిసి భవనము యొక్క మొత్తం భాగం మరియు సరిహద్దులు: **తూర్పు:** సైటు దారి, **దక్షిణం:** గుంటుపల్లి కోటేశ్వర రావు ఆస్తి, **పడమర:** ముప్పల శ్రీనివాస రావు ఆస్తి, **ఉత్తరం:** గుంటుపల్లి బాబూరావు ఆస్తి.

**రిజర్వు ధర: రూ.77,50,000/-; ధరావత్తు: రూ.7,75,000/- బిడ్ పెంపుదల: రూ.10,000/-**
**వేలం తేది: 12 మే 2023; వేలం సమయం: ఉ॥ 11.00గం.ల నుండి మ॥ 12.00గం.లు వరకు, అమ్మకం ముగింపు వరకు,**
**బిడ్ కొనసాగినచో ప్రతి బిడ్ కొరకు ఐదు నిమిషాల అపరిమిత పొడిగింపుతో.**
**ఆస్తిని పరిశీలించుట అనునది 04.05.2023న లేదా ముందుగా సా॥ 5:00గం.లుకు ముందు, ముందస్తు అనుమతితో ఏదేని పనిదినమున చేయవచ్చును.**

**(2) రుణగ్రహీత పేరు: శ్రీమతి నల్లమల్లి భవాని భర్త శ్రీ నల్లమల్లి నరేంద్ర బాబు, సహ-రుణగ్రహీత: శ్రీ నల్లమల్లి నరేంద్ర బాబు తండ్రి శ్రీ హరి గోపాల్, ఇరువురి నివాసం:** డోర్ నం.41-13-12, 1వ అంతస్తు, ఎఫ్-2, పాలపర్తి వారి వీధి, చౌదరి పేట, నాల గేట్ డాన్, విజయవాడ-520013.
**రుణ ఖాతా నంబర్లు: ఎల్ఎన్‌విజెవై00917-180000228** **డిమాండ్ నోటీసు: 10.02.2022**
**బకాయి మొత్తాలు: 03.02.2022** నాటికి వడ్డీ+ వ్యయాలు మొ॥వాటితో **రూ.26,47,026/-**
**(రూపాయలు ఇరువై ఆరు లక్షల నలభై ఏడు వేల ఇరువై ఆరు మాత్రమే)**

**ఆస్తి వివరణ**

**షెడ్యూలు-ఎ: ఆస్తి యొక్క షెడ్యూలు:** కృష్ణా జిల్లా, విజయవాడ రిజిస్ట్రేషన్ జిల్లా, పటమట సబ్-డిస్ట్రిక్ట్, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, విజయవాడ టౌన్, కృష్ణలంక, పాలపర్తివారి వీధి, ఎన్.టి.ఎస్.నం.:357, రెవెన్యూ వార్డు నం: 10, బ్లాక్ నం: 10, మున్సిపల్ వార్డు నం.30, పాత అసెస్మెంట్ నం: 27540ఎ, ప్రస్తుత అసెస్మెంట్ నం: 236038, పాత డోర్ నం.: 41-13-9, ప్రస్తుత డోర్ నం: 41-13-12, విస్తీర్ణం 230చ.గ.లు లేదా 192.30చ.మీ.ల సైటు. **సరిహద్దులు: తూర్పు:** కలగ రామచంద్ర శాస్త్రి, వెలమూరి ప్రసాద రావు ఆస్తి, 37.0అ.లు, **దక్షిణం:** కోట వెంకట కృష్ణ మోహన రావు ఆస్తి, 60.0అ.లు, **పడమర:** 30అ.ల వెడల్పు మున్సిపల్ రోడ్ 32.0అ.లు, **ఉత్తరం:** కొల్లపుడి రాజరాజేశ్వరి ఆస్తి 60.0అ.లు.
**ఏదైతే గ్రౌండ్, మొదటి, రెండవ మరియు మూడవ అంతస్తులు కలిగియున్న దాని నిర్మాణంగల "శ్రీ లక్ష్మినివాస్" పేరున బహుల అంతస్తుల భవనముతోపాటు 230చ.గ.లు లేదా 192.30చ.మీ.ల విస్తీర్ణంగల పైవి.**
**షెడ్యూలు-బి:** డోర్ నం.: 41-13-12 గల ప్రస్తుత అసెస్మెంట్ నం.233788తో 50చ.అ.ల ప్లింత్ ఏరియాలో 735చ.అ.ల ప్లింత్ ఏరియా& ఉమ్మడి ఏరియాలలో సదరు **"శ్రీ లక్ష్మి నివాస్"** యొక్క మొదటి అంతస్తులో ఫ్లాట్ నం.2గల ఒక ఫ్లాట్‌తోపాటు 230చ.గ.లు లేదా 192.30మీ.ల సైటునకుగాను 35చ.గ.లు లేదా 29.264చ.మీ.ల విస్తీర్ణం కలిగియున్న విడదీయలేని, సూచించని సైటు భాగం మరియు **సరిహద్దులు: తూర్పు:** ఫ్లాట్ నం.: 1 మొదటి అంతస్తులో, **దక్షిణం:** ఓపెన్ టు స్కై, **పడమర:** ఓపెన్ టు స్కై (మున్సిపల్ రోడ్డువైపు), **ఉత్తరం:** ఓపెన్ టు స్కై.
**(ఈ ఆస్తి పత్రం నం.6964/2012 ఆఫ్ ఎస్ఆర్ఓ పటమట) కారిడార్, మెట్లు, వాటర్ డ్రైనేజి, బాల్కనీ మాత్రమేలో అన్ని ఉమ్మడి హక్కులతోపాటు డోర్ నం.41-13-12గల ప్రస్తుత అసెస్మెంట్ నం.233788 గల 50చ.అ.ల ప్లింత్ ఏరియాలో ఉమ్మడి ఏరియాలు మరియు 735చ.అ.ల ప్లింత్ ఏరియాలో సదరు "శ్రీ లక్ష్మి నివాస్" యొక్క మొదటి అంతస్తు ఫ్లాట్ నం.2 గల పై ఒక ఫ్లాట్‌తో.**

**రిజర్వు ధర: రూ.32,85,000/-; ధరావత్తు: రూ.3,28,500/- బిడ్ పెంపుదల: రూ.10,000/-**
**వేలం తేది: 12 మే 2023; వేలం సమయం: మ॥ 01.00గం.ల నుండి మ॥ 2.00గం.లు వరకు,**
**అమ్మకం ముగింపు వరకు, బిడ్ కొనసాగినచో ప్రతి బిడ్ కొరకు ఐదు నిమిషాల అపరిమిత పొడిగింపుతో.**
**ఆస్తిని పరిశీలించుట అనునది 03.05.2023న లేదా ముందుగా సా॥ 5:00గం.లుకు ముందు, ముందస్తు అనుమతితో ఏదేని పనిదినమున చేయవచ్చును.**

| | |
|---|---|
| ఏవేని సందేహాల కొరకు దయచేసి సంప్రదించండి: | **శ్రీ బల్ల కరుణాకర్ రెడ్డి, మొబైల్ నం: 7995545355, శ్రీ వై. విజయ భాస్కర్ రెడ్డి, మొబైల్ నం: 9703051555. అథొరైజ్డ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఏజెన్సీ: మెసర్స్ షార్ప్ ప్రొఫెషనల్స్, శ్రీ కె. మధు, మొబైల్ నం: 8520082322.** |

కెవైసి పత్రాలతోపాటు ధరావత్తుతో బిడ్ కొరకు దరఖాస్తు దాఖలుచేయుట కొరకు చివరి తేది: **11.05.2023న సా॥ 04:00 గం.ల వరకు.**

**నియమ& నిబంధనలు: (1)** ఆసక్తిగల బిడ్డరుదారులు ఇ-వేలంలో పాల్గొనుట కొరకు అభ్యర్థన లేఖ, స్వంత ధృవీకరణ కాపీలు (1) గుర్తింపు రుజువు (కెవైసి) అనగా ఐడి కార్డు/ డ్రైవింగ్ లైసెన్స్/పాస్‌పోర్టు (2) ప్రస్తుత చిరునామా-సంప్రదింపుల రుజువు, (3) బిడ్డరుదారు యొక్క పాన్ కార్డు (4) వాలిడ్ ఇ-మెయిల్ ఐడి (5) సంప్రదించాల్సిన నంబరు (6) ఒరిజినల్ పత్రాల స్కాన్ కాపీలు మొ॥న వాటిని ఇమెయిల్ ఐడి recovery@ikfhomefinance.com కి కూడా దాఖలుచేయవలెను మరియు తోపాటు యుటిఆర్ నంబరు వంటి ధరావత్తు డిపాజిట్‌చేసిన రుజువులను దానిని ఐకెఎఫ్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్, కార్పొరేట్ ఆఫీసు: ఐకెఎఫ్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్, మై హోమ్ ట్వీజా, 11వ అంతస్తు, ఎం హోటల్, హైటెకం సిటీ మెయిను రోడ్డు, బి/ఎసు ట్రాన్సుకో సబు స్టేషను, రాయిదుర్గ, హైదరాబాదు, తెలంగాణ-500081కు సమర్పించవలెను. **(2) ధరావత్తు డిపాజిటు (ఇఎండి) వివరాలు: ధరావత్తు మొత్తాన్ని ఇందు దిగువ పేర్కొన్న ఖాతా వివరాలు: ఖాతా నం.11520200014177, ఐఎఫ్ఎసుసి: ఎఫ్‌డిఆరుఎల0001152, బ్యాంకు పేరు: ది ఫెడరలు బ్యాంకు లిమిటెడు, బ్రాంచి: విజయవాడ-520 002కు ఐకెఎఫు హోము ఫైనాన్సు లిమిటెడు పేరున ఆరుటిజిఎసు/ఎనుఇఎఫుటి రూపేనా డిపాజిటుచేయవలెను.** (3) తదుపరి సందేహాల కొరకు బిడ్డరుదారులు సంప్రదించండి: బ్యాంకు యొక్క ఆమోదిత సర్వీసు ప్రొవైడరు **మెసర్సు సి1 ఇండియా ప్రైవేటు లిమిటెడు,** బిల్డింగ్ నం.301, ఉద్యోగ్ విహార్, ఫేజ్-2, గల్ఫ్ పెట్రోకెమ్ బిల్డింగ్, గురుగాం, హర్యానా-122015,https://www.bankeauctions.com, హెల్ప్‌లైన్ **+91-124-4302020/21/22/23/24, +91-9700333933, ఇమెయిల్ ఐడి:** support@bankeauctions.com మరియు bikkina.gandhi@c1india.com,ను ఇ-వేలం తేదీకి ముందు సంప్రదించవచ్చును.

**తేది: 08.04.2023, ప్రదేశం: విజయవాడ** — **సం/- అధీకృత అధికారి, ఐకెఎఫ్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్**

# సుఖోయ్‌లో రాష్ట్రపతి

**తేజ్‌పూర్:** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శనివారం అసోంలోని తేజ్‌పూర్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ నుంచి సుఖోయ్ 30 (ఎంకెఐ) ఫైటర్ జెట్‌లో 30 నిమిషాల పాటు విహరించారు. సుఖోయ్ జెట్ ఉదయం 11:08 గంటలకు బయలుదేరి...11.38 గంటలకు ల్యాండ్ అయింది. సుఖోయ్‌లో ప్రయాణించిన రెండో మహిళా రాష్ట్రపతిగా ముర్ము నిలిచారు. అంతకు ముందు మాజీ రాష్ట్రపతి ప్రతిభా సింగ్ పాటిల్ కూడా సుఖోయ్‌లో ప్రయాణించారు. ఎయిర్‌ఫోర్స్ అధికారులు వివరాల ప్రకారం, రాష్ట్రపతి 30 నిమిషాల ప్రయాణంలో బ్రహ్మపుత్ర , తేజ్‌పూర్ వ్యాలీని కవర్ చేశారు. ఈ విమానం సముద్ర మట్టానికి దాదాపు రెండు కిలోమీటర్ల ఎత్తులో గంటకు 800 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించింది. ఈ విమానాన్ని 106 స్క్వాడ్రన్ కమాండింగ్ ఆఫీసర్ గ్రూప్ కెప్టెన్ నవీన్ కుమార్ నడిపారు. విమాన ప్రయాణానికి ముందు వైమానిక దళ కార్యాచరణ సామర్థ్యం గురించి అధికారులు రాష్ట్రపతికి వివరించారు. ముర్ము కంటే ముందు, దేశ 12వ రాష్ట్రపతి ప్రతిభా సింగ్ పాటిల్ 2009లో సుఖోయ్‌లో ప్రయాణించారు. ప్రతిభా పాటిల్ సుఖోయ్‌లో ప్రయాణించి రెండు ప్రపంచ రికార్డులు సృష్టించారు. అందులో ఒకటి ప్రపంచంలోనే సుఖోయ్‌లో ప్రయాణించిన తొలి మహిళా అధ్యక్షురాలుగా మరొకటి అతి పెద్ద వయసు (74 ఏళ్లు) ఉన్న మహిళగా ప్రతిభా పాటిల్ రికార్డు సాధించారు. ఆమె పేరు గిన్నిస్ బుక్‌లో కూడా నమోదైంది. ప్రతిభా పాటిల్ కంటే ముందు, డాక్టర్ అబ్దుల్ కలాం రాష్ట్రపతిగా ఉన్నప్పుడు జూన్ 8, 2006న సుఖోయ్ నడిపారు. అలా ఫీట్ చేసిన దేశానికి తొలి రాష్ట్రపతి ఆయనే. అతని తర్వాత ప్రతిభా పాటిల్ సుఖోయ్‌లో పయనిస్తే.. ఇప్పుడు ద్రౌపది ముర్ము అలా చేసిన మూడవ రాష్ట్రపతి కావటం విశేషం. నిర్మలా సీతారామన్ కూడా 2018 జనవరి 17న రక్షణ మంత్రిగా ఉన్నప్పుడు సుఖోయ్ 30ఎంకెఐలో ప్రయాణించారు. దేశంలోనే అత్యాధునిక యుద్ధ విమానమైన సుఖోయ్‌లో ప్రయాణించిన తొలి మహిళగా గుర్తింపు పొందారు.

## లైంగికదాడి కేసు బదిలీకి 'నో'

**న్యూఢిల్లీ :** లైంగికదాడి కేసు విచారణను పురుష న్యాయమూర్తి నుంచి మహిళా న్యాయమూర్తికి బదిలీ చేసేందుకు ఢిల్లీ హైకోర్టు నిరాకరించింది. బదిలీకి అంగీకరిస్తే ఈ తరహా కేసులను ప్రత్యేక కోర్టులకు పంపాలంటూ పుంఖానుపుంఖాలుగా అభ్యర్థనలు వస్తాయని వ్యాఖ్యానించింది. పోర్నోగ్రఫీ వెబ్‌సైట్‌లో బాధితురాలి ఫోటోను దుర్వినియోగం చేశారంటూ దాఖలైన ఈ కేసు విచారణ కోర్టులో అపరిష్కృతంగా ఉంది. లైంగిక ఆరోపణలను విచారించే కోర్టు నుంచి ఈ కేసును బాలల పరిరక్షణ కోర్టుకు బదిలీ చేయాలంటూ బాధితురాలు హైకోర్టును ఆశ్రయించారు. విచారణ కోర్టుకు హాజరు కావడం తనకు సౌకర్యవంతంగా లేదని ఆమె వాపోయారు. అందువల్ల కేసును మహిళా కోర్టుకు బదిలీ చేయాలని అభ్యర్థించారు. అయితే కేవలం ఆందోళన చెందిన కారణంగా కేసును బదిలీ చేయలేమని హైకోర్టు స్పష్టం చేసింది.

## లింగాయత్‌లపై కాంగ్రెస్ దృష్టి

- ఇప్పటికే 43 టిక్కెట్లు కేటాయింపు

**బెంగళూరు :** కర్ణాటక ఎన్నికల్లో అత్యంత ప్రభావం చూపే సామాజిక తరగతుల్లో ఒకటైన లింగాయత్‌లపై కాంగ్రెస్ దృష్టి సారించింది. రెండు విడతల్లో 166 నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్ వారిలో 43 స్థానాలను లింగాయత్‌లకు కేటాయించడం విశేషం. అయితే 224 సీట్లకు గానూ కనీసం 55 టిక్కెట్లను తమ సామాజిక తరగతికి ఇవ్వాలని కాంగ్రెస్‌లోని లింగాయత్ నాయకులకు డిమాండ్ చేస్తున్నారు. అంటే మరో 12 టిక్కెట్లు తమకు ఇవ్వాలని కోరుతున్నారు. మార్చి 29న ఎన్నికల కమిషన్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించడానికి ముందుగానే వీరు తమ డిమాండ్లపై పట్టుబట్టడం మొదలుపెట్టారు. మే 10న జరగనున్న ఎన్నికల కోసం కాంగ్రెస్ మార్చి 25న 124 మంది అభ్యర్థులతో మొదటి జాబితా రూపొందించగా, ఏప్రిల్ 6న 42 మంది అభ్యర్థులతో రెండో జాబితా విడుదలైంది. 166 టిక్కెట్లకు గానూ 43 టిక్కెట్లు లింగాయత్‌లకు ఇచ్చారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ 43 టిక్కెట్లు లింగాయత్‌లకు ఇచ్చింది. ముఖ్యమంత్రి అభ్యర్థిగా లింగాయత్ నేత బి.ఎస్.యడ్యూరప్పను పాలక బిజెపి తెరపైకి తీసుకురాకపోవడంతో ఎన్నికల్లో లింగాయత్ మద్దతును పొందే అవకాశాలు తమకే బాగా వున్నాయని కాంగ్రెస్ లింగాయత్ గ్రూపు భావిస్తోంది. అయితే కాంగ్రెస్ లింగాయత్‌లో ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరూ లేరు. మొత్తంగా లింగాయత్ కమ్యూనిటీ కాంగ్రెస్ వైపే వుందని ఆ పార్టీ శ్రేణులు అంచనా వేస్తున్నాయి. టిక్కెట్లు ఎక్కువగా ఇవ్వడం వల్ల పార్టీ విజయావకాశాలు మెరుగయ్యాయని లింగాయత్ నేత ఈశ్వర్ ఖాండ్రె తెలిపారు.

# నందిని వర్సెస్ అమూల్

- కర్ణాటక ఎన్నికల్లో ప్రచారాస్త్రంగా మారిన పాలు



కర్ణాటక ఎన్నికలు 2023

**బెంగళూరు :** కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికల్లో ఈ దఫా పాలు, పెరుగు కూడా ప్రచారాస్త్రాలుగా మారాయి. రాష్ట్రంలో సహకార సంఘంగా నడుస్తున్న నందిని పాలు, పాల ఉత్పత్తులకు విశేష ఆదరణ ఉంది. కన్నడ ప్రజాజీవనంలో నందిని ఒక భాగంగా మారిన నేపథ్యంలో అమూల్ పాలు, పాల ఉత్పత్తులను ప్రవేశపెట్టారు. నందిని పాల ఉత్పత్తుదారుల జీవితాలతో అమూల్ ప్రవేశపెట్టడం ద్వారా బిజెపి చెలగాటం ఆడుతోందని అక్కడి ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. అమూల్ పాల సరఫరాపై నిషేధం విధించాలని జెడిఎస్, కాంగ్రెస్‌తో పాటు పలు కన్నడ సంస్థలు డిమాండ్ చేశారు. ఈ విమర్శలపై ముఖ్యమంత్రి బొమ్మై స్పందిస్తూ అమూల్ పాలను కొంతమంది ఆన్‌లైన్‌లో తెప్పించుకుంటుంటే తామెలా ఆపగలమని చేతులెత్తేశారు. దీంతో ఈ దఫా ఎన్నికల్లో నందిని వర్సెల్ అమూల్ ఒక ప్రధాన ప్రచారాస్త్రంగా మారింది. నందిని సంస్థను అమూల్ విలీనం చేయాలని ఇటీవల కేంద్ర హోంమంత్రి అమిత్ షా సూచించినట్లు వార్తలు రావడంతో అది కన్నడనాట మరింత ఆగ్రహాన్ని రాజేసింది. పుండుపై కారం చల్లినట్టుగా నందినీ పెరుగు ప్యాకెట్‌పై హిందీ పదం దహీ వుండాలని కర్ణాటక పాల సమాఖ్యకు ఒక నిబంధన పెట్టడం కన్నడిగుల కోపం కట్టలు తెంచుకుంటోంది. ప్రభుత్వం తగు చర్యలు తీసుకుని, నందినిని కాపాడాలని, వాటి ఉత్పత్తులను రక్షించాలని మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఇప్పటికే డిమాండ్ చేశారు. అమూల్‌ను వ్యతిరేకించి, నందినిని కాపాడేందుకు పోరాటానికి సిద్ధమవాలని, కర్ణాటక గౌరవాన్ని కాపాడాలని పలు కన్నడ సంస్థలు పిలుపునిచ్చాయి. నందిని అన్నది మన గర్వకారణమని, దాన్ని ఎవరూ మన దగ్గర నుండి దోచుకోలేరని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు శివకుమార్ అన్నారు. అమూల్ పాల సరఫరాను ఆపకపోతే తమ పోరాటం కొనసాగుతుందని అనేక కన్నడ సంస్థలు ప్రకటించాయి. వేసవి కావడంతో నందిని పాలు, పెరుగు, నెయ్యి కొంతమేరా తగ్గింది. దాంతో ప్రత్యామ్నాయ ఉత్పత్తుల వైపు ప్రజలు మొగ్గు చూపుతున్న దశలో అమూల్‌ను బిజెపి ప్రభుత్వం రాష్ట్రంలోకి తీసుకొచ్చిందని విపక్షాలు విమర్శిస్తున్నాయి. కర్ణాటకలోనే కాకుండా పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రల్లో కూడా నందిని అగ్రస్థాయి పాల ఉత్పత్తిదారుగా నిలిచింది. సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతున్న నేపథ్యంలో నందిని ఉత్పత్తులన్నింటినీ తప్పనిసరిగా కాపాడతామని ముఖ్యమంత్రి బొమ్మై శనివారం ప్రకటించారు.

**kotak** **కోటక్ మహీంద్ర బ్యాంక్ లిమిటెడ్**

రిజిష్టర్డు ఆఫీసు: 27బికెసి, సి-27, జి-బ్లాక్ బంద్ర కుర్ల కాంప్లెక్స్ బంద్ర (ఈస్ట్) ముంబయి-400051

బ్రాంచి ఆఫీసు: 29-4-19, రహమాన్ పార్క్ వాటర్ ట్యాంక్ ఎదురు, కోదండరామిరెడ్డి వీధి, గవర్నరుపేట, విజయవాడ-520002.

అనుబంధం- IV-A (రూల్ 8(6) నిబంధనను సూచించారు)

**స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం విక్రయ నోటీసు**

సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 6(2) మరియు 8(6) తో చదువుతూ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 కింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం కం విక్రయ నోటీసు. రుణగ్రహీత(లు), హామీదారు(లు) మరియు ప్రత్యేకంగా సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా సెక్యూర్డ్ క్రెడిటార్‌కి తనఖా పెట్టబడిన ఆస్తి/ ఛార్జ్‌చేయబడిన/దిగువ వివరించిన స్థిరాస్తిని కోటక్ మహీంద్ర బ్యాంక్ లిమిటెడ్ (సెక్యూర్డ్ క్రెడిటార్/కోటక్ మహీంద్ర బ్యాంక్ లిమిటెడ్) యొక్క అధీకృత అధికారి ద్వారా 27.03.2023న "ఎక్కడ ఉంది", "ఏది ఉంది" మరియు "అక్కడ ఏమైన" ప్రాతిపదికన విక్రయించబడుతుంది. 1. శ్రీ. ఎర్రంశెట్టి సోమనాథ్, తండ్రి. చంద్రశేఖర్, చిరునామా: 8-10-17/3, కొత్త బావి బజార్, పాత పోలీస్ స్టేషన్ ప్రక్కన, నరసరాపేట, గుంటూరు జిల్లా-522601. ఆంధ్రప్రదేశ్. ఇక్కడ కూడా: 2. శ్రీ.ఎర్రంశెట్టి సోమనాథ్, తండ్రి. చంద్రశేఖర్, 8-104, కొత్త బావి బజార్, నరసరావుపేట, గుంటూరు జిల్లా-522601, ఆంధ్రప్రదేశ్, ఇక్కడ కూడా: 3. శ్రీ. ఎర్రంశెట్టి సోమనాథ్, తండ్రి. చంద్రశేఖర్, 1-3-18, రామన్నపేట, కొరిటేపాడు, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ (రుణగ్రహీత) నుండి బ్యాంకుకు రావల్సిన బకాయి రికవరీ కొరకు రూ.79,54,490.24/- (డెభై తొమ్మిది లక్షల యాభై నాలుగు వేల నాలుగు వందల తొంభై రూపాయల ఇరవై నాలుగు పైసలు మాత్రమే) 06.04.2023 నాటికి బకాయి మరియు సెక్యూర్డ్ క్రెడిటార్‌కి చెల్లించాల్సిన కాంట్రాక్టు రేటులో వడ్డీ, అదనపు వడ్డీ, ఖర్చులు మరియు ఇతర ఛార్జీలు.
స్థిరాస్తులు/ఆస్తి యొక్క సంక్షిప్త వివరణ తెలిసిన భారాలు మరియు విక్రయానికి సంబంధించిన కొని నిబంధనలు:

| లోను ఎకౌంట్ నం. | రుణగ్రహీత/సహ రుణగ్రహీత (లు)/ హామీదారు(లు) యొక్క పేర్లు | డిమాండ్ నోటీసు మొత్తం మరియు తేది | రిజర్వు ధర (ఆర్‌పి) | ఇఎమ్‌డి (ఆర్‌పి యొక్క 10 శాతం) మరియు చివరి తేది | తనఖీ తేది మరియు సమయం | వేలం తేది మరియు సమయం | మొత్తం బకాయి | ఏవైనా తెలిసిన భారాలు |
|---|---|---|---|---|---|---|---|---|
| HF37730866 (CRN 275278468) | శ్రీ. ఎర్రంశెట్టి సోమనాథ్ | రూ.50,36,525.01/- (యాభై లక్షల ముప్పై ఆరు వేల ఐదు వందల ఇరవై ఐదు రూపాయల ఒక పైసలు మాత్రమే) 11.11.2019 నాటికి బకాయి మరియు నోటీసు తేది 12.11.2019 | రూ. 40,00,000/- (నలభై లక్షల రూపాయలు మాత్రమే) | రూ. 4,00,000/- (నాలుగు లక్షల రూపాయలు మాత్రమే) మరియు చివరి తేది 26.04.2023 | 24.04.2023 ఉ. 11.00గం. నుండి మ.3.00గం. | 27.04.2023 మ.02.00 గం. నుండి 3.00గం. | 06.04.2023 నాటికి రూ.79,54,490.24/- (డెభై తొమ్మిది లక్షల యాభై నాలుగు వేల నాలుగు వందల తొంభై రూపాయల ఇరవై నాలుగు పైసలు మాత్రమే) | లేవు |

ఆస్తి/స్థిరాస్తుల యొక్క వివరాలు: స్థిరాస్తుల వివరణ: అంశం నం.1: గుంటూరు రిజిస్ట్రేషన్ జిల్లా పరిధిలో మరియు కొరిటేపాడు సబ్ రిజిస్ట్రేషన్ జిల్లా, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, కొరిటేపాడు, రామన్నపేట, పాత వార్డు నం.1, కొత్త వార్డు నం.2, బ్లాక్ నం.7 వద్ద ఉన్న ఆస్తి మొత్తం ఆ భాగం మరియు పార్శిల్ టి.ఎస్.496, మూల్యాకంనం నం.6307 మరియు 6306 పాత, కొత్త మూల్యాంకనం నం.లు.1021021446, 1021021445, బేరింగ్ డో.నం.1-3-18 కొలిచే 182.2/9 చ.గ.లు. బయటకు 3520 చ.గ.లు. ఉన్న హద్దులు: తూర్పు: దిగువ 2వ అంశం కొంత మేరకు మరియు మానం నాగేశ్వరరావుకు చెందిన ఆస్తి కొంత మేరకు 49.0 అడుగులు., పడమర: పులివర్తి వెంకట సుబ్బమ్మ మరియు కోట అన్నపూర్ణ కు చెందిన ఆస్తులు 49.0 అడుగులు., ఉత్తరం: కొమ్మినేని సాంబయ్య మరియు కొమ్మినేని వీరయ్య కు చెందిన ఆస్తులు 33.6 అడుగులు., దక్షిణం: మాశెట్టి రాజగోపాల రావు, బి.బసవయ్య మరియు ఘటనేని పుమయ్య కు చెందిన ఆస్తులు 33.6 అడుగులు. ఈ సరిహద్దుల పరిధిలో 182.2/9 చ.గ.లు. లేదా 152.16 చ.మీ.లు. కలిగి ఉన్న ఆర్‌సిసి మరియు ఎసిసి జింక్ షీట్ షెడ్‌తో అన్నీ నిర్మాణాలతో 2 భాగాలు.
అంశం నం.2 : గుంటూరు రిజిస్ట్రేషన్ జిల్లా పరిధిలో మరియు కొరిటేపాడు సబ్ రిజిస్ట్రేషన్ జిల్లా, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, కొరిటేపాడు, రామన్నపేట, పాత వార్డు నం.1, కొత్త వార్డు నం.2, బ్లాక్ నం.7 వద్ద ఉన్న ఆస్తి మొత్తం ఆ భాగం మరియు పార్శిల్ టి.ఎస్.496, కవరింగ్ పరిధిలో 16 చ.గ.లు. లేదా 13.37 చ.మీ.లు. బయటకు 3520 చ.గ.లు. కలిగి ఉన్న ఉమ్మడి పాత్‌వే ఉన్న హద్దులు: తూర్పు: మున్సిపల్ రోడ్డు 5.3 అడుగులు., పడమర: పైన అంశం నం.1లో పేర్కొన్న ఆస్తి 5.3 అడుగులు., ఉత్తరం: కొమ్మినేని వీరయ్య కు చెందిన ఆస్తి 27.0 అడుగులు., దక్షిణం: మానం నాగేశ్వరరావు కు చెందిన ఆస్తి 27.0 అడుగులు. ఈ సరిహద్దుల ఉమ్మడి పాత్‌వే కవరింగ్ పరిధిలో 16 చ.గ.లు. లేదా 13.37 చ.మీ.లు. మాత్రమే.
పై రెండు అంశముల కవరింగ్‌తో మొత్తం విస్తీర్ణం 198.2/9 చ.గ.లు. లేదా 165.71 చ.మీ.లు. కలిగి ఉన్న ఆర్‌సిసి మరియు ఎసిసి జింక్ షీట్ షెడ్‌తో అక్కడ ఉన్న అన్నీ నిర్మాణాలు మరియు ఉమ్మడి పాత్‌వే.

బ్యాంక్ ఆమోదించిన సర్వీస్ ప్రొవైడర్ మెసెర్స్. సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా వారి వెబ్ పోర్టల్ www.bankeauctions.com లో వేలం ఆన్‌లైన్‌లో నిర్వహించబడుతుంది.
ఎటువంటి కారణం చెప్పకుండానే ఏ సమయంలోనైనా ఇ-వేలం రద్దు చేయడానికి సంపూర్ణ విచక్షణ అధీకృత అధికారికి ఉంటుంది.
ఆన్‌లైన్ ఇ-వేలం బిడ్ ఫారం, డిక్లరేషన్ మొదలైన వాటిని కలిగి ఉన్న ఇ-వేలం విక్రయ టెండర్ డాక్యుమెంట్ యొక్క వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం, దయచేసి అందించిన లింక్ www.bankeauctions.com & https://www.kotak.com/en/bank-auctions.html ను చూడండి మరియు శ్రీ. నాగేంద్ర-8976898308 మరియు శ్రీ. రామచంద్రన్ రాళ్లబండి- మొబైల్-9515662010 కూడా సంప్రదించవచ్చు.

**తేది: 09.04.2023, ప్రదేశం : విజయవాడ** — **సం/- అధీకృత అధికారి, కోటక్ మహీంద్ర బ్యాంక్ లిమిటెడ్**

# విశ్వాసం



రాము చాలా అల్లరి పిల్లాడు. తోటి విద్యార్థులతో ఎప్పుడూ గొడవ పడుతుండేవాడు. మూగ జీవులను బాధిస్తుండేవాడు. రాము తండ్రి వీరయ్య ఒక కుక్కని చేర దీసి పెంచుతుండేవాడు. కాని రాము ఆ కుక్కని కూడా కొడుతుండేవాడు. తన తండ్రి చాలా సార్లు రాముకి జంతువులను ప్రేమించాలని, తోటి వారితో స్నేహపూర్వకంగా ఉండాలని హితబోధ చేసాడు. కాని రాము మాత్రం ఆ మాటలను పెడచెవిన పెట్టే వాడు.

ఒక రోజు రాము ఆడుకుంటూ పడి మోకాలకు దెబ్బ తగిలి, నడవలేక పోయాడు. తోటి స్నేహితులు అతని అల్లరికి ఇదే తగిన శాస్తి జరిగిందని పట్టించుకోకుండా వెళ్లిపోయారు. రాము ఏడుస్తూ అక్కడే కూర్చుండి పోయాడు. అంతలో అటుగా వెళుతున్న తన కుక్క రాముని పసికట్టి వెంటనే రాము తండ్రి వీరయ్యను తీసుకుని వచ్చింది. వీరయ్య రాముని ఆసుపత్రికి తీసుకుని వెళ్ళి కట్టు కట్టించాడు. తను కుక్కని కొట్టినా తనపై ప్రేమ చూపి రక్షించినందుకు కుక్కను దగ్గరకు తీసుకుని ముద్దాడాడు. అప్పటినుండి మూగ జీవులపై ప్రేమతో, తోటివారితో స్నేహపూర్వకంగా ఉండటం నేర్చుకున్నాడు.

**- కయ్యూరు బాలసుబ్రమణ్యం**
**77802 77240**

## లెక్క తేల్చండి

**చిన్నారులూ... ఇక్కడున్న పట్టికలో రకరకాల బొమ్మలున్నాయి. వాటిని నెంబర్లుగా గుర్తించి గణించాము. చివరి లైన్లో ఉన్న బొమ్మల అంకెల ఆధారంగా మీరు జవాబు రాబట్టండి.**




**86 : జవాబు**

## నేను గీసిన బొమ్మ

**సోమూరి వైశ్వి,**
**1వ తరగతి,**
**బ్లూమిగ్డేల్ ఇంటర్నేషనల్ స్కూలు, గంగూరు,**
**విజయవాడ,**
**ఎన్టీఆర్ జిల్లా.**

**పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com**

# నేరం జరిగింది.. శిక్ష మాత్రం లేదు!

**ఇదొక విషాదకరమైన సందర్భం. న్యాయానికి నిలువెల్లా అన్యాయం జరిగిన అమానవీయం. ఆ ఆదివాసీ మహిళల మీద అత్యాచారం జరిగిన మాట నిజమే! కానీ, నిరూపణ జరగలేదు. ఆ పోలీసులు అకృత్యానికి పాల్పడ్డ ఘోరం నిజమే! అయితే, రుజువు కాలేదు.. కాబట్టి వాళ్లు నిర్దోషులు! కంచే చేను మేసినట్టు ... నేరస్తులే దర్యాప్తు దస్త్రం తయారు చేసినట్టు ... ఒక పథకం ప్రకారం .. ఈ కేసును నీరు కార్చేశారు. సాక్ష్యాలను చెరిపేసిన నిర్లక్ష్యం, నిందితులను కాపాడాలనే ప్రయత్నం ... తుట్టతుదకు ఫలించి ఆదివాసీ బాధిత మహిళల రోదన, ఆవేదనా అరణ్య రోదనే అయింది.**

'భూమి, ఆకాశమే మాకు సాక్షి.. మాపై అత్యాచారం జరిగిందని ఎంత చెప్పినా వినని ఈ పెద్ద మనుషులకు ఏమని సాక్ష్యం చెబుతాం? అసలు అటువంటిదేమీ జరగలేదని బుకాయించిన ఈ అధికారులకు ఎక్కడి నుండి సాక్ష్యాలు తీసుకొస్తాం? మేము అత్యాచారానికి గురయ్యామని మా భర్తలు మమ్మల్ని వదిలేశారు. మా బిడ్డలను మాకు కాకుండా చేశారు. పోలీసోళ్ల పెళ్లాళమని గేలి చేశారు. సంతల్లో.. అంగట్లో ఎన్నో అవమానాలు పడ్డాం. పాలు తాగించలేని నిస్సహాయ స్థితిలో ఆకలితో బిడ్డ కళ్లెదుటే మరణించిన దు:ఖాన్ని దిగమింగాం. ఇన్నేళ్ల తరువాత ఇప్పుడు తప్పు చేసిన ఆ పెద్ద మనుషులు పెద్ద మనుషులుగా చలామణి అయి ఎంచక్కా కాలర్ ఎగరేసుకుని బయటకి పోయారు. నిందలు, అవమానాలు, అన్యాయం జరిగిన మేము మాత్రం బిడ్డలను కోల్పోయి, ప్రాణాలు పోయి తలొంచుకుని ఎన్నోసార్లు కోర్టు మెట్లు దిగాం..' అంటున్న వాకపల్లి అత్యాచార బాధిత మహిళలు, ఇటీవల కోర్టు ఇచ్చిన తీర్పుతో సంతృప్తి పొందారా? అంటే వాళ్ల నుండి ఇలా సమాధానం వస్తోంది.

'మాకు ఇల్లు అవసరం లేదు. రోడ్డు అక్కర్లేదు.. బియ్యం వద్దు.. నీళ్ల వద్దు.. డబ్బులిస్తామన్నారు... అవేమీ వద్దు.. మేము కష్టపడి పనిచేసేటోళ్లం. కూలి పనులకెళ్లి డబ్బులు సంపాదించుకుంటాం. డబ్బుల్లేవని, తిండి లేదని, పిల్లలకు బట్టల్లేవని మేం ఇన్నేళ్లు పోరాడలేదు. మాకు అన్యాయం జరిగింది. న్యాయం కావాలని కోరాం.. పోరాడాం.. కాని ఇప్పుడు వచ్చిన తీర్పు మా కన్నీళ్లని తుడవలేదు' అంటూ బాధిత మహిళ చెబుతున్నప్పుడు ఆమె గొంతు దు:ఖంతో జీరబోయింది.

'అత్యాచారం జరిగిందని నా భర్త నన్ను వదిలేశాడు. వేరే పెళ్లి చేసుకున్నాడు. పిల్లలను పెంచడానికి చాలా కష్టపడ్డాను. పిల్లలను వదిలి కోర్టు విచారణలకు వెళ్లాను.. ఎన్నో అవమానాలు, బెదిరింపులు వచ్చాయి. అయినా మాలో ధైర్యం చావలేదు. తీర్పు ఇలా వస్తుందని అనుకోలేదు. అన్యాయం జరిగిందని నమ్ముతూనే నిందితులను వదిలేశారు.. ఇదెక్కడి న్యాయం' అంటూ ప్రశ్నిస్తోంది మరో బాధితురాలు.

'హైద్రాబాద్ దిశ హత్యాచార ఘటన జరిగినప్పుడు రోజుల వ్యవధిలోనే నిందితులను కాల్చి చంపేశారు. కాని మా కేసులో నిందితులను కనీసం ఉద్యోగం నుండి కూడా తొలగించలేదు. కూలీ చేసుకుని వచ్చిన డబ్బులు ఖర్చు పెట్టుకుని విచారణలకు హాజరయ్యేవాళ్లం. పేదోళ్లం.. గిరిజనులమని మమ్మల్ని చులకన చేశారు. వాళ్లు ఇచ్చింది ఏదీ మాకు వద్దు' అంటున్నది ఇంకో బాధిత మహిళ.

'అవమానాలు భరించలేక మా అమ్మ కుంగిపోయింది. ఆరోగ్యం క్షీణించి చనిపోయింది. ఘటన జరిగినప్పుడు నేను 6వ తరగతి చదువుతున్నాను. ఆ రోజు నన్ను, మా అమ్మని నాన్న ఇంట్లోకి రానివ్వలేదు. పంచాయతీలు, ఆచారాలు జరిగిన తరువాత అమ్మ ఇంట్లోకి వచ్చినా అవమానాలు వెంటాడాయి. ఆ దిగులుతోనే నాలుగేళ్లకు అమ్మ చనిపోయింది. ఆ రోజే నాన్న ఊరు వదిలి వెళ్లిపోయాడు. మా అమ్మంటే నాకు చాలా ఇష్టం. ఇప్పుడు ఇద్దరూ లేక అనాథలా ఉండిపోయాను' అంటూ ఓ బాధితురాలి కొడుకు చెబుతున్నప్పుడు అతని కళ్ల కన్నీటి సంద్రాలయ్యాయి.

**మేమూ మనుషులమే..**

ఇంత ఆవేదన అనుభవించిన వీరంతా 'మేమూ మనుషులమే.. న్యాయ వ్యవస్థపై నమ్మకం పెట్టుకుని ఇన్నేళ్లు పోరాటం చేశాం. అసలు మాకు అన్యాయం జరిగిందని చెప్పిన రోజు నుండి నేటి వరకు మాకు అనుకూలంగా ఏదీ జరగలేదు. మాపై అత్యాచారమే జరగలేదన్నారు. కల్లబొల్లి మాటలు చెబుతున్నామన్నారు. ప్రలోభపెట్టారన్నారు. ఒకటా రెండా ఎన్నో బెదిరింపులు, అవమానాలు.. అయినా ధైర్యంగా పోరాడం.. ఈ తీర్పు కోసం మాత్రం కాదు.. మా కళ్లెదుటే నిందితులు దర్జాగా కోర్టు మెట్లు దిగి వెళ్లారు. ఇన్నేళ్ల మా బాధ, వేదన మీరిచ్చే పరిహారం కోసం కాదు.. విచారణాధికారిపై చర్యలు తీసుకునే ముందు ఆ రోజు వచ్చిన పోలీసులను ఎందుకు వదిలేశారో సమాధానం చెప్పండి' అని ముక్తకంఠంతో ప్రశ్నిస్తున్నారు.

**అసలేం జరిగింది..**

2007 ఆగస్టు 20 ఉదయం 6 గంటలు.. కూంబింగ్ ప్రక్రియలో భాగంగా గ్రేహౌండ్స్ పోలీసు బలగాలు జి.మాడుగుల మండలం, వాకపల్లి గ్రామం చేరుకున్నాయి. నక్సలైట్లు ఇళ్లల్లో దాగున్నారని ఇళ్లన్నీ సోదా చేశారు. పొలాలు ధ్వంసం చేశారు. ఇంట్లో సామాను బయట పడేశారు. అడ్డుకున్న మహిళలపై విచక్షణారహితంగా దాడి చేశారు. బాలింతలనూ వదలలేదు. కాళ్లు పట్టుకుని బతిమాలినా వినలేదు. 11 మందిపై అత్యాచారం చేశారు. వారంతా కూలీనాలి చేసుకనే ఆదివాసీ బడుగుజీవులు. కొందు గిరిజన తెగకు చెందిన వారిలో ఎక్కువ శాతం మంది గిరిజన భాషలోనే మాట్లాడతారు. అఘాయిత్యం జరిగిందని చెప్పిన తరువాత నుండి ఈ మహిళలు ఎన్నో అవమానాలు పడ్డారు. మూడు నెలలు గ్రామంలోకి రానీయలేదు. ఊరిబయటే తలదాచుకున్నారు. ఆచారం ప్రకారం శుద్ధి చేసి గ్రామంలోకి అనుమతించినా భర్తలు ఆదరించక, బిడ్డలకు పాలు ఇవ్వకుండా కట్టడి చేయడం, పోలీసోడి భార్యలంటూ గేలిచేయడం వంటి ఎన్నో హేళనలు ఎదుర్కొన్నారు.

**మొదటి నుండీ కేసు నీరుగార్చే ప్రక్రియ**

నిందితులను రక్షించేందుకు, అత్యాచార గుర్తులు లేకుండా చేసేందుకు ఫోరెన్సిక్ ల్యాబ్‌కు తీసుకెళ్లే బట్టలను ఉతికించేశారు. మహిళలను స్నానాలు చేసి రమ్మన్నారు. వీటన్నింటి కంటే ముందు పోలీస్ స్టేషనులో కేసు ఫైల్ చేయకముందే వీరు చెప్పిందంతా అబద్ధమని, అసలు అలాంటిదేమీ జరగలేదని పోలీసు ఉన్నతాధికారులు ప్రెస్‌నోట్ విడుదల చేశారు.

**అలుపెరగని పోరాటం..**

గ్రామం దాటి బయటకి రాని ఆ మహిళలు 16 ఏళ్లుగా ఎన్నో పోరాటాలు చేశారు. ఆమరణ నిరాహార దీక్షలు, స్వతంత్ర కోర్టులో విచారణ చేయాలని పోరాటం, అధికారులంతా ఏకమై కేసును తప్పుదోవ పట్టిస్తున్నా, బెదిరిస్తున్నా, భయపడకుండా పోరాడారు. ఐదేళ్లు హైకోర్టులో, ఆ తరువాత సుప్రీం కోర్టులో కేసు విచారణ సాగి 2017 నుండి విశాఖ ప్రత్యేక కోర్టులో కేసు నడిచింది.

హత్రాస్, కతువా, నిర్భయ ఆయేషా, ప్రత్యూష లాంటి ఎంతోమంది ఆడబిడ్డలు బలైన దేశం మనది. మొన్నటికిమొన్న బిల్కిస్ కేసులో నిందితులుగా ముద్రపడిన వారినే విడుదల చేశారు. నిన్న హత్రాస్ కేసులో నిందితుల పేర్లు బాధితురాలి సాక్ష్యంలో చివర్లో ఉన్నాయని నిర్దోషులుగా ప్రకటించారు. ఈ రోజు వాకపల్లి.. విచారణాధికారి లోపభూయిష్ట విచారణ వల్ల నేరం రుజువుకాలేదని చెబుతూ నిందితులపై నమోదైన కేసు కొట్టేశారు. ఇంకెన్నాళ్లు ఈ అన్యాయాలు..? నేరం జరిగిందని బయటికి వస్తున్న మహిళలకే ఇంతటి అన్యాయం ఎదురైతే.. బెదిరింపులకు భయపడి, సమాజానికి తలొగ్గిన మహిళల పరిస్థితి ఏంటి? ప్రతి ఒక్క మహిళ ఈ అన్యాయంపై గళం విప్పాలి.. న్యాయం జరిగేవరకు పోరాడాలి.

### న్యాయం జరగలేదు..

16 ఏళ్ల ఈ పోరాటంలో ఇప్పుడు వచ్చిన ఈ తీర్పు ఆ మహిళలకు ఎంతమాత్రం ఊరటనివ్వదు. వాళ్లు పరిహారం కోసం పోరాడలేదు. న్యాయం కోసం పోరాడారు. న్యాయ వ్యవస్థపై అపార నమ్మకం పెట్టుకున్న అడవిబిడ్డలు వారు. కుటుంబాలు, సమాజం వెలివేసినా, ప్రాణాలు పోయినా న్యాయం కోసం నిలబడిన ఆదివాసీ బిడ్డలు వీరు. కోర్టులు, పోలీసులు వారి మాటలు నమ్మకపోయినా భూమి, ఆకాశాన్ని నమ్ముకున్నారు. అటువంటి అమాయకులకు వచ్చిన ఈ తీర్పు హర్షించేది కాదు. విచారణాధికారిపై చర్యలు తీసుకోమని, పరిహారం అందచేయమని చెప్పడమే కాస్తంత ఊరటనిస్తుంది.

**లలిత, చైతన్య మహిళా సంఘం.**

### గౌరవంగా జీవించే వీలు కల్పించాలి..

కావాలనే సాక్ష్యాలను తారుమారు చేశారు. ఇన్నాళ్లు ఎదురుచూసినా బాధితులకు న్యాయం జరగలేదు. పరిహారం సొమ్ము ప్రకటించకుండా లోక్ అదాలత్‌కు బదిలీచేశారు. ఇది సరికాదు. నిర్భయ చట్టం ప్రకారం వీరికి ఉద్యోగం ఇవ్వాలి. భూమి ఇవ్వాలి. సమాజంలో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్న వీరికి గౌరవంగా జీవించే వీలు కల్పించాలి. విచారణాధికారిపై వెంటనే చర్యలు తీసుకోవాలి.

**బి.ప్రభావతి, ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు**

# జాతరలో 'పుష్ప..'

మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, రవిశంకర్ యలమంచిలి నిర్మిస్తున్న చిత్రం 'పుష్ప : ది రూల్'. అల్లు అర్జున్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో రష్మిక కథానాయిక. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. శనివారం అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా 'హంట్ ఫర్ పుష్ప' పేరుతో కాన్సెప్ట్ వీడియోని విడుదల చేశారు. చీర, జాకెట్ ధరించి గ్రామ దేవత తరహా వేషధారణలో అల్లు అర్జున్ కనిపించారు. ఫహద్ ఫాజిల్, ధనుంజయ, రావు రమేష్, సునీల్, అనసూయ భరద్వాజ్ తదితరులు నటించిన ఈ చిత్రానికి దేవిశ్రీప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.

# సినిమా హిట్ అయితేనే..

హీరోల పుట్టినరోజులు ఎలా జరుగుతాయో అందరికీ తెలిసిందే. పదుల సంఖ్యలో కేక్ కటింగులు, అర్ధరాత్రి పార్టీలు, విదేశీ పర్యటనలు, రక్తదానాలు, అన్నదానాలు ... ఇలా హంగామా ఉంటుంది. దీనికి పూర్తి రివర్స్‌లో తన పుట్టినరోజు జరుగుతుందంటున్నాడు అఖిల్. శనివారం అతని పుట్టినరోజు. ఈ సందర్భంగా సోషల్ మీడియాలో తన అభిప్రాయాన్ని షేర్ చేశాడు. 'నాకు బర్త్ డే ప్లాన్స్ అంటూ ఏమీ లేవు. డబ్బింగ్ ఉంది, సాంగ్ రిహార్సల్స్ ఉన్నాయి. వాటితోనే బర్త్ డే. ప్రతి ఏటా నా పుట్టినరోజు ఇలానే ఉంటుంది. చూసేవాళ్లకు చాలా బోరింగ్ అనిపిస్తుంది. ఐదారుగురు ఫ్రెండ్స్ ఉన్నారు, వాళ్లు మాత్రం రాత్రి వచ్చి విషెష్ చెబుతారంతే. అక్కడ కూడా సర్ ప్రైజ్‌లు నాకిష్టం ఉండవు. వాళ్లు చెప్పి వస్తారు.' అంటున్నాడు. అయితే ఇప్పుడు 'ఏజెంట్' సినిమా హిట్టయితే మాత్రం బర్త్ డేను గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకుంటాను. అందులో ఎలాంటి డౌట్స్ అక్కర్లేదు. అందర్నీ పిలిచి పార్టీ ఇస్తాను.' అంటున్నాడు. పాన్ ఇండియా స్థాయిలో తీసిన ఈ సినిమా ఈ నెల 28న ఏజెంట్ థియేటర్లలోకి వస్తోంది. మమ్ముట్టి కీలకపాత్ర పోషిస్తున్న ఈ సినిమాకు సురేందర్ రెడ్డి దర్శకుడు.

## కె.విజయభాస్కర్ తెరకెక్కిస్తున్న 'జిలేబి'

కె.విజయభాస్కర్ దర్శకత్వంలో రూపొందుతున్న 'జిలేబి' చిత్రాన్ని పారిశ్రామికవేత్త గుంటూరు రామకృష్ణ ఎస్‌ఆర్కే బ్యానర్‌పై నిర్మిస్తున్నారు.

అంజు అశ్రాని సమర్పకురాలు. విజయభాస్కర్ తనయుడు శ్రీకమల్ ఈ చిత్రంతో హీరోగా ఇండస్ట్రీకి పరిచయమవుతున్నారు. శివాని రాజశేఖర్ నాయికగా నటిస్తున్నారు. తాజాగా ఈ చిత్ర ఫస్ట్‌లుక్ గ్లింప్స్ వెంకటేష్ విడుదల చేశారు. షూటింగ్ చాలా భాగం పూర్తయిన ఈ సినిమాలో మిగిలిన రెండు పాటలను ఫారిన్‌లో షూట్ చేయబోతున్నారు. త్వరలోనే సినిమా విడుదల తేదీ ప్రకటించనున్నట్లు నిర్మాతలు తెలిపారు.

## 'ఇండియానా జోన్స్' 5వ ఫ్రాంచైజ్ ట్రైలర్ వచ్చేసింది

హాలీవుడ్ సినిమా 'ఇండియానా జోన్స్' ఫ్రాంచైజ్ నుంచి ఐదో సినిమా 'ఇండియానా జోన్స్ అండ్ ది డయిల్ ఆఫ్ డెస్టినీ' పేరుతో జూన్ 30న విడుదల కానుంది. ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో రిలీజ్ కానున్న ఈ మూవీ ట్రైలర్‌ని మేకర్స్ రిలీజ్ చేశారు. గ్రాండ్ విజువల్స్, స్టన్నింగ్ యాక్షన్స్ ఎపిసోడ్స్‌తో ఈ ట్రైలర్ ఉంది. హ్యారిసన్ ఫోర్డ్ ఈ సినిమాలో హెన్రి వాల్టన్ పాత్రలో కనిపించారు. అయితే మొదటి నాలుగు సినిమాలని తెరకెక్కించిన స్టీఫెన్ స్పీల్బర్గ్' ఈ 5వ సినిమాని రూపొందించలేదు. 'జేమ్స్ మాన్గోల్డ్' ఇండియానా జోన్స్ 5వ సినిమాని డైరెక్ట్ చేశారు.

## వలస కార్మికుడి 'ఆడు జీవితం'

మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ నటించిన కొత్త చిత్రం 'ఆడు జీవితం'. ఇంగ్లీష్‌లో 'ది గోట్ లైఫ్' పేరుతో విడుదల చేస్తున్నారు. బ్లెస్సీ దర్శకత్వంలో తెరకెక్కించిన ఈ చిత్రం చిత్రీకరణ పూర్తి అయ్యింది. ఈ నేపథ్యంలో టీజర్ విడుదల చేశారు మేకర్స్. పొట్టకూటి కోసం సౌదీకి వలస వెళ్లిన ఓ వ్యక్తి ఎన్ని కష్టాలు పడ్డాడు.. అక్కడ బానిస బతుకు నుంచి బయట పడేందుకు ఎడారి బాట పట్టిన అతడు ఎలా బతికి ఇంటికి చేరాడు అనేది కథ. బెన్ని డానియల్ రాసిన నవల 'ఆడు జీవితం' ఆధారంగానే బ్లెస్సీ ఈ సినిమాను తీర్చిదిద్దాడు. మూడు నిమిషాలు ఉన్న ట్రైలర్‌లో పృథ్వీరాజ్ నటన ఆద్యంతం ప్రేక్షకులను కట్టిపడేస్తోం ది. వలస కూలీగా నటించిన తీరు, ఆహారం కోసం పడిన పాట్లు ప్రతి ఒక్కరినీ కంటనీరు తెప్పిస్తుంది. అమలాపాల్ హీరోయిన్‌గా నటించింది. ఏఆర్ రెహమాన్ సంగీతం అందించారు.

# రాజస్థాన్ రాజసం

**జైస్వాల్, బట్లర్ అర్ధసెంచరీలు**
**ఢిల్లీపై 57పరుగుల తేడాతో గెలుపు**

జైస్వాల్, బట్లర్ అర్ధసెంచరీలు

**గౌహతి:** ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపిఎల్) సీజన్-16లో రాజస్తాన్ రాయల్స్ రెండో విజయాన్ని సొంతం చేసుకుంది. తొలుత ఓపెనర్లు జోస్ బట్లర్(79), యశస్వి జైస్వాల్(60), అర్ధ శతకాలతో రాణించడంతో రాజస్తాన్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 199పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. ఛేదనలో ఢిల్లీ క్యాపిటల్స్ టాపార్డర్ బ్యాటర్లు చేతులెత్తేసినా.. కెప్టెన్ డేవిడ్ వార్నర్(65) ఒంటరి పోరాటంతో నిర్ణీత 20 ఓవర్లు ముగిసే సరికి 9వికెట్లు కోల్పోయి 142పరుగులే చేయగల్గింది. దీంతో రాజస్తాన్ జట్టు 57పరుగుల తేడాతో గెలిచి పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి ఎగబాకింది. ఛేదనలో ట్రెంట్ బౌల్ట్ దెబ్బకు ఢిల్లీ ఖాతా తెరవక ముందే రెండు ప్రధాన వికెట్లు కోల్పోయింది. రెండో బంతికే పృథ్వీ షా(0), మూడో బంతికి మనీశ్ పాండే ఎల్బీగా వెనుదిరిగాడు. రిలీ రూస్సో(14) స్వీప్ షాట్ ఆడబోయి అశ్విన్ బౌలింగ్‌లో వెనుదిరిగాడు. దాంతో 36 పరుగులకే ఢిల్లీ మూడు కీలక వికెట్లు కోల్పోయింది. లలిత్ యాదవ్(38), డేవిడ్ వార్నర్(65) ధాటిగా ఆడి నాలుగో వికెట్‌కు 64పరుగులు జోడించారు. ఆ తర్వాత పావెల్(2), అక్షర్ పటేల్(2) తొందరగా వెనుదిరిగారు. ట్రెంట్ బౌల్ట్, చాహల్‌కు మూడేసి, అశ్విన్ రెండు, సందీప్ శర్మకు ఒక వికెట్ దక్కాయి.

**దంచి కొట్టిన బట్లర్, యశస్వీ**

టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన రాజస్తాన్ రాయల్స్ ఓపెనర్లు జోస్ బట్లర్(79), యశస్వీ జైస్వాల్(60) అర్ధ శతకాలతో మెరిసారు. వీరిద్దరూ కలిసి తొలి వికెట్‌కు 8.3ఓవర్లలో 98పరుగులు జతచేశారు. జైస్వాల్ 31బంతుల్లో 11ఫోర్లు, సిక్సర్ సాయంతో 60పరుగులు చేయగా.. బట్లర్ 51బంతుల్లో 11ఫోర్లు, సిక్సర్‌తో 70పరుగులు చేశాడు. ప్రమాదకరమైన ఈ జోడీని ముఖేశ్ కుమార్ విడదీశాడు. జైస్వాల్ ఔటయ్యాక పరుగుల వేగం తగ్గింది. ఆఖర్లో హెట్‌మెయిర్(39) సిక్సలతో విరుచుకుపడ్డాడు. బట్లర్, యశస్వీ తొలి వికెట్‌కు 98 రన్స్ జోడించారు. సంజూ శాంసన్(0), రియన్ పరాగ్(7) నిరాశ పరిచారు. అక్షర్ పటేల్ బౌలింగ్‌లో సిక్స్ కొట్టి బట్లర్ ఫిఫ్టీకి చేరువయ్యాడు. ఈ విధ్వంసక ఓపెనర్ 33 బంతుల్లో 7 ఫోర్లు, ఒక సిక్స్‌తో 50 రన్స్ స్కోర్ చేశాడు. హెట్‌మెయిర్‌తో కలిసి స్కోర్ వేగం పెంచాడు. హెయిట్‌మెయిర్ ఆఖర్లో చెలరేగి ఆడడంతో రాజస్థాన్ భారీ స్కోర్ చేయగలిగింది. ఢిల్లీ బౌలర్లలో ముఖేశ్ కుమార్ రెండు వికెట్లు తీశాడు. కుల్దీప్ యాదవ్, రోవ్‌మన్ పావెల్‌కు ఒక్కో వికెట్ దక్కింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ జైస్వాల్‌కు లభించింది.

**ఐపిఎల్‌లో నేడు..**
గుజరాత్ × కోల్‌కతా
(వేదిక: అహ్మదాబాద్, మ.3.30గం॥లకు)
హైదరాబాద్ × పంజాబ్
(వేదిక: హైదరాబాద్, రా.7.30గం॥లకు)

**స్కోర్‌బోర్డు..**

**రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్:** యశస్వి జైస్వాల్ (సి అండ్ బి)ముఖేశ్ కుమార్ 60, జాస్ బట్లర్ (సి అండ్ బి)ముఖేశ్ కుమార్ 79, సంజు శాంసన్ (సి)నోర్జే (బి)కుల్దీప్ యాదవ్ 0, రియాన్ పరాగ్ (బి)రువాన్ పావెల్ 39, ధ్రువ్ జురెల్ (నాటౌట్) 8, అదనం 6. (20 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి) 199పరుగులు. **వికెట్ల పతనం:** 1/99, 2/103, 3/126, 4/175 **బౌలింగ్:** ఖలీల్ అహ్మద్ 2-0-31-0, నోర్జే 4-0-44-0, ముఖేశ్ కుమార్ 4-0-36-2, అక్షర్ పటేల్ 4-0-38-0, కుల్దీప్ యాదవ్ 4-0-31-1, రువాన్ పావెల్ 2-0-18-1.

**ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్:** పృథ్వీ షా (సి)సంజు (బి)బౌల్ట్ 0, వార్నర్ (ఎల్‌బి)చాహల్ 65, మనీష్ పాండే (ఎల్‌బి)బౌల్ట్ 0, రూసో (సి)జైస్వాల్ (బి)అశ్విన్ 14, లలిత్ యాదవ్ (బి)బౌల్ట్ 38, అక్షర్ పటేల్ (స్టంప్)సంజు (బి)చాహల్ 2, రువాన్ పావెల్ (సి)హెట్‌మైర్ (బి)అశ్విన్ 2, అభిషేక్ పోరెల్ (సి)హెట్‌మైర్ (బి)చాహల్ 7, కుల్దీప్ యాదవ్ (నాటౌట్) 3, నోర్జే (బి)సందీప్ శర్మ 0, ముఖేశ్ కుమార్ (నాటౌట్) 1, అదనం 10. (20 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి) 142పరుగులు. **వికెట్ల పతనం:** 1/0, 2/0, 3/36, 4/100, 5/111, 6/118, 7/118, 7/138, 8/139, 9/140 **బౌలింగ్:** బౌల్ట్ 4-1-29-3, సందీప్ శర్మ 4-0-20-1, అశ్విన్ 4-0-25-2, హోల్డర్ 3-0-28-0, చాహల్ 4-0-27-3, మురుగన్ అశ్విన్ 1-0-11-0

## ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌కు 13మందితో భారతజట్టు

**కోల్‌కతా:** త్వరలో జరగనున్న పురుషుల బాక్సింగ్ ప్రపంచకప్ ఛాంపియన్‌షిప్‌కు 13మందితో ఆటగాళ్లతో కూడిన బృందాన్ని పంపనున్నట్లు ఇండియా బాక్సింగ్ అసోసియేషన్(ఐబిఎ) శనివారం వెల్లడించింది. స్టార్ బాక్సర్లు శివ థాపా, దీపక్ భోరియా, మహ్మద్ హుసాముద్దీన్‌లతో కూడిన జట్టును ప్రకటించింది. వీరంతా ఈనెల 17నుంచి జరిగే ప్రాక్టీస్‌కు హాజరుకానున్నారు. ఇక బాక్సింగ్ ప్రపంచకప్ టోర్నీ ఈనెల 30నుంచి మే 14వరకు ఉజ్బెకిస్తాన్‌లోని తస్కెంట్ వేదికగా జరగనుంది. ఆసియా ఛాంపియన్‌షిప్ పతక విజేత శివ థాపా(63.5కిలోలు), రెండుసార్లు కామన్వెల్త్ క్రీడల కాంస్య పతక విజేత మహ్మద్ హుసాముద్దీన్(57కిలోలు), ఆసియా క్రీడల కాంస్య పతక విజేత దీపక్ భోరియా(51కిలోలు) విభాగంలో బరిలోకి దిగనున్నారు.

## ఫైనల్‌కు ప్రియాంశు

**సెమీస్‌లో నుయెన్‌పై వరుససెట్లలో గెలుపు**
**టైటిల్‌కై జొన్నెసన్‌తో ఢీ**

**ఓర్లీన్(ఫ్రాన్స్):** ఓర్లీన్ మాస్టర్స్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీ ఫైనల్లోకి ప్రియాంశు రాజవత్ ప్రవేశించాడు. శనివారం జరిగిన సెమీస్‌లో ప్రియాంశు 21-12, 21-9పాయింట్ల తేడాతో నాట్ నుయోన్(ఐర్లాండ్)పై వరుససెట్లలో విజయం సాధించాడు. ఈ మ్యాచ్‌ను ప్రియాంశు కేవలం 44 నిమిషాల్లోనే ముగించాడు. తొలి గేమ్ అర్ధభాగం ముగిసే సమయానికి ప్రియాంశు11-9తో నిలిచినా.. రెండో అర్ధభాగంలో చెలరేగి ఆడాడు. ప్రత్యర్థికి కేవలం 3పాయింట్లు మాత్రమే ఇచ్చి ఆ గేమ్‌ను 21-12తో ముగించాడు. ఇక రెండో గేమ్‌లో అయితే అర్ధభాగం ముగిసే సమయానికే 11-3పాయింట్ల ఆధిక్యతలో నిలిచి ఆ గేమ్‌ను 21-8తో ముగించి మ్యాచ్‌ను ముగించాడు. బిడబ్ల్యుఎఫ్ ర్యాంకింగ్స్‌లో ప్రియాంశు 58వ ర్యాంక్‌లో ఉండగా.. నుయోన్ 35వ ర్యాంక్ ఆటగాడు. మరో సెమీస్‌లో మాగ్నస్ జొన్నెస్సెన్(డెన్మార్క్) 10-21, 21-15, 21-19తో లి-లంగ్సీ(చైనా)పై చెమటోడ్చి నెగ్గాడు. ఆదివారం జరిగే టైటిల్ పోరులో ప్రియాంశు రాజవత్ 49వ ర్యాంకర్ జొన్నెస్సెన్‌తో తలపడనున్నాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68